ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 20.04.2026 | సంపుటి :12 సంచిక : 271 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ


**బీఆర్ఎస్ అధినేత సమక్షంలో పార్టీలో చేరనున్న జీవన్‌రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'కు సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న సీనియర్ నేత జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే ఘట్టానికి సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు సాయంత్రం 4:45 గంటలకు ఎర్రవల్లి నివాసం నుండి హెలికాప్టర్‌లో కేసీఆర్ జగిత్యాలకు బయలుదేరుతారు.తెలంగాణ సమాచారం జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుండి నేరుగా కేసీఆర్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో గులాబీ బాస్ కీలక భేటీ నిర్వహిస్తారు. పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం

మిగతా 2లో..



## మా హక్కులు హరించే
# అధికారం ఎవరిచ్చారు?



- తుదిశ్వాస వరకు అమెరికాతో పోరాడుతాం
- మా హక్కులు హరించే అధికారం ట్రంప్‌నకు లేదు
- శత్రువుకు లొంగిపోయే ప్రసక్తే లేదు: ఇరాన్
- అమెరికాతో ఒప్పందం ఇప్పట్లో కుదిరేలా లేదన్న టెహ్రాన్

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌కు ఉన్న చట్టబద్ధమైన అణు హక్కులను హరించే అధికారం ట్రంప్‌నకు లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అన్నారు. అణు హక్కులను వినియోగించకూడదని ఆయన తమపై ఆంక్షలు పెడుతున్నారని.. కానీ ఏ నేరానికి ఈ శిక్ష వేయాలనుకుంటున్నారో చెప్పట్లేదన్నారు. ఒక దేశం హక్కులను హరించడానికి ఆయన ఎవరని ప్రశ్నించారు. యుద్ధాన్ని విస్తరించే ఆలోచన తమకు లేదన్నారు. అదే విధంగా దేశంలో శాంతి, స్థిరత్వం, భద్రతను పరిరక్షించే బాధ్యత తమపై ఉందన్నారు. అందువల్లే గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించాలని తాము కోరుకుంటున్నామని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అగ్రరాజ్యానికి సూచించారు. అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అని, దానిపై ఆంక్షలు పెట్టే ఏ దేశమూ ఇరాన్‌పై విజయం సాధించలేదని పెజెష్కియాన్ అన్నారు. యురేనియం శుద్ధిపై అమెరికా పరిమితులు విధించడాన్ని తోసిపుచ్చిన ఆయన.. తమకు ఎవరి అనుమతి అవసరం లేదని వ్యాఖ్యానించారు. టెహ్రాన్ ఎప్పుడూ సొంతంగా ఘర్షణలు ప్రారంభించలేదని.. అలాగే తమ జోలికి ఎవరు వచ్చినా ఊరుకోబోమని అన్నారు. కారణం లేకుండా ఇతర దేశాలపై దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. ఇక, అమెరికాతో రెండో దశ చర్చలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది.

**అమెరికాతో ఒప్పందం..**
**ఇప్పట్లో కుదిరేలా లేదు: ఇరాన్**

హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేయడంతో అమెరికా–ఇరాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంతో జరుగుతున్న శాంతి చర్చల్లో కొంత పురోగతి సాధించినప్పటికీ తుది ఒప్పందం ఇప్పట్లో కుదిరేలా లేదని.. అది చాలా దూరంలో

మిగతా 2లో..

## విధ్వంసం చేస్తాం.. జాగ్రత్త!



- హర్మూజ్ మూసివేతతో ఇరాన్‌కే భారీ నష్టం
- ఆ దేశం రోజుకు రూ.4,600 కోట్లు కోల్పోతోంది
- జలసంధిలో పలు నౌకలపై ఇరాన్ దాడులు చేసింది
- అమెరికాకు మాత్రం ఏ నష్టమూ లేదు
- మేం న్యాయమైన ఒప్పందాన్ని ఇరాన్ ముందుంచాం
- యుద్ధంలో ఎలా గెలవాలో ఇజ్రాయెల్‌కు తెలుసు
- ఆ దేశం దానిని అంగీకరిస్తుందని ఆశిస్తున్నా: ట్రంప్

2లో..

## ఎక్కడికక్కడే ఇరాన్ నౌకలు సీజ్

ప్రపంచ వ్యాప్తంగా ఆ దేశ జలరవాణా వ్యవస్థను దెబ్బతీయడానికి అమెరికా వ్యూహం

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను
# ఆమోదించండి

### గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు సీఎం రేవంత్ వినతి

**హైదరాబాద్(జనంసాక్షి):** పెండింగ్‌లో ఉన్న ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లు ఆమోదించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రొఫెసర్.కోదండరామ్, అజారుద్దీన్ పేర్లు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఏ సభలో సభ్యుడు కానప్పటికీ మంత్రిగా అజారుద్దీన్ కొనసాగుతున్నారు. ఆయన మంత్రి పదవి చేపట్టి ఈ నెలాఖరుకు ఆరు నెలలు పూర్తి కానుంది. 6 మాసాల్లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఉండాల్సిన అవసరం ఉంది. గవర్నర్ ఆమోదించకపోతే ఈ నెల 30 తర్వాత అజారుద్దీన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే గవర్నర్‌ను సీఎం కలిసినట్లుగా తెలిసింది. దీంతో పాటు విద్యారంగానికి సంబంధించి పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లుగా ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది.

**విద్యారంగంపై చర్చ :**

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును పట్టి పిడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా లోక్‌భవన్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ యువతను,విద్యా

మిగతా 2లో..



## మరో జలసంధికి ముప్పు

బాబ్ అల్ మాండెబ్‌ను మూసేస్తామని హూతీల హెచ్చరిక



2లో..

# తమిళనాడులో ఘోరం

### బాణసంచా పరిశ్రమలో పేలుడు.. 22 మంది దుర్మరణం

### ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడులోని ఓ ప్రైవేటు బాణసంచా కర్మాగారంలో ఘోర ప్రమాదం సంభవించింది. విరుద్ నగర్ సమీపంలోని కట్టనార్‌పట్టిలో ఉన్న ఓ బాణసంచా తయారీ పరిశ్రమలో ఆదివారం మధ్యాహ్న సమయంలో ఫ్యాక్టరీలో భారీ పేలుడు జరగడంతో 22 మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. బాణాసంచా పేలుడు ధాటికి కలిగిన ప్రకంపనలు 10 కి.మీ దూరం వరకు విస్తరించాయని స్థానికులు చెబుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలా టనికి చేరుకుని ప్రస్తుతం సహాయక చర్యలు చేపట్టారు. పేలుడు ధాటికి బాణసంచా తయారీ పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు తీవ్రతకు పరిసరాలు కంపించిపోయాయి. సమీప ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 30 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ విషాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆరా తీశారు. వెంటనే ఘటనాస్థలికి

మిగతా 2లో..





## అకాల వర్షాలతో భారీ నష్టం

**రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన**

- కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు
- హైదరాబాద్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షం దంచికొట్టింది. హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ నగరంలో అకాల వానతో పాటు వడగళ్ల వర్షం కురిసింది. సికింద్రాబాద్, తిరుమలగిరి, అల్వాల్ మారేడుపల్లి

మిగతా 2లో..



## ఎక్స్‌ప్రెస్‌వేలు ప్రమాద కారిడార్లు కాకూడదు

### పాన్ ఇండియా గైడ్‌లైన్స్ జారీచేసిన సుప్రీంకోర్టు

- జాతీయ రహదారులపై భారీ వాహనాల పార్కింగ్‌కు పూర్తి నిషేధం
- అనధికార డాబాలు, హోటళ్లు 60 రోజుల్లో తొలగించాలి
- 75 రోజుల్లో అమలు నివేదిక సమర్పించాలని కేంద్రానికి ఆదేశం
- ప్రయాణికుల భద్రత ప్రభుత్వాల బాధ్యత అని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు ప్రమాదాలకు కేంద్రాలుగా మారకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పాలనాపరమైన నిర్లక్ష్యం, మౌలిక సదుపాయాల లోపాలు ప్రాణనష్టాలకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. రోడ్డు భద్రతను బలోపేతం చేయడానికి దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యంగా జాతీయ రహదారులపై భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌పై పూర్తిగా నిషేధం విధిస్తూ కఠిన ఆదేశాలు ఇచ్చింది. 2025 నవంబర్ 2, 3 తేదీల్లో రాజస్థాన్‌లోని ఫలోడి, తెలంగాణలోని రంగారెడ్డి

మిగతా 2లో..



## ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ
# ఉచిత ప్రయాణం

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- జూన్ 2 నుంచి పథకాన్ని అమలుచేసేందుకు ప్రణాళికలు
- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకే నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భాగ్యనగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ, కాలుష్య సమస్యలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓ కీలక ప్రణాళికతో ముందుకొచ్చింది. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ఎంఎంటీఎస్ ట్రైన్లలో మహిళలు, పురుషులు సహా అందరికీ ఉచిత ప్రయాణం అందించేలా చర్యలు తీసుకోవాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఫలితంగా

మిగతా 2లో..



## మహిళల్ని అడ్డుపెట్టుకుని
# మోదీ నాటకాలు

**మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధానివి రాజకీయ కుతంత్రాలు : మమతా బెనర్జీ**



**కోల్‌కతా(జనంసాక్షి):** మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం దురదృష్టకరమని మమతా బెనర్జీ మండిపడ్డారు. స్త్రీలను అడ్డుపెట్టుకొని నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. అందువల్లే వారి కుతంత్రాలను ప్రతిపక్షాలు కలిసికట్టుగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ప్రధాని మోదీ పతనం పార్లమెంట్‌లోనే మొదలయ్యిందని..అది బెంగాల్‌లోనూ కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టేందుకు భాజపా చేసిన విఫల యత్నం.. కేంద్రం అసలు రూపాన్ని బయటపెట్టిందని మమత పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎల్లప్పుడూ రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం కోసం పోరాడుతుందని.. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ రెండింటిలోనూ తమ పార్టీలోనే అత్యధిక నిష్పత్తిలో ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులు ఉన్నారన్నారు. అటువంటి తమ పార్టీ మహిళా రిజర్వేషన్‌ను ఎందుకు వ్యతిరేకిస్తుందని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర

మిగతా 2లో..

## టీఎంసీ మహిళలకు
# ద్రోహం చేసింది

**అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా శిక్ష అనుభవిస్తుంది : ప్రధాని మోదీ**

**కోల్‌కతా(జనంసాక్షి):** పార్లమెంట్‌లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లు- 2026 ఆమోదాన్ని అడ్డుకోవడం ద్వారా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు ద్రోహం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలే శిక్షిస్తారని స్పష్టం చేశారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ కాంగ్రెస్‌తో కుమ్మక్కై మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదాన్ని అడ్డుకుందని మండిపడ్డారు. పార్లమెంట్‌లోనూ, రాష్ట్ర అసెంబ్లీలలోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఈ బిల్లును టీఎంసీ

మిగతా 2లో..



## ఫేక్ కంటెంట్ తొలగించాలి

- ఏఐ కంటెంట్‌పై లేబుల్‌ను పెట్టాల్సిందే
- రాజకీయ పార్టీలకు ఈసీ సూచన




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరిలలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన చేసింది. తమ దృష్టికి వచ్చిన 3 గంటల్లోగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి నకిలీ కంటెంట్‌ను రాజకీయ పార్టీలు తొలగించాలని పునరుద్ఘాటించింది. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో మార్చి 15న ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినప్పటి నుంచి ఇప్పటిదాకా 11వేలకుపైగా ఫేక్ కంటెంట్‌లతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు, యూఆర్ఎల్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నామని ఈసీ వెల్లడించింది.ఆయా ఫేక్

మిగతా 2లో..

## తమిళనాడులో ఘోరం

వెళ్లాలని మంత్రులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయాన్ని అందించాలని సూచించారు.”విరుదునగర్ జిల్లా కాటానార్‌పట్టి బాణసంచా ఫ్యాక్టరీ పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. సహాయక చర్యలను వేగవంతం చేయడానికి, బాధిత కుటుంబాలను ఓదార్చడానికి గౌరవ మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని కోరాను. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించాను.”మరోవైపు ఈ పేలుడు ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో భారీ ప్రాణనష్టం సంభవించడం తమను ఎంతో కలచివేసిందని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.తమిళనాడు విరుదునగర్ జిల్లా కాటునార్‌పట్టిలో ముత్తుమాణికంకు చెందిన ‘వనజ ఫైర్‌క్రాకర్’ ఫ్యాక్టరీ ఉంది. దీనికి ప్రభుత్వ అనుమతి ఉంది. ఈ కర్మాగారంలోని 10కి పైగా గదులు ఉన్నాయి. వాటిలో సుమారు 30 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ రోజు సెలవు దినం అయినప్పటికీ, ఫ్యాక్టరీ ముందు భాగంలోని వరాండాలో బాణసంచా తయారీ, ముడి పదార్థాల నిర్వహణ పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే ముడి పదార్థాలు ఒకదానికొకటి రాపిడికి గురై ఒక్కసారిగా మంటలు అంటుకున్నట్లు ప్రాథమిక సమాచారం. దీనితో క్షణాల వ్యవధిలోనే మంటలు ఫ్యాక్టరీ అంతటా వేగంగా వ్యాపించి భారీ పేలుడు సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఘటనలో అక్కడికక్కడే 22 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు తీవ్ర గాయాలతో విరుదునగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని సమాచారం. దీనివల్ల మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కాగా, ప్రమాదం జరిగిన తర్వాత ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక, సహాయక దళాలు సహాయక చర్యలు చేపట్టాయి. రెస్క్యూ ఆపరేషన్ పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.కొన్ని రోజుల క్రితమే విరుదునగర్ సమీపంలోని వెంబకోట్టై ప్రాంతంలో జరిగిన బాణసంచా ఫ్యాక్టరీ ప్రమాదంలో నలుగురు మరణించారు. మళ్లీ అదే జిల్లాలో ఇంత భారీ స్థాయిలో ప్రాణనష్టం జరగడం స్థానిక ప్రజల్లో తీవ్రగ్భ్రాంతిని, భయాందోళనలను కలిగిస్తోంది.

## ఎక్స్‌ప్రెస్‌వేలు ప్రమాద కారిడార్లు కాకూడదు

జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 34 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ ప్రమాదాలకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను పరిశీలించిన అనంతరం దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలను ప్రకటించింది.దేశంలో మొత్తం రహదారుల పొడవులో జాతీయ రహదారులు కేవలం 2 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, మొత్తం రోడ్డు ప్రమాద మరణాల్లో దాదాపు 30 శాతం వాటిపైనే జరుగుతున్నాయని సుప్రీంకోర్టు గమనించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. నివారించగల కారణాల వల్ల ఒక్క ప్రాణం కూడా కోల్పోవడం రాష్ట్ర వ్యవస్థ వైఫల్యమని ధర్మాసనం స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు కేవలం ప్రాణాలను రక్షించడం మాత్రమే కాకుండా, సురక్షిత వాతావరణాన్ని కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యత అని సుప్రీంకోర్టు పేర్కొంది.మానవ ప్రాణాల రక్షణ కంటే ఆర్థిక లేదా పరిపాలనా పరిమితులు ముఖ్యమవ్వవని తేల్చిచెప్పింది. జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జాతీయ రహదారుల క్యారేజ్‌వే, పేవ్డ్ షోల్డర్‌పై ఎట్టి పరిస్థితుల్లోనూ భారీ వాహనాలు నిలపకూడదు. కేవలం ప్రత్యేకంగా కేటాయించిన పార్కింగ్ బేలు, లే-బైలు లేదా రహదారి పక్కన ఏర్పాటు చేసిన సదుపాయాల వద్ద మాత్రమే వాహనాలను నిలపాలి. ఈ నిబంధనల అమలుకు అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏటీఎంఎస్) వినియోగించాలి. రియల్‌టైమ్ అలర్ట్‌లు, ఉఖూ ఆధారిత ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలు, ఈ- చలాన్ల ద్వారా ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.జాతీయ రహదారుల రైట్ ఆఫ్ వే పరిధిలో కొత్తగా దాబాలు, హోటళ్లు, వాణిజ్య నిర్మాణాలు నిర్మించడం తక్షణమే నిషేధించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇప్పటికే ఉన్న అనధికార నిర్మాణాలను 60 రోజుల్లోపు తొలగించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం సహించబోమని స్పష్టం చేసింది. హైవే భద్రతా జోన్లలో ఎలాంటి కొత్త లైసెన్సులు లేదా ఎన్‌ఓసీలు ఇవ్వాలంటే ముందుగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఔఊంఎ) లేదా పీడబ్ల్యూడీ అనుమతి తప్పనిసరి. ఇప్పటికే జారీ చేసిన లైసెన్సులను 30 రోజుల్లోపు సమీక్షించాలని సూచించింది.ప్రతి జిల్లాలో జాతీయ రహదారులు ఉన్న చోట జిల్లా స్థాయిలో రహదారి భద్రతా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందులో జిల్లా యంత్రాంగం, పోలీసులు, ఔఊంఎ, పీడబ్ల్యూడీ, స్థానిక సంస్థల ప్రతినిధులు ఉండాలని పేర్కొంది.

ప్రయాణికుల భద్రత ప్రభుత్వ బాధ్యత : సుప్రీంకోర్టు

దేశంలో పెరిగిపోతున్న రహదారి ప్రమాదాల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వెలువరించింది. రాజస్థాన్‌లోని ఫలోడీ, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదాలను సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం విచారణ జరిపింది. రహదారులపై అక్రమ పార్కింగ్‌లు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కును ఇచ్చిందని గుర్తుచేసింది. ఈ అధికరణంలోనే ప్రతి ప్రయాణికుడికి ప్రమాదరహితంగా వెళ్లే హక్కు అంతర్గతంగా ఉందని తెలిపింది. ప్రయాణికుల భద్రతను ప్రభుత్వ బాధ్యతగా చూడాలని తెలిపింది.

## ఫేక్ కంటెంట్ తొలగించాలి

కంటెంట్‌లను తొలగించి, వాటిని పోస్ట్ చేసిన వారిపై పోలీసు స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించామని ఈసీ పేర్కొంది. వీటిపై బాధ్యుల నుంచి వివరణలు, ఖండనలను స్వీకరించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. సోషల్ మీడియా, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌లతో ముడిపడిన చట్టపరమైన నిబంధనలను రాజకీయ పార్టీలన్నీ తు.చ తప్పకుండా పాటించేలా ఎన్నికలు జరుగుతున్న అన్నిచోట్లా పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పింది.మార్చి 15 నుంచి ఇప్పటివరకు తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరిలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన 3,10,393 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఈసీ తెలిపింది. వీటిలో దాదాపు 96.01 శాతం పరిష్కారాలను, ఫిర్యాదు అందిన 100 నిమిషాలలోపే సాధించామని పేర్కొంది. ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సీ -విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తమకు సమాచారాన్ని అందించారని చెప్పింది.

**ఏఐ కంటెంట్‌పై లేబుల్‌ను పెట్టాల్సిందే!**

”రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రచార ప్రతినిధులు ఒకవేళ సోషల్ మీడియా వేదికల్లో ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను పోస్ట్ చేస్తే కచ్చితంగా దానికి ఏఐ జనరేటెడ్ లేదా సింథటిక్ కంటెంట్ లేదా డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్ లేదా ఏఐ ఆల్టర్డ్ కంటెంట్ అనే లేబుల్‌ను వినియోగించాలి. దీంతోపాటు ఆ పోస్ట్ చేస్తున్న సంస్థ వివరాలనూ బహిర్గతపర్చాలి. ఎన్నికల పారదర్శకత, ఓటర్ల విశ్వాసాన్ని పొందేందుకు ఇవన్నీ చేయాల్సిందే. అసోం, కేరళ, బంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిలలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించేలా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఉండే పోస్టులను ఐటీ చట్టం కింద నోటిఫై చేయబడిన ఐటీ నోడల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వాటిపై చర్యలు తీసుకుంటున్నారు. అన్ని చోట్లా పోలింగ్ తేదీలకు ముందు 48 గంటల పాటు కచ్చితంగా నిశ్శబ్ద కాలాన్ని పాటించాలి. ఈ వ్యవధిలో ఏ రూపంలోనూ అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల ప్రచారం చేయకూడదు. దీన్ని మీడియా వేదికలు, టీవీ ఛానళ్లు, రేడియోలు, పత్రికలు, సోషల్ మీడియా పాటించాల్సిందే” అని ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది.

# మా హక్కులు హరించే అధికారం ఎవరిచ్చారు?

ఉందని అభిప్రాయపడ్డారు. చర్చల్లో చాలా అంతరాలు కొనసాగుతున్నాయని.. పలు ప్రాథమిక అంశాలు ఇంకా మిగిలే ఉన్నాయని తెలిపారు. వారాల తరబడి జరిగిన యుద్ధంలో ఇరాన్ క్షేత్రస్థాయిలో విజయం సాధించిందన్నారు. తమ డిమాండ్లను అగ్రరాజ్యం అంగీకరించినందుకే తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించామని పేర్కొన్నారు.ఈ యుద్ధంలో అనుకున్న లక్ష్యాలను అమెరికా సాధించలేకపోయిందని మహమ్మద్ బఘేర్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధి ఇప్పటికీ, ఎప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే ఉంటుందన్నారు. తమపై పలు డిమాండ్లను రుద్దడానికి శత్రువులు ప్రయత్నించారని.. అందుకు తాము అంగీకరించకపోవడంతో చర్చలు ఆలస్యమవుతున్నా యని చెప్పారు. తదుపరి విడత చర్చలకు ఇంకా తేదీ ఖరారు కాలేదన్నారు. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగిస్తున్నామని.. చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన అనంతరం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.శనివారం వైట్‌హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. హర్మూజ్ విషయంలో ఇరాన్ అతి చేస్తోందని విమర్శించారు. జలసంధిని తిరిగి తెరిపించడానికి సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

# విధ్వంసం చేస్తాం.. జాగ్రత్త!

వాషింగ్టన్(జనంసాక్షి): హర్మూజ్ జలసంధిలో పలు నౌకలపై ఇరాన్ దాడులు చేసిందని.. ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. హర్మూజ్ మూసివేతతో ఇరాన్ రోజుకు సుమారు రూ.4,600 కోట్లు (500 మిలియన్ డాలర్లు) నష్టపోతోందన్నారు. అమెరికాకు ఏ నష్టమూ లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల కోసం తమ ప్రతినిధులు సోమవారం పాకిస్థాన్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు.“మేం న్యాయమైన, సహేతుకమైన ఒప్పందాన్ని ఇరాన్ ముందుంచాం. ఆ దేశం దానిని అంగీకరిస్తుందని ఆశిస్తున్నా. లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలను నాశనం చేస్తాం. ఇక మీదట అంత మంచివాడిలా ఉండను. ఇరాన్ యంత్రాంగానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది” అని ట్రంప్ హెచ్చరించారు.ఇటీవల పాకిస్థాన్ వేదికగా అమెరికా- ఇరాన్‌ల మధ్య జరిగిన మొదటి విడత శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. సుదీర్ఘంగా సాగిన ఈ చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందమూ కుదరలేదు. ఇరాన్ తమ షరతులు అంగీకరించలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. అయితే, అమెరికా అర్థం లేని డిమాండ్లు చేసిందని ఇరాన్ ఆరోపించింది.

**యుద్ధంలో ఎలా గెలవాలో ఇజ్రాయెల్‌కు తెలుసు: ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. అమెరికాకు ఇజ్రాయెల్ గొప్ప మిత్రదేశమని అభివర్ణించారు. సంఘర్షణల సమయంలో కొన్ని దేశాలు తమ నిజస్వరూపాన్ని బయటపెట్టాయన్నారు. కానీ, ఇజ్రాయెల్ మాత్రం వాటిలా కాకుండా అన్ని సమయాల్లో తమ వెంట నిలిచిందన్నారు. ఇజ్రాయెలీలు చాలా ధైర్యవంతులు, విధేయులు, తెలివైనవారని ప్రశంసించారు. యుద్ధంలో ఆ దేశం గట్టిగా పోరాడుతుందని.. ఎలా గెలవాలో దానికి తెలుసని అన్నారు. ఓవైపు ఇజ్రాయెల్‌ను పొగుడుతూనే మరోవైపు నాటో మిత్రదేశాలపై అమెరికా అధ్యక్షుడు విమర్శలు గుప్పించారు. ఇరాన్‌తో యుద్ధం, హర్మూజ్‌ను తిరిగి తెరవడానికి ప్రయత్నించిన సమయంలో తమకు మద్దతు ఇవ్వడానికి ఆయా దేశాలు నిరాకరించాయన్నారు. అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ ఈ కూటమి అండగా లేదని ట్రంప్ ఆరోపించారు. భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు ఉండకపోవచ్చున్నారు. ఈ విషయాన్ని తమ దేశ ప్రజలు గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ.. అమెరికా, ఇజ్రాయెల్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. తమ నిర్ణయాలకు అడ్డొస్తే రెండు దేశాలకు ఓటమి రుచి చూపించడానికి తమ నౌకా దళాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమన్నారు. అనుమతి లేకుండా హర్మూజ్‌ను దాటడానికి ప్రయత్నించిన పలు వాణిజ్య నౌకలపై శనివారం ఇరాన్ దళాలు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. దీంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. హర్మూజ్ విషయంలో టెహ్రాన్ అత్యుత్సాహం ప్రదర్శిస్తే కఠిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై ఖమేనీ స్పందిస్తూ.. ఈ హెచ్చరికలు చేశారు.

మునీర్ డబుల్ గేమ్ ఆడుతున్నారా..? అమెరికన్ల ఆందోళన..!

ఇరాన్‌తో యుద్ధం వేళ శాంతి దూత పాత్ర పోషించేందుకు పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ తహతహలాడటంపై అమెరికన్ మీడియా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. తాజాగా ఓ మీడియా ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాక్ మాజీ జనరల్ అహ్మద్ సయీద్ మాట్లాడుతూ.. మునీర్‌కు ఎప్పటి నుంచో ఇరాన్‌లోని ఐఆర్‌జీసీతో బలమైన సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా దాని ఖుద్స్ ఫోర్స్ నేత ఖాసీం సులేమానీ, ఐఆర్‌జీసీ కమాండర్ హోస్సేన్ సలామితో సంబంధాలున్నట్లు వెల్లడించారు. దీంతోపాటు ఇరాన్ సైన్యంలోని ఉన్నత స్థాయి అధికారులతో కూడా మునీర్‌కు పరిచయాలున్నాయని పేర్కొన్నారు. ఇటు అమెరికా .. అటు ఇరాన్‌తో బలమైన సంబంధాలుండటంతో మునీర్ దౌత్యంలో వ్యూహాత్మక ఇబ్బందులున్నట్లు వెల్లడించారు.అఫ్గాన్ యుద్ధ సమయంలో అమెరికా నాయకులు పాకిస్థాన్‌పై అధికంగా ఆధారపడ్డారు. నాడు పాకిస్థాన్ ఇటు అమెరికా నుంచి సాయం అందుకుంటూనే.. తమ గడ్డపై కీలక తాలిబన్ నెట్‌వర్క్‌ను చూసీచూడనట్లు వదిలేసింది. ఫౌండేషన్ ఫర్ డిఫెన్స్ డెమోక్రసీస్ సీనియర్ ఫెలో బిల్ రోజియోమ కూడా పాక్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఆ దేశ పాత్రను చాలా జాగ్రత్తగా అమెరికన్లు అంచనా వేయాలన్నారు. అమెరికా వ్యూహాత్మక ప్రయోజానాలు కాపాడేందుకు పాక్ పనిచేస్తుందన్న గ్యారెంటీ ఏమాత్రం లేదని పేర్కొన్నారు.

## ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణం

రవాణా ఖర్చులు తగ్గి ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలుచేసేందుకు సర్కారు సిద్ధం అవుతోంది. ఇదే విషయాన్ని వివరిస్తూ దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాయగా సమాధానం కూడా వచ్చింది.సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ : ఎంఎంటీఎస్‌లో ఉచిత ప్రయాణ పథకానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో సమావేశమై చర్చించారు. జూన్ 2వ తేదీ నుంచి ఏడాది పాటు ఈ పథకాన్ని అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చిన ఫలితాలు ఆధారంగా కొనసాగింపుపై నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఎంఎంటీఎస్ ట్రైన్ల ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఏడాదికి ద.మ.రైల్వేకు సుమారు రూ.10 కోట్ల ఆదాయం సమకూరుతున్నట్లు అంచనా. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చాక పెరిగే ప్రయాణికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రస్తుత ఆదాయాన్ని తాము ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం రైల్వేకు స్పష్టం చేసింది.ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చాక పెరిగే ప్రయాణికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రస్తుత ఆదాయాన్ని తాము ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం రైల్వేకు స్పష్టం చేసింది.కొవిడ్ ముందు వరకు ఎంఎంటీఎస్ ట్రైన్లకు ప్రయాణికుల నుంచి మంచి స్పందనే వచ్చింది. నిత్యం 121 రైళ్లలో 1.20 లక్షల మంది ప్రయాణించేవారు. ప్రస్తుతం 80-88 ఎంఎంటీఎస్? రైళ్లు తిరుగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య 38వేల నుంచి 42,000 ఉన్నట్లు సమాచారం. ఎంఎంటీఎస్ రైళ్ల ఫ్రీక్వెన్సీ సరిగా లేకపోవడం, సమయపాలన లేకపోవడం కారణంగా ఆదరణ తగ్గుతోంది.ఎంఎంటీఎస్ ట్రైన్లలో అందరికి ఉచిత ప్రయాణం అమలుచేయాలని కోరుతూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, పురపాలక అభివృద్ధి శాఖ స్పెషల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ద.మ.రైల్వే జీఎంకు లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్చి 26న ఎంఎంటీఎస్ సర్వీసులపై సమీక్షించారని అందులో పేర్కొన్నారు. ఆయన సూచనల్ని లేఖలో ప్రస్తావించారు.ఎంఎంటీఎస్‌ల్లో ఉచిత ప్రయాణ పథకానికి సంబంధించి ముసాయిదా ఎంవోయూను(అవగాహన ఒప్పందాన్ని) పంపాలని దక్షిణ మధ్య రైల్వే తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. జయేశ్ రంజన్ లేఖకు ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఐటీవై పాండే ప్రత్యుత్తరం ఇచ్చారు. ముసాయిదా ఎంవోయూను పరిశీలించి రైల్వేబోర్డు అనుమతి తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఎన్ని రైళ్లు నడపాలి, ఏయే సమయాల్లో నడపాలన్నది ద.మ.రైల్వే నిర్ణయిస్తుందని లేఖలో పేర్కొంది. రైల్వేబోర్డు రూల్స్? ప్రకారం స్టేషన్లలో సౌకర్యాలు కల్పిస్తామని వివరించింది.

## టీఎంసీ మహిళలకు ద్రోహం చేసింది

మహిళా సాధికారతకు వ్యతిరేకమనే కారణంతో అడ్డుకుందని దుయ్యబట్టారు. బంగాల్‌లోని బిష్ణుపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు.”పార్లమెంట్‌లో టీఎంసీ మహిళలకు ఏ విధంగా ద్రోహం చేసిందో మనం చూశాం. మహిళా సాధికారతకు వ్యతిరేకం కాబట్టే రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ఆమోదాన్ని అడ్డుకునేందుకు టీఎంసీ కాంగ్రెస్‌తో కలిసి కుట్ర పన్నింది. బీజేపీ గుర్తింపు అనేది మహిళా సాధికారతతోనూ, వారి భద్రత, రక్షణతోనూ ముడిపడి ఉంది. అందుకే దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు బీజేపీపై తమ ఆశీస్సులను కురిపిస్తున్నారు. ఒక అభివృద్ధి చెందిన దేశ నిర్మాణంలో మహిళల పాత్ర విస్తృతం కావాలని, రాజకీయాల్లోకి మరింత మంది నారీమణులు రావాలని మేము కోరుకుంటున్నాం. కానీ రాష్ట్రంలోని సోదరీమణులకు, కుమార్తెలకు టీఎంసీ ఏ విధంగా ద్రోహం చేసిందో బంగాల్ ప్రజలు మరోసారి చూశారు. రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్ల ఆగ్రహాన్ని అధికార పార్టీ ఎదుర్కోవాల్సి వస్తుంది. టీఎంసీకి మహిళా సాధికారత గానీ, నారీమణులకు రిజర్వేషన్లు గానీ వద్దు” అని మోదీ పేర్కొన్నారు.మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం నిరాకరిస్తూ టీఎంసీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులకు లబ్ధి చేకూర్చడానికి ప్రతి చట్టాన్ని, ప్రతి నియమాన్ని టీఎంసీ ఉల్లంఘిస్తోందని, కానీ మహిళా సాధికారతను మాత్రం వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. అలాగే మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడంలో టీఎంసీ నిమ్నగ్నమైందని, అది రాజ్యాంగ స్ఫూర్తి గొంతునొక్కడమేనని విమర్శించారు. టీఎంసీ సర్కార్ ఏకంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును అవమానించిందని దుయ్యబట్టారు. గిరిజన వర్గాల సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యహరిస్తోందని ఆరోపించారు. అధికార టీఎంసీకి చెందిన గూండాలు, సిండికేట్‌లకు మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలకు ముందు (ఏప్రిల్ 29లోపు) పోలీసుల ఎదుట లొంగిపోవడానికి వారికి ఒక చివరి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. మే 4 తర్వాత ఎవరినీ వదిలిపెట్టేది లేదని అన్నారు. ”గిరిజన వ్యతిరేక పార్టీ టీఎంసీ. ప్రపంచమంతా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును గౌరవిస్తోంది. కానీ గిరిజన వ్యతిరేక వైఖరి కలిగిన టీఎంసీ ఆమెను అవమానిస్తోంది. బంగాల్‌కు రాష్ట్రపతి వచ్చినప్పుడు, టీఎంసీ ఆమెను ఏ విధంగా అవమానించిందో దేశమంతా చూసింది. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానాన్ని బంగాల్ సోదరీమణులు ఎప్పటికీ మర్చిపోరు. టీఎంసీ, కాంగ్రెస్ రెండూ గిరిజన వ్యతిరేక పార్టీలే. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో ద్రౌపదీ ముర్ముకు వ్యతిరేకంగా అభ్యర్థిని నిలబెట్టాయి. మరికొద్ది రోజుల్లో జరగబోయే బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు చరిత్రాత్మకం కానున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రజలు టీఎంసీని అంతం చేస్తారన్నారు.



# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఆమోదించండి



వ్యవస్థను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం, లోక్ భవన్ కలిసి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో గవర్నర్ పలు నిర్మాణాత్మక సూచనలు చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. విద్యార్థులు విద్యాసంస్థల్లో అడుగుపెట్టే తొలి రోజే డ్రగ్స్?కు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో ఉండాలని గవర్నర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ పొందే సమయంలోనే ‘మేము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం వాటిని ప్రోత్సహించం’ అని విద్యార్థుల నుంచి అధికారికంగా ప్రమాణ పత్రం తీసుకోవాలని సూచించారు.సీఎంకు పలు కీలక సూచనలు చేసిన గవర్నర్ : విద్యాసంస్థల్లో కేవలం చదువు మాత్రమే కాకుండా, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాలని, విద్యార్థులతో సామూహిక ప్రమాణాలు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డికి గవర్నర్? సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై రాష్ట్రస్థాయిలో చైతన్యం తీసుకురావడానికి జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ లేని సమాజం ప్రాముఖ్యతను వివరించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలపై రేవంత్ రెడ్డితో గవర్నర్ చర్చించారు. కేవలం డ్రగ్స్ అంశమే కాకుండా, రాష్ట్రంలోని విద్యా రంగంలో మౌలిక వసతులు, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న విద్యావేత్తల పోస్టులు, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలపై భేటీలో చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యా సంస్థల పనితీరు ఉండాలని పేర్కొన్నారు.గవర్నర్ చేసిన ప్రతిపాదనల పట్ల రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ఆయన సూచించిన విధంగా అడ్మిషన్ల సమయంలో అఫిడవిట్లు తీసుకోవడం, విద్యార్థులతో ప్రమాణం చేయించడం వంటి అంశాలను తక్షణమే అమలు చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 12న జరగబోయే కార్యక్రమానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి నెలకొన్న ఉత్కంఠను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పదవికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. రాజ్యాంగం ప్రకారం, ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండా మంత్రిగా ప్రమాణం చేసిన వ్యక్తి, ఆరు నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రి పదవి చేపట్టి ఈ నెల 30 నాటికి ఆరు నెలలు పూర్తి కానున్నాయి. ఒకవేళ ఈలోగా గవర్నర్ ఆయన ఎమ్మెల్సీ నియామక ఫైల్‌పై సంతకం చేయకుంటే, ఆయన తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన చిక్కులు రాకుండా వివరణ ఇచ్చారు. గతంలో కోర్టులో ఉన్న సాంకేతిక ఇబ్బందులు తొలగిపోయినందున, తక్షణమే ఆమోద ముద్ర వేయాలని గవర్నర్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## అకాల వర్షాలతో భారీ నష్టం

తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మియాపూర్ మదీనాగుడా ప్రాంతాల్లో ఇదురు గాలులతో కుడిన వర్షం కురిసింది. చింతల్ పద్మనగర్‌లో గాలి వాన ధాటికి వేర్లతో సహా భారీ వృక్షం కూలింది. చెట్టు కింద రెండు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్ని ద్విచక్రవాహనాలు ధ్వంసం అయ్యాయి. దీంతో రహదారులపైకి వాన నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీవర్షమే పడింది.జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచన : కొన్నాళ్లుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ వాతావరణం చల్లబడి ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు స్వాంతన పొందారు. వేడి వాతావరణం కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివానతో పాటు వడగళ్ల వర్షం పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వర్షం కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, గాలులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు సంభవిస్తున్నాయని, వచ్చే కొన్ని గంటలు కూడా ఇలాంటి పరిస్థితులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.అటు సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మిరుదొడ్డితో పాటు అల్వాల, లక్ష్మీ నగర్, ఆరేపల్లి లింగుపల్లి, మల్లుపల్లి దుబ్బాక పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. మధ్యాహ్నం వరకు భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించినప్పటికీ రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు.కోత దశకు వచ్చిన పంటలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు గింజలు గాలివాన ధాటికి తడిసి ముద్దయ్యాయి. వర్షం ఒక్కసారిగా విరుచుకుపడటంతో ధాన్యం కుప్పలపై కప్పేందుకు టార్పాలిన్ల (పరదాలు) కోసం రైతులు అల్లాడిపోయారు. అప్పటికప్పుడు దొరికిన పరదాలతో ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. ఈ అకాల వర్షం వల్ల చేతికొచ్చిన పంట చేజారిపోతుందని, ధాన్యం రంగు మారి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తడిసిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.కామారెడ్డి జిల్లా కేంద్రంతో చిన్న మల్లారెడ్డి, గర్గుల్,గూడేం, సదాశినగర్, రామారెడ్డి, దోమకొండ, బిక్కనూర్ మండలంలోని తదితర గ్రామాలలో ఉరుముల, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం భారీగా కురిసింది. ఈ భారీ వర్షానికి వరి ధాన్యంతో పాటు మామిడికాయలు నేలకొరిగాయి.

## మహిళల్ని అడ్డుపెట్టుకుని మోదీ నాటకాలు

బెంగాల్ మహిళలు రాజకీయాల్లో ఎదగాలని అధికార తృణమూల్ కాంగ్రెస్ కోరుకోవట్లేదని ప్రధాని మోదీ ఆరోపించారు. దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కూడా బెంగాల్ ప్రభుత్వం ఇటీవల తన చర్యలతో అవమానించిందని పేర్కొన్నారు. ఆమె బెంగాల్ పర్యటనకు వచ్చినప్పుడు టీఎంసీ నేతలు ఎలా ప్రవర్తించారో దేశమంతా చూసిందన్నారు. ఈ చర్యలను ఖండిస్తూ.. రానున్న ఎన్నికల్లో టీఎంసీని ఓడించి, ఈ పార్టీ నేతలకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. బెంగాల్‌లోని బంకురాలో జరిగిన ఒక ర్యాలీలో మోదీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావడానికి తాను ప్రయత్నించానని.. కానీ ఆ చట్టాన్ని అడ్డుకోవడానికి టీఎంసీ నేతలు కాంగ్రెస్‌తో కలిసి కుట్ర పన్నినట్లు తెలిపారు. మహిళా సాధికారత, మహిళల భద్రత కోసం భాజపా కృషి చేస్తుందని మోదీ చెప్పారు. అన్ని రంగాల్లో మహిళలు ముందు ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తాము బలంగా నమ్ముతున్నామన్నారు.

**నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..**

6 గంటలకు భారీ ర్యాలీగా కేసీఆర్ సభా ప్రాంగణానికి వెళ్తారు. అనంతరం జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

## తెలంగాణలో బీజేపీకి ఓటు అడిగే హక్కే లేదు

### ఇది మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు... డిలిమిటేషన్ బిల్లు

- రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఉపేక్షించబోము
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో బీజేపీ కూటమి తీసుకొస్తున్న బిల్లులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఎంపీలకు ముందస్తు సమాచారం లేకుండా, సరైన చర్చకు అవకాశం ఇవ్వకుండా హడావిడిగా ప్రవేశపెట్టడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు, ముఖ్యంగా ఇండియా కూటమి, ఏకతాటిపైకి వచ్చి బీజేపీ తీరును తిప్పికొడుతున్నాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, 2023లోనే అన్ని పార్టీల సమ్మతితో బిల్లు ఆమోదం పొందిందని గుర్తుచేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ తక్షణ అమలు చేయాలని డిమాండ్ చేసిందని, కానీ బీజేపీ ప్రభుత్వం 'జనగణన' 'డిలిమిటేషన్' పేర్లతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీలు అతీతంగా అన్ని దక్షిణాది రాష్ట్రాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే శక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "డిలిమిటేషన్ పేరిట జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలి... రాజ్యాంగాన్ని, సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకోవాలి" అని కడియం కావ్య స్పష్టం చేశారు. ఇక పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై స్పీకర్‌ను కలిసి రికార్డుల నుంచి తొలగించాలని కోరినట్లు తెలిపారు.. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ విషయంపై స్పందించకపోవడం దురదృష్టకరమని, తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులపై బీజేపీ నాయకులు మౌనం ఎందుకు పాటిస్తున్నారని ప్రశ్నించారు "బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మకూడదు. మహిళా రిజర్వేషన్ పేరుతో రాజకీయ లాభాలు పొందాలనే కుట్రను గుర్తించాలి. తెలంగాణ గౌరవాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు" అని కడియం కావ్య స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో రోజువారి పటిష్ఠ ప్రణాళిక

- జిల్లాలో 7 రోజుల సంక్షేమ వార అమలుకు ఏర్పాట్లు
- ఈ నెల20వ తేదీ నుండి 26వ తేదీ వరకు..
- ఇందిరమ్మ గృహప్రవేశాలు , సమ్మర్ యాక్షన్ ప్లాన్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుండి 26 వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గూగుల్ మెట్ ద్వారా ఏడు రోజుల సంక్షేమ వారానికి సంబంధించి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీడీవోలు , వివిధ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్ సి ఓ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు రోజుల సంక్షేమ వారాన్ని పటిష్ట కార్యచరణ ద్వారా నిర్వహించాలని ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. రోజువారి షెడ్యూల్ కార్యక్రమాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో వంటగది, పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతున్నట్లు చెప్పారు ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు , విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, జడ్పి సీఈఓ ఎల్లయ్య, అన్ని సంక్షేమ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఆర్ సిఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల్లోగా ఉద్యోగులకు
# డిజిటల్ హెల్త్ కార్డులు



- మంత్రి దామోదర్ రాజనరసింహ

అంబర్ పేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు డిజిటల్ హెల్త్ కార్డులను ఆరు నెలల్లోగా అందజేయడం పూర్తి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ తెలిపారు. ఇందుకు, సంగారెడ్డి జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదురహిత వైద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో అన్నిజిల్లాల్లో హెల్లకార్డుల పంపిణీని పూర్తి చేస్తామని తెలిపారు. ఆదివారం బర్కత్ పుర డాక్టర్ ఆనంద్ ఇంటర్నేషనల్ హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ స్కిన్ అండ్ కాస్మోటాలజి సెంటర్లో అధునాతన స్కిన్, హెయిర్ చికిత్స లేజర్ యంత్రాలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఆధునాతన టెక్నాలజీ వైద్య చికిత్సలు రాష్ట్ర ప్రజలకు బందుబాటులో ఉంచుతున్నామన్నారు. రానున్నరోజుల్లో తెలంగాణ హెజ్ హబ్ మారి దేశానికే ఆదర్శంగా నిలువనున్నట్టు చెప్పారు. ఆధునిక సాంకేతికతో రూపొందించిన లేజర్ పరికరాలు చర్మ వైద్యరంగంలో కొత్త శకానికి నాంది. పలుకుతాయన్నారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సరికొత్త పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, వీటి ద్వారా రోగులకు న్యాయమైన వైద్య చికిత్సలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సమత, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేరూరు స్ఫూర్తి.. రాష్ట్రానికి మార్గదర్శి..

- 75 ఏళ్ల ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి సందేశం
- గ్రామానికి మినీ స్టేడియం హామీ
- పాఠశాల అభివృద్ధిలో భాగంగా ఇంటర్ అప్‌గ్రేడ్‌కు మాట



**మహబూబ్ నగర్,కౌకుంట్ల, ఏప్రిల్ 19 (జనంసాక్షి):** ఏడు దశాబ్దాల విద్యా వైభవాన్ని సాక్షిగా చేసుకుని పేరూరు జడ్‌పీహెచ్ఎస్ పాఠశాల వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ వేడుకతో గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. వేలాదిమంది పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపై కలిసిన ఈ అరుదైన సందర్భం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు ఉదయం 6 గంటలకు ప్రభాతబేరీతో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులతో పాటు గ్రామమంతా తిరిగారు. అంతరం పాఠశాల చేరుకొని 9:30 గంటలకు పాఠశాల ఆవరణలో వరుస లైన్ లో నిలబడి వందేమాతరం,జనగణమన, జయ జయహే తెలంగాణ గీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత నాడు చదువు నేర్పిన గురువులకు రెడ్ కార్పెట్ పరిచి పూర్ణకుంభంతో,పూలు వెదజల్లుతూ కోలాటాలతో సంపురంగా ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకకు గ్రామస్తులు,పూర్వ విద్యార్థులు,గ్రామ సర్పంచ్ శృతి అరవింద్ కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజన మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి,దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ...75 ఏళ్ల క్రితమే విద్య అవసరాన్ని గ్రహించి పాఠశాల స్థాపించిన నేత కీర్తిశేషులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కేకే రెడ్డికి దూరదృష్టి లేకపోయి ఉంటే ఈరోజు పేరూరు ఇంత ముందుండేది కాదని ,గ్రామ అభివృద్ధి చరిత్రను ఒక్కొక్కటిగా గుర్తు చేస్తూ మంత్రి మాట్లాడారు. నాడు రాష్ట్రంలో అనేక గ్రామాల్లో కరెంట్ రాకముందు...రోడ్లు లేకముందు... ఆసుపత్రులు లేకముందే ఈ ఊరు విద్య కోసం పోరాడింది. అదే ఈరోజు పేరూరుని ప్రత్యేకంగా నిలబెట్టింది అని వ్యాఖ్యానించారు. ఆ దిశగా కృషి చేసిన కేకే రెడ్డి సేవలను గుర్తుచేస్తూ సభలో చప్పట్లు కొట్టించారు. అంతేకాక అదే కుటుంబం నుంచి నేడు సర్పంచ్ గా శృతి అరవింద్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నికపై మంత్రి ప్రత్యేకంగా స్పందించారు. ఈరోజుల్లో రాజకీయాలు విభేదాలకు వేదిక అవుతున్నా... ఇంత పెద్ద గ్రామంలో ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకోవడం చిన్న విషయం కాదు... ఇది పేరూరు సంస్కృతి, ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. ఇక అభివృద్ధి హామీలను మంత్రి స్పష్టంగా ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్, కాంగ్రెస్ నాయకులు అరవింద్ కుమార్ రెడ్డి కోరిక మేరకు ఈ వేదిక మీదే చెబుతున్నా... పేరూరుకు మినీ స్టేడియం ఖాయం. యువతకు క్రీడా వసతులు కల్పిస్తాం. ఈ పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం నా బాధ్యత అని ధీమాగా చెప్పారు. అంతేకాక మంత్రి భావోద్వేగంతో ఇంత పెద్ద కార్యక్రమానికి ఈరోజు నేను రాకపోయి ఉంటే... నా జీవితంలో ఒక గొప్ప క్షణాన్ని మిస్ అయ్యేవాడిని. పేరూరు చూపించిన ఈ ఐక్యత, ఈ విద్యాస్ఫూర్తి... రాష్ట్రానికి ఆదర్శం అని చెప్పారు. అనంతరం ఈప్రాంత అభివృద్ధిలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాత్రను కొనియాడుతూ... ఎవరు ఏది అడిగితే వారి కోసం కాదు... అడగకపోయినా అభివృద్ధి కోసం కష్టపడే నాయకుడు జిఎంఆర్ అని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రస్తావిస్తూ విద్య, సంక్షేమం, అభివృద్ధి,మూడు రంగాల్లో తెలంగాణను ముందంజలో నిలబెట్టే దిశగా ప్రభుత్వం దూసుకెళ్తోంది అని పేర్కొన్నారు. టీచర్లకు పెద్దఎత్తున బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా విద్యా వ్యవస్థలో మార్పు తీసుకొచ్చామని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన బియ్యం, మెరుగైన వసతులు అందించడం ప్రభుత్వం కట్టుబాటని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, గ్రామ ప్రజలకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యే పేరూరి బలం : డైమండ్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్

పేరూరు జడ్‌పీహెచ్ఎస్ పాఠశాల 75 ఏళ్ల డైమండ్ జూబ్లీ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...1950లోనే విద్య ప్రాధాన్యతను గుర్తించి పాఠశాల స్థాపించిన గ్రామ పెద్దలు, ముఖ్యంగా కే.కే రెడ్డి సేవలు చిరస్మరణీయం అన్నారు. పాఠశాలలో మ్యాథమెటిక్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే మినీ స్టేడియం కోసం మంత్రి వాకిటి శ్రీహరిని కోరగా, మంత్రి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు 60 సైకిళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... పేరూరు పాఠశాలకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంతో అభివృద్ధి చేశానని, నేడు 75 వసంతాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రాణన రోజుల్లో శతజయంతి ఉత్సవాలు కూడా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.

# దరువు జాతర పోస్టర్ ఆవిష్కరణ



**సిద్దిపేట (జనంసాక్షి) :** డాక్టర్ దరువు ఎల్లన్న దరువు అంజన్న రచించి పాడి 25 సంవత్సరాలు అయినా సందర్భంగా వారి సారాధ్యంలో హైదరాబాదు రవీంద్రభారతిలో దరువు జాతర అనే పేరుతో దరువు తెలంగాణ సాంస్కృతిక సంబరాలు జరగబోతున్న సందర్భంగా సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామపంచాయతీ ముందు కాంగ్రెస్ పార్టీ కొండపాక మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆకారం శ్రీను, మర్పడగ గ్రామ సర్పంచ్ ఆకారం బాలరాజు, కళాకారుడు, మాజీ ఉపసర్పంచ్ దబ్బేట యాదగిరి, కళాకారుడు మెరుగు (సెల్ ) బాల్ నర్సింలు దరువు జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం జరుగుతున్న ఉద్యమం సమయంలో వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం విద్యార్థి అనే పాట పాడి, 25 సంవత్సరాలు అయిన సందర్భంగా,చిన్నపిల్లవాడి నుండి పెద్ద వయస్సు ముసలి తాతల వరకు అందరి హృదయాల్లో నిలిచిపోయిందని, ఆ పాటను, మరొక్కసారి గుర్తు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. అలాగే నేడు జరగబోయే ఈ కార్యక్రమానికి కొండపాక మండలంలోనీ అన్ని గ్రామాల నుండి విద్యార్థి,యువతి యువకులు, కళాకారులు, ఉద్యమకారులు, వివిధ యువజన సంఘాల నాయకులు, సభ్యులు, గ్రామ యువకులు గ్రామ ప్రజలు తదితరులు దరువు జాతరకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షులు మినుకూరి నరసింహులు, ఉపాధ్యక్షులు వల్లంగళ్ళ మహేష్, క్యాషియర్ సుండు ప్రవీణ్, మినుకూరి చంద్రం, మాజీ ఎంపిటిసి గుడిమల్ల బాలరాజ్, బక్కి బాల్ నరసింహులు, వల్లంగళ్ళ నగేష్, ఎండి రహమతుల్లా,మెరుగు పెద్ద బిక్షపతి, మినుకూరి భీమయ్య, సుండు యాదయ్య, నాచారం భాస్కర్, సుండు బుచ్చయ్య, మినుకూరి ఎల్లయ్య పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో పిల్లర్ల పై ఓవర్ నిర్మించాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి
- చౌటుప్పల్లో బిఆర్ఎస్, సిపిఎం రాస్తారోకో



**చౌటుప్పల్ ఏప్రిల్ 19(జనంసాక్షి) :** మున్సిపల్ కేంద్రంలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి పనులను వెంటనే నిలిపివేసి, ప్రజలకు అనుకూలంగా ఉండే ఎలివేటెడ్ కారిడర్ నిర్మించాలని మిత్రపక్షాల ఆధ్వర్యంలో, సిపిఎం నేతృత్వంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మట్టి ఆధారంగా నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి వల్ల చౌటుప్పల్ పట్టణం రెండు భాగాలుగా విభజించబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం,రోడ్డు మునిగిపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, పిల్లర్ ఆధారిత ఎలివేటెడ్ కారిడర్ మాత్రమే శాశ్వత పరిష్కారమని ఆయన పునరుద్ఘాటించారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించి, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే జాతీయ రహదారి అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపిన ఆయన, అవసరమైతే మళ్లీ ఫీల్డ్ సర్వే నిర్వహించి, స్థానిక పరిస్థితులను వివరంగా చూపిస్తామని అన్నారు. అప్పటివరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి,మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, చౌటుప్పల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్, కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఉదరి యాదయ్య,రాజరత్నం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ ఉడుగు మల్లేష్ గౌడ్, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్,కయ్యుమ్ పాషా,బండారు నర్సింహ,జిల్లా నాయకులు ఢిల్లీ మాధవ రెడ్డి దయాకరీ చారి, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి,అత్తర్ పాషా,చేవగాని మహేష్ గౌడ్,తూర్పునూరి మల్లేష్ గౌడ్, యువ నాయకులు మున్నా, ముషీర్,స్వామి, మునుకుంట్ల సత్యనారాయణ, ఢిల్లీ శంకర్ రెడ్డి ఊదరి రాకేష్ యువజన నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు కిరాణం అసోసియేషన్ వ్యాపారస్తులు, క్లాత్ అసోసియేషన్ వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### జిమ్నాస్టిక్ రాష్ట్ర అధ్యక్షుడిగా రఘునందన్ రావు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా రఘునందర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో జిమ్నాస్టిక్స్ ఎదుగుదలకు మరింతగా కృషి చేసి మారు మూలల గ్రామాల నుంచి కూడా క్రీడాకారులను ప్రోత్సహించి గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

### 315 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సైబరాబాద్‌లో వీకెండ్--స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 315 మంది మందుబాబులుపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 315 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 268 ద్విచక్ర వాహనదారులు, 15 ఆటోలు, 28 కార్లు, 04 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే.. 277 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 27 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 11 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.

# సినిమా ఇండస్ట్రీకి అన్ని విధాలా అండగా ఉంటాం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్ (జనంసాక్షి) :** సినిమా ఇండస్ట్రీకి అన్ని విధాలా అండగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని రామా నాయుడు స్టూడియోలో "పార్వతి సినిమాస్" బ్యానర్‌పై రూపొందుతున్న "రెటీనా" (జుఎవం చీవజవతీ ాఅవ) సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు, ప్రముఖ నిర్మాత మరియు దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ గారు, దర్శకులు యాట సత్యనారాయణ విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, తెలంగాణలో సినిమా రంగానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తోందని అన్నారు. హాలీవుడ్, బాలీవుడ్ స్థాయిలో తెలుగు సినిమాలు నిలవాలని ఆకాంక్షిస్తూ, ముఖ్యంగా యువతకు మంచి సందేశం ఇచ్చే చిత్రాలు తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ వంటి చెడు అలవాట్లను ప్రోత్సహించకుండా, సమాజానికి ఉపయోగపడే, ప్రేరణనిచ్చే కథలతో సినిమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ముగింపులో చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ, ప్రేక్షకుల ఆశీర్వాదాలతో "రెటీనా" చిత్రం విజయవంతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నిర్మాత కమిటీ కుర్రాళ్ళు హీరో యశ్వంత్, ప్రొడ్యూసర్ పార్వతి, డైరెక్టర్ అల్లం రాజు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రవికుమార్, రెటిన హీరో మనీష్, హీరోయిన్స్ సోనియా నాయుడు, ప్రీతి హెప్‌సాండ్, సీనియర్ నటులు లక్ష్మి పార్వతి, పుష్పా చౌదరి, యోగి ఖత్రి, చిత్ర బృందం పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
20 ఏప్రిల్ 2026

# బొగ్గు పొరల సాక్షిగా... ఒక యోధుడి 'రక్తాక్షర' కావ్యం!


## 'బొజ్జ బిక్షమయ్య' జీవితం ఆధారంగా డాక్టర్ కాలువ మల్లయ్య రాసిన 'అస్పృశ్య యోధుడు' నవలపై విశ్లేషణ




సాహిత్యం అంటే కేవలం అక్షరాల కూర్పు కాదు, అది ఒక సామాజిక ఆయుధం. డాక్టర్ కాలువ మల్లయ్య మలిచిన 'అస్పృశ్య యోధుడు' నవల చదువుతుంటే ఆ అక్షరాలు మంటలై మనల్ని తాకుతాయి. ప్రముఖ ట్రేడ్ యూనియనిస్ట్, లాల్ నీల్ వాది కామ్రేడ్ 'బొజ్జ బిక్షమయ్య' జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకున్న ఈ నవల, ఒక తరం పోరాటాలకు సజీవ సాక్ష్యం. ఒక జర్నలిస్టుగా, ట్రేడ్ యూనియన్ లో పని చేసిన అనుభవం కలిగిన నాకు 'అస్పృశ్య యోధుడు' నవల చదువుతుంటే, అది కేవలం కామ్రేడ్ బొజ్జ బిక్షమయ్య జీవితంలా అనిపించలేదు. అది అంటరాని వసంతపుకాలం, సమ్మెల హోరు, సైరన్ల మోత, జైలు కటకటాల వెనుక వినిపించే స్వేచ్ఛా గీతంలా అనిపించింది. బిక్షమయ్య జీవిత ప్రయాణాన్ని డాక్టర్ కాలువ మల్లయ్య ఒక కావ్యంగా మలచడం సాహిత్య చరిత్రలో ఒక అరుదైన సందర్భంగా చెప్పాలి. సింగరేణి గనుల్లో బొగ్గును వెలికి తీయడం ఎంత కష్టమో, అణచివేతకు గురైన సామాజిక వర్గాల నుంచి ఒక నాయకుడిని వెలికి తీయడం అంతకంటే కష్టం.

వృత్తిరీత్యా కార్మికుడిగా, ప్రవృత్తిరీత్యా కార్మిక నాయకుడిగా బిక్షమయ్య చేసిన పోరాటం, ఆయన అంతర్మథన పోరాటం నా కళ్ళముందు కదలాడింది. ఒకప్పుడు వరంగల్ వీధుల్లో ట్రేడ్ యూనియన్ కార్యకర్తగా నేను చూసిన ఎర్రజెండా నీడ, ఈ నవలలోని ప్రతి పేజీలోనూ కనిపిస్తోంది. గని కార్మికుడు అంటే కేవలం ఉత్పత్తి చేసే యంత్రం కాదు, అతడొక మనిషి అని, అతడికి హక్కులు ఉంటాయని చాటిన బిక్షమయ్య ప్రయాణం సింగరేణి కార్మిక చరిత్రలో ఒక మైలురాయి. 'బొగ్గుల పొయ్యిలా భగభగలాడటం' అనే రచయిత ప్రయోగం, నిప్పుల మీద నడిచిన ఒక తరానికి నివాళిగా చెప్పక తప్పదు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు తమ పరిధి దాటి వెళ్లడానికి జంకుతారు. కానీ బిక్షమయ్య భిన్నమైన వ్యక్తి. ఆయన ఖీజ× లో విధులు నిర్వహిస్తూనే, సింగరేణి బొగ్గు గని కార్మికుల కడగండ్లను తన భుజాలకెత్తుకున్నారు. బొగ్గు బావుల్లో ప్రాణాలకు తెగించి పని చేసే కార్మికుల హక్కుల కోసం ఆయన ఎగురవేసిన ఎర్రజెండా, నాటి నిరంకుశ యాజమాన్యాలకు నిద్ర లేకుండా చేసింది. ఒక రంగానికి పరిమితం కాకుండా, పీడిత వర్గాల గొంతుకగా మారడమే అసలైన నాయకత్వ లక్షణమని ఈ నవల చాటిచెబుతోంది.

ఈ నవలను కేవలం భావోద్వేగాలతో కాకుండా, చారిత్రక వాస్తవాలతో తీర్చిదిద్దారు. బొగ్గు గని కార్మికుల జీవితం, పల్లెల్లోని వెక్కిరింతలు, బడిలో ఎదురైన అవమానాలు ఇవన్నీ చదువుతుంటే మన కళ్లు చెమర్చుతాయి.రాజకీయ ఖైదీగా జైలు గోడల మధ్య గడిపిన క్షణాలను కాలువ మల్లయ్య ఈ నవలలో అద్భుతంగా చిత్రించారు. బయటి లోకంలో అడుగడుగునా ఎదురయ్యే కుల వివక్ష, అవమానాల కంటే, జైలులో సిద్ధాంతం కోసం శిక్ష అనుభవించడంలోనే ఒక రకమైన తృప్తి ఉంటుంది. బిక్షమయ్యకి ఇల్లు కన్నా జైలు ఎందుకు మేలనిపించిందంటే, అక్కడ ఆయన అస్పృశ్యుడు కాదు.. ఒక 'రాజకీయ ఖైదీ'. గౌరవం కోసం పరితపించే ఒక ఆత్మకు జైలు కటకటాలు కూడా స్వేచ్ఛా గీతాలేనని రచయిత లోతుగా చాలా సున్నితంగా విశ్లేషించారు.




ఒక 'ఉపా' బాధితునిగా ఉపా కేసు అభియోగంతో అరెస్ట్ చేయబడి 100 రోజులు అండర్ ట్రాయల్ ఖైదీగా జైలు జీవితం గడిపిన ఒక జర్నలిస్టుగా బిక్షమయ్య అంతరంగాన్ని ఈ నవలను చదువుతూ నేను మరింత లోతుగా అర్థం చేసుకోగలిగాను. సమాజంలో 'అస్పృశ్యత' పేరుతో అనుభవించే పరాయికరణ కంటే, జైలు గోడల మధ్య సిద్ధాంతం కోసం గడిపే సమయమే గౌరవప్రదమని ఆయన భావించడం విప్లవకారుడికే సాధ్యమయ్యే అత్యున్నత సంస్కారం. "ఊరికో జైలు, వాడకో జైలు లేకపోవడమే మంచిదైంది" అన్న ఆయన మాటల వెనుక ఉన్న సామాజిక వ్యంగ్యం నన్ను ఆలోచింపజేసింది. బయటి ప్రపంచం ఒక పెద్ద జైలుగా మారినప్పుడు, స్వేచ్ఛా భావజాలమే అసలైన విముక్తి అని ఈ నవల గుర్తుచేస్తుంది. ఈ నవలలోని అత్యంత కీలకమైన ఘట్టం బిక్షమయ్య ఆలోచనా సరళిలో వచ్చిన మార్పు. 'లాల్' ఉద్యమ పోరాట పటిమను పుణికిపుచ్చుకున్న ఆయన, కాలక్రమేణా సామాజిక విముక్తికి అంబేద్కర్ ఆత్మగౌరవ భావజాలమే అసలైన మార్గమని గుర్తించినట్లుగా ఆయన ప్రయాణం పరిశీలిస్తే అర్థమవుతోంది. కుల నిర్మూలన జరగనిదే శ్రమకు విముక్తి లేదన్న నిజాన్ని ఆయన గుర్తించిన తీరు నేటి తరానికి దిక్సూచి. "శత్రువు లేనివాడు నంగి" అని ఆయన చెప్పే పచ్చి నిజాన్ని ఒక జర్నలిస్టుగా నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. ఎందుకంటే నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టుకు, సమాజం కోసం పోరాడే యోధుడికి శత్రువులు ఉండటం సహజం. ఇంకా సూటిగా చెప్పాలంటే శత్రువు లేకపోతే సజీవంగా లేనట్లే.

'అస్పృశ్య యోధుడు' నవల కేవలం ఒక వ్యక్తి బయోపిక్ కాదు. అది ఒక అస్తిత్వ విస్ఫోటనం. అణచివేత ఎక్కడైతే ఉంటుందో, అక్కడ బిక్షమయ్య లాంటి యోధులు పుడుతూనే ఉంటారని ఈ నవల చెబుతుంది. ఒక జర్నలిస్టుగా, ముందు చెప్పినట్లు విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమంలో, యువకునిగా యువజన సంఘంలో ఆ తరువాత ట్రేడ్ యూనియన్ లో దశాబ్ధంన్నర కాలం పాటు వాపక్ష ఉద్యమంలో ఉన్న నేను జర్నలిస్ట్ వృత్తిలో కూడా దశబ్ధంన్నర కాలంగా కొనసాగుతున్న నేను సమాజంలోని కుల ఆదిపత్యమో, కక్షసాధింపు చర్యలో ఒక రకంగా కలం గొంతును నొక్కాలని చూసే కుట్రలో భాగమో ఎలా అనుకున్నా సరే రెండోసారి నన్ను టార్గట్ చేసి మా తమ్ముడిని కూడా టార్గెట్ చేసి కుట్రపూరితమైన కేసు నమోదై ఒకరోజు జైలు గడుపతొక్కిన మానసిక స్థితిలో ఈ నవల చదివాను. ఈ నవలను చదివిన తర్వాత నాలో అనేక రేట్లు ఆత్మస్తైర్యాన్ని నింపంది. ఒకరకంగా ఈ నవల చదివాక నా స్థితి, మనకు ఎదురయ్యఘ సమస్యలు చాలా చిన్నదిగా అనిపించింది. ఇలాంటి కుట్రలు, కక్షసాధింపు చర్యలు ఒకలెక్కే కాదన్నట్లుగా కొట్టిపారేశాను.

ఇక ఈ నవలలో బాల్యంలో చిరిగిన నిక్కరు చూసి నవ్విన వెకిలి చూపుల నుంచే, వ్యవస్థను ప్రశ్నించే చూపు పుడుతుందని రచయిత కాలువ మల్లయ్య చాలా సహజంగా చిత్రించారు. మార్క్సిజం నుంచి అంబేద్కరిజం వైపు సాగిన, సాగుతున్న లాల్ నీల్ ఐక్యత కోసం సాగుతున్న బిక్షమయ్య ప్రయాణం కేవలం సిద్ధాంత మార్పు కాదు, అది ఆత్మగౌరవ అన్వేషణ. కులం అనే కంచెను విప్లవం అనే గొడ్డలితో ఎలా నరకాలో బిక్షమయ్య జీవితం చూపిస్తుంది. బిక్షమయ్య 'అజాతశత్రువు' కాదు.. ఆయనో 'అజాత యుద్ధ వీరుడు'. ముందే చెప్పినట్లుగా శత్రువు లేనివాడు బతకనేర్చినవాడు మాత్రమే అనే ఆయన సిద్ధాంతం, సమాజంలో తిరుగుబాటు జెండాను ఎప్పుడూ రెపరెపలాడిస్తూనే ఉంటుంది. సమాజం కోసం, సామాజిక న్యాయం, హక్కుల కోసం, సమానత్వం కోసం, ఐక్యత కోసం కోసం తపించే ప్రతి ఒక్కరూ తమ గుండెల్లో దాచుకోవాల్సిన పుస్తకం ఇది.



**- దామెర రాజేందర్ (దారా)**
సీనియర్ జర్నలిస్ట్

## మహిళా రిజర్వేషన్లు - ఓబీసీల సామాజిక న్యాయం

2023లో ఆమోదం పొందిన 106వ రాజ్యాంగ సవరణ చట్టం (నారీ శక్తి వందన్ అధినియం) మహిళా సాధికారత వైపు ఒక అడుగు అనిపించినా, దాని అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది.

**అమలులో తిరకాసు - రాజకీయ వ్యూహం**

మహిళా రిజర్వేషన్లకు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు ఎటువంటి రాజ్యాంగపరమైన సంబంధం లేదు. అయినా ప్రభుత్వం కావాలనే వీటిని ముడిపెట్టి కాలయాపన చేస్తోంది. 2023 సెప్టెంబర్‌లో మేము ఆలిండియా ఓబీసీ సమాఖ్య తరఫున ఢిల్లీలో ఉన్నప్పుడు, అన్ని పార్టీలకు ఓబీసీ కోటాపై విన్నవించాం. ఇపుడు రాష్ట్రాల ఎన్నికలలో లబ్ది పొంగడానికి,అంతర్జాతీయ సమస్యల (ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు) నుండి దృష్టి మరల్చడానికి, ఎన్నికల లబ్ధి కోసం ఈ బిల్లును ఒక 'డైవర్షన్'గా వాడుకోవడం మోసపూరితం.


**ముందుగా ఓబీసీ బిల్లు - ఆపై మహిళా రిజర్వేషన్లు**

దేశంలో సగభాగం ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడమే అసలైన సామాజిక న్యాయం. ప్రభుత్వం తక్షణమే ఓబీసీలకు 27 శాతం తగ్గకుండా, జనాభా ప్రాతిపదికన 42 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదించాలి.

ఇది జరిగితే, మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ మహిళలకు అంతర్గత కోటా దక్కి న్యాయం జరుగుతుంది. అప్పుడు డీలిమిటేషన్ ప్రక్రియ కూడా ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా సాగుతుంది.


పార్లమెంటు ఆమోదం పొంది 106 వ రాజ్యాంగ సవరణ గా గణుతికెక్కిన మహిళా రిజర్వేషన్ ల కోసం నోటిఫికేషన్లు విడుదల చేసి తక్షణమే అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. బీసీలు కూడా పాసైన మహిళా రిజర్వేషన్ ల అమలుకు గళ మెత్తాలి. మహిళలు ఆందోళన వీడి, తమ హక్కుల కోసం, ఓబీసీ కోటా కోసం కూడా గళమెత్తాలి.. మహిళా రిజర్వేషన్లకు డోకా లేదు.

. సామాజిక న్యాయం లేని రిజర్వేషన్లు అసంపూర్ణం. సత్యాన్ని ప్రజలకు వివరించడమే నా బాధ్యతగా ఈ విన్నపాన్ని చేస్తున్నాను.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## పాపపుణ్యాలు




రాజకీయం
సేవారంగం!
ప్రజలకోసం
సేవచెయ్యి!
పదవిముసుగులో
సేవచెయ్యకు!
ఉద్యోగం (ఆర్థిక )
సేవారంగం!
నీ డిపార్ట్మెంట్ కు
సేవచెయ్యి!
లంచం కోసం
వెంపర్లాడకు!
సంగీతం
సేవారంగం!
ప్రజాగీతాలతో
చైతన్యపరచు!
పేరుప్రతిష్టలకై
ఎదురుచూడకు!
సాహిత్యం
సేవారంగం!
ప్రజలకై నిబద్ధత
నిమగ్నతవుండాలి!
అవార్డులకోసం
ప్రయత్నించకు!
కులసంఘం
సేవారంగం!
ఓట్లు కోసం
వాడుకోకు!
నీకులంవాళ్ళను
అక్షరాస్యుల్నిచెయ్!
మతం కూడా
సేవారంగమే!
ప్రజలకు
మంచిచెడు చెప్పింది!
ఇప్పుడేం చేస్తోంది!
అబద్ధాలే
ప్రవచిస్తోంది!
కార్మిక కర్షకుల
నిరంతర శ్రమ!
వస్తూత్పత్తితో
అందరికీఅన్నంపెట్టే
నిత్యకృషీవలురు!
వీళ్ళ'సంగతి' ఏంటి?
శ్రామికులు
నిత్యదరిద్రులు!
దీని పేరే
దోపిడీసమాజం!
శ్రమలు కొల్లగొట్టి
బూర్జువా సేవలు
చేస్తూ ఉంటారు!
జరిగేదంతా
శ్రమదోపిడీ!
చెప్పేవన్నీ
శ్రీరంగ నీతులు!
ఏది పాపం?
ఏది పుణ్యం?

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## ప్రస్తుత సమాజం -- మార్పుల మధ్య మనిషి మార్గం

ప్రస్తుత సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా "మార్పు" అనే పదాన్ని లోతుగా గ్రహించాలి. మనం జీవిస్తున్న ఈ కాలం కేవలం అభివృద్ధి యుగం మాత్రమే కాదు, ఇది విలువల పరీక్షల యుగం కూడా. ప్రతి రోజు కొత్త ఆవిష్కరణలు, కొత్త అవకాశాలు, కొత్త సవాళ్లు మన ముందుకు వస్తున్నాయి. ఈ వేగంలో మనిషి ముందుకు సాగుతున్నాడు, కానీ అదే సమయంలో తన అసలు స్వరూపాన్ని, తన మనుష్యత్వాన్ని కాపాడుకుంటున్నాడా అనే ప్రశ్న మాత్రం ఇంకా సమాధానం కోసం ఎదురుచూస్తోంది.

ఒకప్పుడు సమాజం అంటే కుటుంబం, పక్కింటివాళ్లు, స్నేహితులు, అనుబంధాలు. ఒకరి సంతోషం అందరి సంతోషం, ఒకరి బాధ అందరి బాధగా భావించే రోజులు అవి. ఇప్పుడు సమాజం రూపం మారిపోయింది. మొబైల్ ఫోన్ స్క్రీన్‌లోనే ప్రపంచం కుదించబడిపోయింది. మనం ఎవరితోనైనా మాట్లాడగలం, ఎక్కడికైనా చేరగలం, కానీ మనసులు మాత్రం దూరమవుతున్నాయి. డిజిటల్ ప్రపంచం మనల్ని దగ్గర చేసింది కానీ హృదయాలను దూరం చేసింది అనేది ఈ కాలపు విరుద్ధ వాస్తవం.

ప్రస్తుతం మనిషి జీవితం "సమయం లేదు" అనే కారణంతో నిండిపోయింది. కానీ నిజంగా సమయం లేకపోవడం కాదు, ప్రాధాన్యతలు మారిపోవడం. కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోయింది, కానీ ఫోన్‌లో గడిపే సమయం పెరిగింది. దగ్గర వాళ్లను నిర్లక్ష్యం చేసి, దూరంలో ఉన్నవాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ మార్పు మన సంబంధాలను నెమ్మదిగా బలహీనపరుస్తోంది.ధనం విషయానికి వస్తే, అది ఇప్పుడు అవసరం మాత్రమే కాదు, ఒక లక్ష్యంగా మారిపోయింది. డబ్బు సంపాదించడం తప్పు కాదు, కానీ దాని కోసం విలువలను కోల్పోవడం ప్రమాదకరం. సమాజంలో గౌరవం కూడా డబ్బుతో కొలవబడుతోంది. డబ్బు ఉన్నవాడిని పైకి ఎత్తి చూపించడం, లేని వాడిని తక్కువగా చూడడం ఒక సాధారణ ధోరణిగా మారింది. ఇది సమాజంలో అసమానతలను పెంచుతోంది.

విద్యా వ్యవస్థ కూడా ఈ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తోంది. చదువు అంటే జ్ఞానం సంపాదించడం కాకుండా, ఉద్యోగం పొందడం అనే భావన బలపడింది. మార్కులు, ర్యాంకులు, ప్యాకేజీలు -- ఇవే విజయానికి ప్రమాణాలుగా మారాయి. కానీ నిజమైన విద్య మనిషిని మంచివాడిగా, బాధ్యతగల వ్యక్తిగా తీర్చిదిద్దాలి. ఈ అంశం చాలా చోట్ల కనిపించడం లేదు. యువత ప్రస్తుత సమాజానికి అద్దం. వారి ఆలోచనలు, వారి చర్యలు సమాజం దిశను నిర్ణయిస్తాయి. యువతలో అపారమైన శక్తి ఉంది, కొత్త ఆలోచనలు ఉన్నాయి, మార్పు తీసుకురాగల ధైర్యం ఉంది. కానీ అదే సమయంలో ఒత్తిడులు, ప్రలోభాలు, పోలికలు వారికి మానసికంగా ప్రభావం చూపుతున్నాయి. సోషల్ మీడియా ద్వారా వచ్చే అంచనాలు, గుర్తింపు కోసం చేసే ప్రయత్నాలు వారిని ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

సమాజం అంటే కేవలం ఒక వ్యవస్థ కాదు, అది మనమే. మన ఆలోచనలు, మన చర్యలు, మన విలువలు -- ఇవే సమాజాన్ని నిర్మిస్తాయి. కాబట్టి సమాజం మారాలంటే ముందుగా మనం మారాలి. మనలో మనుష్యత్వాన్ని పెంచుకోవాలి. ఇతరులను అర్థం చేసుకోవాలి. సహనం పెంచుకోవాలి. సాంకేతికతను ఉపయోగించాలి కానీ దాని బానిసలుగా మారకూడదు.

ప్రస్తుతం మనం ఒక మార్గమధ్యంలో ఉన్నాం. ఈ మార్పు మన చేతుల్లోనే ఉంది. మనం ఎంచుకునే దారే భవిష్యత్తు సమాజాన్ని నిర్ణయిస్తుంది. వేగంగా ముందుకు సాగాలి, కానీ మనసును వెనక్కి వదిలేయకూడదు. డబ్బు సంపాదించాలి, కానీ విలువలను కోల్పోవద్దు. సాంకేతికతను వినియోగించాలి, కానీ మనుష్యత్వాన్ని మర్చిపోవద్దు.

చివరగా చెప్పాలంటే, అభివృద్ధి అంటే కేవలం సౌకర్యాలు కాదు – మనిషి మనసు కూడా ఎదగాలి. మనం ఎంత ఎదిగినా, మనలో మనిషి బ్రతికి ఉండాలి. అదే నిజమైన అభివృద్ధి, అదే సమాజానికి సరైన దారి.

**- శ్రీనివాస్ రెడ్డి**

## మరో జలియన్ వాలాబాగ్ ఇంద్రవెల్లి

### ఆ నెత్తుటి గాయానికి 45ఏండ్లు..



భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం ఉద్యమ బాటన రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో 1981 ఏప్రిల్ 20న కదం తొక్కడంతో జనసంద్రంతో సభ నిండుకున్నది.అక్కడ చేరుకున్న పోలీసులలో ఒక కానిస్టేబుల్ ఆదివాసి మహిళను అనుచితంగ ప్రవర్తించడంతో ప్రాణానికన్నా శీలం ముఖ్యమని భావించే ఆమహిళా చేతులో ఉన్న కొడవలితో దాడి చేయడంతో పోలీసులు రెచ్చిపోయి జరిపిన కాల్పుల్లో గోండు ప్రజలు లెక్కలేకుండా చనిపోయారు. ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసుల కాల్పుల సంఘటనలో ఆదివాసుల హక్కులు ప్రపంచానికి తెలియడమే కాకుండా మరో జలియన్ వాలాబాగ్ గా చరిత్రగా నిలిచింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నక్సల్బరీ గ్రామంలో భూస్వాములపై ఆదివాసీ రైతులు తిరుగుబాటుతో వెలుగులోకి వచ్చిన వారి ఉద్యమం శ్రీకాకుళం చేరుకొని భూమి భుక్తి విముక్తి కోసం రైతంగ పోరాటాలకు ఊపిరి పోసింది. కరీంనగర్ జిల్లాలో విద్యార్థి రైతాంగా పోరాటాల స్ఫూర్తితో జగిత్యాల జైత్రయాత్ర సాగింది. ఆదిలాబాద్ జిల్లా లో ఆదివాసులకు (గోండు గిరిజనులకు) అండగా నిలిసింది. అర్ధ ఆకలితో బతుకు వెల్లదీసిన గోండులు ఆకలి,అనారోగ్యం బారిన పడి ప్రాణాలు కాపాడే వారు లేక దిగజారుతున్న బతుకులకు దిక్కు లేకపోవడం కుంగు బాటుకు గురి చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా విస్తరించిన అడవిలో వ్యాపారులు పటేల్ పట్వారి వ్యవస్థ చేస్తున్న, ఆగడాలు, దోపిడికి, ఆదివాసులు గురికావడంతో దిక్కులేక దిగులు పడుతున్న తరణంలో 1974 సంవత్సరం లలో అడుగుపెట్టిన అన్నల(పొరకలసార్లు) ఆధ్వర్యంలో ఆదివాసులకు అండగా ఉండడం తో ఆకుల కల్లాలపై ఆదివాసుల పెత్తనం పెరగడం తో పీపుల్స్ వార్ ( ప్రజల యుద్ధం )ఆధ్వర్యంలో రైతు కూలి సంఘం ఉద్యమించడంతో ఆదివాసులు పిలుచుకునే పొరకల దొరల అండతో అడవి పై భూమిపై మాదే హక్కు అంటూ జిల్లాలో పోడు భూములను దున్నుకోవడం ఉద్యమించసాగారు. వేలాది ప్రభుత్వ భూములను కబ్జా చేసుకున్న పెత్తందారుల పెత్తనం కోల్పోయిన పాలకులు పటేల్ పట్వారిలకు,ప్రభుత్వంకు కంటి నిండ కునుకు లేకుండా పోయింది.

జల్-జంగిల్-జమీన్ ఆదివాసీలు తమ భూములు, అడవి, హక్కుల కోసం ఉద్యమించారు. సీపీఐ యంఎల్ "పీపుల్స్ వార్ (ప్రజలయుద్ధం) ఆధ్వర్యంలోని గిరిజన రైతు కూలీ సంఘం, ఆదివాసీలకు భూమి పట్టాల కోసం భూస్వాముల భూమి ఆక్రమణలను నిరసిస్తూ ఇంద్రవెల్లిలో సభ ఏర్పాటు చేసింది.

అడవిపై హక్కుల కోసం ఆదివాసీలు ఈ సభకు పెద్ద సంఖ్యలో ఆదివాసీలు విల్లు, బాణాలు, కర్రలతో తరలివచ్చారు.

1981 ఏప్రిల్ 20 న ఆదివాసీలు నిరసన తెలుపుతుండగా పోలీసులు సభపై కాల్పులు జరిపారు. ఒక కానిస్టేబుల్‌ను చంపారని అందువల్లే కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసుల ఆరోపణ..

అమరులైన గిరిజనులు ఘటనలో అధికారికంగా 13 మంది ఆదివాసీలు మరణించినట్లు ప్రకటించారు, కానీ అనధికారికంగా వందల మంది చనిపోయారని, చాలా మంది ఆదివాసీలు అడవుల్లోకి పారిపోయారని, కొందరు చనిపోగా వారి మృతదేహాలను కూడా పోలీసులు దహనం చేశారని ఆరోపణలు ఉన్నాయి.


సభ ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్ సభలపై నిషేధం విధించారు, సభ విజయవంతం కోసం ఆదివాసులు అధిక సంఖ్యలో సభకు తరలి వచ్చినారు.

ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా మేధావుల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆదివాసీల భూ హక్కుల పోరాటాన్ని అణచివేయడానికి ఈ కాల్పులు జరిపారని విమర్శలు వచ్చాయి. ఘటన జరిగిన చోట ఆదివాసీల అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు, దీనిని పోలీసులు 1986లో కూల్చివేసి, తర్వాత ప్రజా నిరసనలకు తలొగ్గిన ప్రభుత్వం స్థూపాన్ని నిర్మించడానికి ఒప్పుకొంది. ఈ ఘటన జరిగి నేటికీ 45 ఏళ్లు, ఆదివాసీ ప్రజలకోసం చేసిన త్యాగాలకు ప్రతీకగా దూరం ప్రాంతాలనుండి చుట్టు గ్రామాల నుండి జాతర లాగ ప్రజలు ఎడ్ల బండ్ల పై ఇంద్రవెల్లికి వచ్చిస్తూపం వద్ద ప్రతి ఏట అమరుల త్యాగాలను ఎత్తి పట్టుతు చుట్టు ప్రాంతం ప్రజలు నివాళులు అర్పిస్తారు.



**బాలసాని రాజయ్య**
సినియర్ జర్నలిస్ట్
9866102315

## మలయశ్రీ కవిత - మానవత




సాహిత్య పరమార్థం సామాజిక ప్రయోజనమే అన్న విశ్వాసంతో గత ఆరు దశాబ్దాలుగా నిరంతరాయంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన సాహితీవేత్త డా. మలయశ్రీ. వస్తు వైవిధ్యం గల వివిధ ప్రక్రియలలో 150 దాకా రచనలు చేసిన కలం యోధుడు. సమాజంలో నెలకొన్న అసమానతల్ని, అమానుషాల్ని, అరాచకత్వాన్ని, అవినీతిని, అహంకారాన్ని, అధికార మదాంధతను చూసినప్పుడు కలిగిన స్పందనకు ఎప్పటికప్పుడు అక్షరాకృతిని కల్పిస్తూ నమ్మిన సిద్ధాంతం పట్ల గల అచంచల విశ్వాసంతో రచన వ్యాసంగమే శ్వాసగా ధ్యాసగా జీవించాడు.

సాహిత్యం, చరిత్ర, బౌద్ధం, పరిశోధన, సైన్సు అన్న వాటిని భూమికగా చేసుకొని ఆయన వివిధ ప్రక్రియల్లో రచనలు చేశాడు. మొదటిసారిగా కరీంనగర్ జిల్లాలోని కురిక్యాలలో జినవల్లభుడు వేయించిన శాసనంలోని పద్యాలే చారిత్రకంగా దొరికిన తొలి కందాలని చెప్పారు. కాశీఖండం అయ: పిండం అంటారు. అలా అశ్వఘోషుని వజ్ర సూచిని తొలిసారిగా గుంటూరుకు చెందిన రవిచంద్ మిళింద ప్రచురణల ద్వారా తెలుగులోనికి అనువాదం చేసింది మలయశ్రీనే కావటం విశేషం. కరీంనగర్ జిల్లా వెయ్యేళ్ల సాహిత్య చరిత్రను మథించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.1960 నుంచే సృజనాత్మకమైన ఆయన కవితా వ్యాసంగం ప్రారంభమైంది. రచనాపరంగా ధర్మశ్రీ తొలికావ్యమైన అచ్చయినది మాత్రం 1968 లో వచ్చిన కావ్య సుందరి ఖండకావ్యం. ఆయనకు బాగా పేరు తెచ్చిన రచనల్లో శాంతి పథం, తెలుగులో లేఖా సాహిత్యం, కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం, మానవ గీత, తిరుగుబాటు, నిర్ణయం నవలలు, ఐరేని కుండలు కథలు, తెలంగాణ చరిత్ర- సంస్కృతి జన జీవితం, తొలి తెలుగు చక్రవర్తులు మొదలైనవి ముఖ్యమని చెప్పవచ్చును. అయితే ప్రచార ప్రసార సాధనాలు అంత విస్తృతంగా వ్యాప్తి చెందని కాలంలో ఆయన సృజనాత్మక కవితా వ్యాసంగానికి సంబంధించి ఎన్నో రచనలు చేశారు. అందులో ధర్మ శ్రీ, సురభి, కావ్య సుందరి, తొలి సంజ, మలి సంజ, హృదయ స్పందన, వంటి పద్య కావ్యాలు, రాగశిఖ, మల్లెలు- మందారాలు, రాగవల్లరి వంటి గేయాలు, పేదల పాటలు, ఎన్నికల పాటలు, రైతు పాటల తో పాటు, రంగుల పిట్టలు, బంగారు బొమ్మలు, చుక్కల లోకం, పాల మనసులు వంటి బాలసాహిత్యం, దేశభక్తుల జీవిత చరిత్రలు మొదలైనవి ఉన్నాయి.

ఇప్పటివరకు ఆయన సాహిత్య సేవను గుర్తించి ప్రభుత్వ ప్రైవేటు సంస్థలెన్నో పురస్కారాలను అందించాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత జూన్ 2015 లో జరిగిన తొలి వార్షికోత్సవంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఉత్తమ సాహిత్య వేత్తగా ఆయన సన్మానం పొందారు.

ఇలా ఆయన తన జీవితకాలంలో ఎన్నో సభలలో సమావేశాలలో పాల్గొన్నారు. సన్మానాలను అందుకున్నారు.

ముఖ్యంగా ఆయన రచనలన్నింటిలో మానవతావాదం అంతర్లీనంగా ప్రవహిస్తోంది. వాటిని పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

బౌద్ధ సంబంధమైన ఆయన తొలి కావ్యం ధర్మశ్రీ లో అశోకుని పట్టపురాని తిష్యచే

"రాజ స్త్రీకి సుఖంబు కల్ల.." అనే పద్యంలో రాజులు బహుభార్యత్వాన్ని కలిగి ఉంటే సామాన్యులు ఏకపత్నీ వ్రతులని, కనుక సామాన్య స్త్రీలే గొప్ప వారని చెప్పడం అభినవ దృక్పథం. అలాగే కదన మందు లేదె క్రాంతి కాంతి అని కళింగ యుద్ధానికి ముందు కయ్యానికి కాలు దువ్విన అశోకుడు చివరకు పరిణామాలను గమనించి "ప్రేమను కొనదలచిన మన ప్రేమయే వలయున్" శాంతి అహింసల ఆవశ్యకతను గురించి, పరస్పర ప్రేమాభిమానాలను గురించి చెబుతాడు. ఇది 1960 నాటి కావ్యమైనా అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ తరుణంలో ఈ వాక్యాలు ప్రాసంగికతను కోల్పోలేదు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని ప్రబుద్ధులకు తల్లి గొప్పతనాన్ని గుర్తు చేస్తూ "ఒక దిన మాత్మజుండు దినకుండిన నెంతగ కుందిపోదువమ్మ! కానీ వృద్ధవై ఒక పలుకైన గాని యననోపవుగా సుతుడెట్లు చూచినన్.." ఈ పాదాలు తల్లిదండ్రుల పట్ల యువత నిర్వహించవలసిన బాధ్యతను గుర్తుచేస్తున్నాయి. అలాగే "కడుపులోని అగ్ని కాల్చుచున్నపుడే, తిండి లేని వారి తీరు తెలియు.." అని గుర్తు చేశాడు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లు నేటి సమాజంలో మనిషి డబ్బు చుట్టూ తిరుగుతుండడాన్ని గమనించి "ధనమును సృష్టించి మనము దగా పొందినాము, దైవమును కల్పించి దాసులమైనాము" అని సంఘ నీతితోపాటు హేతువాద దృక్పథాన్ని వెల్లడించాడు. మద్యపానం పైన వచ్చే ఆదాయంతో ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించవచ్చేమో గాని మౌలికంగా అది పచ్చని సంసారాలలో చిచ్చు పెడుతుందని ఇల్లాలి వేదనను వ్యక్తీకరిస్తూ "గొడ్డువాయె గోదవాయె, చేనువాయె, చెల్కవాయె, నా మీది నగలువాయె – నగుబాటు బతుకాయె" అని నలుగురిలో తన బతుకు నవ్వుల పాలు అయిందని చెబుతుంది. మద్యం ఆరోగ్యానికే కాదు ఆర్థికంగాను, సామాజికంగానూ అది అనర్థాలకు దారితీస్తుంది. ప్రభుత్వ గణాంకాలు కూడా అవే చెబుతున్నాయి. ప్రజా ప్రభుత్వాలు దశలవారీగా మద్య నిషేధానికి పాటుపడాలి. అలాగే కులమత బేధాలు కూడదని, మనుషులంతా ఒకటేనని ప్రబోధిస్తూ "మనమందరము-నరులం, మనలో తేడాలుంటే వానరులం, మనదంతా ఒకే నీతి-అదే మానవతారీతి" అని చాటాడు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని గురించి రాస్తూ "ఆకలి అంటే అగ్గిరా, అది తగిలిందంటే బుగ్గిరా, అది పేగులు కోసే కత్తిరా, ప్రాణాలను తీసే మిత్తిరా" అంటాడు. ఎన్నికల సమయంలో ప్రజలు "గోవులోలె చూస్తుంటే- నాయకులు గొర్రెలోలే పోతుంటరు" అని హెచ్చరించాడు. ఓటర్లు తమ ఓటు హక్కును అమ్ముకోకుండా చైతన్యంతో వ్యవహరించాలని ధ్వని "వట్టి వ్రేళ్ల తడి తడకల మధ్య నివసించే వారికి-వడగాడ్పుల ప్రభావాలు ఏం తెలుస్తాయి" అంటూ ఏసీ గదుల్లో కూర్చునే ఆగర్భ శ్రీమంతులకు అనాథల ఆకలి కేకల గురించి ఏం తెలుస్తుందని ప్రశ్నించాడు. అందుకే "ఆకలి రగిలే పొట్టలు-నిద్రిస్తున్న అగ్నిపర్వతాలు" అన్నాడు. గ్రామీణ వ్యవస్థలో నిన్నటి వరకు మకుటం లేని మహారాజులుగా చలామణి అయిన దొరలను ఉద్దేశిస్తూ "ఊరంతా నిన్న ఏడుస్తున్నారెందుకు??...
దొరగారి కుక్క చనిపోయినందుకు..
ఈరోజు నవ్వుతున్నారే??
దొరగారు పోయారు"

అని చెణుకు వెంటే చెర్నాకోల విసిరారు. సమాజంలో పురుషునికోనీతి, స్త్రీకోకనీతిని బోధించే లోకంరీతిని ఎండగడుతూ

"ఆ జంటలో ఒకరు మరణిస్తే, ఆమె ఎలా పెళ్లి చేసుకుంటుందండి, పిల్లలు ఉన్నారు. అతడు పెళ్లి చేసుకోకుంటే ఎలాగండి..!!-పిల్లలు ఉన్నారు.." అంటూ లింగ వివక్షతను చూపే వ్యవస్థను ఎత్తిపొడిచారు.

ఇలా సమాజంలోని ఎన్నో నిత్య నైమిత్తికాంశాలను తనదైన కోణంలో దర్శించి కవిత్వీకరించిన మానవీయకవి మలయశ్రీ. "వ్యక్తికి బహువచనం శక్తి అని శ్రీశ్రీ అంటే ఆ శక్తికి బహువచనం వ్యక్తి..!!" అని నిరూపించిన కవి మలయశ్రీ. చివరగా మలయశ్రీ తన "హృదయ స్పందన"గా చెప్పిన

"శాలువాలు వద్దు, సన్మానములు వద్దు,
పొగడ వద్దు నన్ను తెగడ వద్దు,
నచ్చియున్న మీకు నా నవ్య భావాలు,
ఆచరింతురేని అదియె చాలు
వ్యాప్తి జేతురేని - వందనాలు"

తేదీ 10.4.2026న "సెలవిప్పటికీ... స్నేహమెప్పటికీ... అంటూ ఈ లోకాన్ని విడిచి వెళ్లిన మలయశ్రీ దివ్య స్మృతికి ఇదే నా అక్షరాంజలి.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
99 891 48 305

# ప్రతి విద్యార్థి చదువులో ఉన్నతంగా ఎదగాలి

**ఫరూక్‌నగర్, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధులు, బూర్గుల గ్రామ మాజీ సర్పంచ్ బూర్గుల నరసింగ రావు కుటుంబ సభ్యులు కపిల్ రాజారావు మెల్కోటి జ్ఞాపకార్థంగా బూరుగడ్డ తండా, కడియాలకుంట, బూర్గుల, కాశిరెడ్డిగూడ గ్రామాల్లో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు కథల పుస్తకాల పంపిణీ కార్యక్రమాలని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రగతి వెల్ఫేర్ అధ్యక్షులు డా. అలోక్ అగర్వాల్ ఆధ్వర్యంలో కాశిరెడ్డిగూడలో 135బ్యాగ్‌లను, బూర్గులలో 275 బ్యాగులను, కడియాలకుంటలో 42 బ్యాగులను, బూర్‌గడ్డ తండాలో 82 బ్యాగ్‌లను, పంపిణీ చేశారు. అనంతరం మిగతా ఉమ్మడి బూర్గుల గ్రామ పంచాయతీ మొత్తంలో 1000 బ్యాగులు విద్యార్థులకి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ నేషనల్ పోలీస్ అకాడమీ డైరక్టర్ అరుణ బహుగుణ, ఏసీపీ లక్ష్మీ నారాయణ, షాద్‌నగర్ సీఐ సీతారాం, ప్రగతి వెల్ఫేర్ అధ్యక్షులు డా. అలోక్ అగర్వాల్, నరసింగ రావు కుమార్తె మాళవిక మెల్కోటి, ప్రగతి కార్యదర్శి ప్రవీణ్ అగర్వాల్, నూపూర్, అరుణ, ప్రణయ్ బహుగుణ, షాద్‌నగర్ ఎస్ఐ రాజేష్, మూడు గ్రామాల సర్పంచులు, పంచాయతీ సభ్యులు, రిటైర్డ్ ఎంఈఓ గణేష్ కుమార్, రిటైర్డ్ జీహెచ్‌ఎం రమేష్,, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ సురేష్ హాజరయ్యారు.




ఈ సందర్భంగా బూర్గుల గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో దివంగత కపిల్ రాజారావు మేల్కోటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి రిటైర్డ్ నేషనల్ పోలీస్ అకాడమీ డైరక్టర్ అరుణ బహుగుణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల్ని చదువులో ప్రోత్సహించి ఉన్నత స్థాయిలో స్థిరపడేలాగా చూడాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను చదువు దూరం చేయకుండా చూడాలని, వారిని బాగా చదివిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని విద్యార్థులు తల్లిదండ్రులకు సూచించారు. కపిల్ రాజారావు మెల్కోటి ఎంతో ఉన్నతంగా చదువుకొని బూర్గుల గ్రామానికి మంచి చేయాలని ఎప్పుడు కోరుకునే వాడు అని ఆమె గుర్తు చేశారు. ఆయన జ్ఞాపకార్థం నేడు చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. ఇక్కడి ప్రాంత ప్రజలకు బూర్గుల నర్సింగరావు కుటుంబ సభ్యులు నిరంతరం అండగా నిలుస్తూ ఉంటారని, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ద్వారా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా కపిల్ రాజారావు మేల్కొటి తల్లి మాళవిక మాట్లాడుతూ పిల్లలందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ప్రోత్సహించారు. తమ బిడ్డ గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే వారు అని, ఆయన ఆశయా సాధన కోసం నేడు ఉమ్మడి బూర్గుల గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలల్లోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం ఏసీబీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉన్నత చదువులతోనే సమాజంలో గౌరవం, హోదా దక్కుతుందన్నారు. ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కంప్యూటర్ కోర్సులు లాంటి విద్యాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సిబ్బంది సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ మురళీకృష్ణ, జగదీశ్, ప్రగతి, శ్రీకాంత్, కార్తిక్, తులసి, లావణ్య, శ్రుతి, కడియాల కుంట తాండ డిప్యూటీ సర్పంచ్ తావు సింగ్ నాయక్, వార్డ్ సభ్యులు చాట్ పట రవీందర్ నాయక్, గోపి నాయక్, ప్రియాంక దేవేందర్ నాయక్, మాజీ డిప్యూటీ సర్పంచ్ రెడ్యా నాయక్ అంగన్వాడీ టీచర్ సుజాత, ఆశ వర్కర్ సరిత, శ్రీను నాయక్, చిట్టి నందిని తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




**కాప్రా, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** చర్లపల్లి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఖండించారు. ఆదివారం చర్లపల్లి వెళ్లి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను తొలగించడం అన్యాయం, సమాజానికి అవమానం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విగ్రహాలను పునఃప్రతిష్ట చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసులను ఆయన డిమాండ్ చేశారు. విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసే వరకు విశ్రమించబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ మాజీ అధ్యక్షుడు దప్పు గిరి బాబు బొజ్జ నర్సింహ కడియాల యాదగిరి దర్శనం లక్ష్మయ్య బొజ్జ భిక్షపతి కడియాల అనిల్ కుమార్ దప్పు సతీష్ కడియాల కుమార్ దర్శనం బాలకృష్ణ కడియాల బాబు జే. ప్రభాకర్ రెడ్డి కె. నరేష్ గౌడ్ శేఖర్ రెడ్డి కోటి రెడ్డిరెడ్డి నాయక్.అంజన్న సుభాష్ సూర్య పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో పాత గ్రామపంచాయతీ కార్యాలయం

- భవనమును తొలగించాలని గ్రామస్తుల వినతి



**ఇటిక్యాల, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** ఇటిక్యాల గ్రామ మధ్యలో నిర్మించిన పాత గ్రామపంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో ఉందని ప్రమాదకరంగా కూలిపోయే స్థితిలో చేరుకుందని, దీనిని వెంటనే తొలగించాలని గ్రామస్తులు అధికారులకు విన్నవిస్తున్నారు. గత 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం నిరుపయోగకరంగా మారడంతో పైకప్పు పడిపోయిందని అందులో క్రిమీ కీటకాలు చేరి ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని, దీంతో ఆ భవనంకు ఆనుకుని ఉన్న ప్రధాన దేవాలయం సమీపముగా ఉండటంతో ఇబ్బందికరంగా మారిందని భవనాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు ప్రజలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని నిర్మించాలని ప్రజాప్రయోజనాలకు వాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలుపుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని గ్రామ సర్పంచ్ జివేందర్ రెడ్డి కి సైతం విన్నవించినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు.

## విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం



**షాద్‌నగర్, ఏప్రిల్ 19 (షాద్ నగర్) :** ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ పంచాయతీ మహల్ ఎలికట్టలో విద్యుత్ సమస్యకు అధికారులు శాశ్వత పరిస్కారం చూపారు. ఆదివారం గ్రామ సర్పంచ్ నవ కిరణి నరసింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో ట్రాన్స్ఫార్మర్స్ అమర్చారు. గతంలో యాభై కెవి ట్రాన్స్ఫార్మర్ వలన లో వోల్టేజి సమస్యలు విద్యుత్ కోతల వలన ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అంతేకాకుండా రైతులు,గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సర్పంచ్ కలిసి వివరించారు. సమస్యను విన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వంద కెవి ట్రాన్స్ఫార్మర్ పెంచడం వలన గ్రామంలో తీరాయి.కరెంట్ కష్టాలు తీరడంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను,సర్పంచ్ నవకిరణి నరసింహ ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినోద్ కుమార్, లైన్ మెన్ నాగరాజు, వార్డు సభ్యులు గడ్డమీది శ్రీను, గోనెల రాము, గ్రామస్తులు గుళ్లే కృష్ణయ్య,చౌడపురం భీమయ్య, బద్దుల కృష్ణయ్య, లింగం గౌడ్,నీరటి జగదీష్, భువనేష్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పల్లె పోరు

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్
- 23న ఓటర్ల ముసాయిదా జాబితా
- టికెట్ల కోసం ఆశావహుల పరుగులు

**కోహిర్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మళ్లీ ఊపందుకోనుంది. మే నెలలో జడ్పీటీసీ, ఎంపీటేసీ ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఎన్నికల సంఘం వెంటనే రంగంలోకి దిగి జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 23వ తేదీలోపు ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేసి ప్రచురించాలని గడువు విధించడంతో .కోహిర్ మండల పరిధిలోని పంచాయతీ, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది.




కొత్త ఓటర్ల నమోదు, వార్డుల వారీగా విభజన వంటి పనులు వేగంగా కొనసాగు తున్నాయి. ఇదే సమయంలో జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్. కోహిర్ నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారుతుండగా, ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. రిజర్వేషన్లపై స్పష్టత కోసం నాయకులు ఎదురుచూస్తుండగా, పల్లెల్లో రాజకీయ చర్చలు ఊపం చుకుని ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కుతోంది.

# వ్యక్తిగత భద్రతకు డిజిటల్ లిటరసీ ఎంతో ముఖ్యం

- సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం రమేష్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డిజిటల్ లిటరసీని అవగాహన చేసుకోవడం ద్వారా సైబర్ పరంగా మరింత భద్రతను పొందవచ్చని సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం రమేష్ తెలిపారు. 'దిల్ సే ట్రైన్ – ద – ట్రైనర్' పేరుతో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సౌజన్యంతో సైబరాబాద్ పోలీస్ అధికారులు నిర్వహించిన కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం సిపి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్సీఎస్సీ ఫోరం జాయింట్ సెక్రెటరీ రఘు కన్నన్ పర్యవేక్షణలో నిర్వహించిన రెండు రోజుల కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఐటి కారిడార్ పరిధి ప్రతినిధులు పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా ఎస్సీ ఎస్సీ ఆర్గనైజేషన్ సిఈఓ నవీద్ ఖాన్ మాట్లాడుతూ ఈరోజుల్లో ఇంటర్నెట్ మనిషి దైనందిన జీవితంలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుందని, దాని పట్ల అవగాహన పెంచుకునే వారికి అది పాజిటివ్ రోల్ ను అందిస్తుందన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన, డిజిటల్ ఫుడ్ ఫ్రెండ్స్, సామాజిక మాధ్యమాలలో తప్పుడు వార్త కథనాలు పుట్టుకొస్తున్న తీరుతెన్నులు, ఆన్లైన్ గేమింగ్, సోషల్ ఇంజనీరింగ్ స్కామ్స్ తదితర అంశాలపై అఅవగాహన కార్యక్రమంలో కూలంకషంగా చర్చించడం జరిగిందని సైబరాబాద్ సిపి వివరించారు. గుర్తుతెలియని



వ్యక్తుల ద్వారా వచ్చే సందేశాలు, మొబైల్ ఫోన్ లోకి వచ్చే ఏపికె ఫైల్స్, ఆకర్షణీయమైన ప్రకటనలను ప్రజలు నమ్మవద్దని, ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల సాంకేతిక పరిజ్ఞానం లభించి సైబర్ ఫ్రాడ్ ల నుండి తప్పించుకునేందుకు ఎన్నో అవకాశాలు లభిస్తాయి అన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు మోసపోయిన మొదటి గంట( గోల్డెన్ హవర్ )లోపే సంబంధిత పోలీస్ అధికారులకు 1930 డయల్ చేయడం ద్వారా సమాచారాన్ని అందిస్తే సాధ్యమైనంతవరకు వారి తమ్మని సైబర్ నేరగాళ్లు దొంగిలించకుండా అడ్డుకునే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ డిసిపి సాయి మనోహర్, ఎస్సీఎస్సీ అసోసియేట్ డైరెక్టర్ భానుమూర్తి, సైబర్ సెక్యూరిటీ ఫోరం ప్రతినిధులు కృష్ణవేణి, రియాజుద్దీన్, ఎస్సైలు సందీప్ రాజ్, మౌనిక, ఎస్సీఎస్సీ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, ఇతరులు తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుని బోధనలు ఆదర్శనీయం

**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** విశ్వగురు మహాత్మ బసవేశ్వరుని బోధనలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని వీరశైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ... బసవేశ్వరుడు స్వయంగా కవి, తత్త్వవేత్త, పరిపాలనాదక్షుడు, సంఘ సంస్కర్త అని ఆయన అన్నారు. ధార్మిక సిద్ధాంతాల రూపంలో సంఘాన్ని సంస్కరించడానికి నిరంతరం కృషిచేశారన్నారు. భక్తి ఉద్యమరూపంలో సామ్యవాద సిద్ధాంతాన్ని ఆచరణలోకి తెచ్చిన మహానీయుడని, ఆయన వచనాలు అనేక భాషల్లోకి అనువదించబడినాయని తెలిపారు. బసవన్న 12వ శతాబ్దంలో జన్మించి దక్షిణాది రాష్ట్రాల్లో శైవ ప్రచారాన్ని ఉధృతంగా సాగించారని, సామాజిక సమానత్వం ప్రతిపాదిస్తూ, కుల, మత, లింగ, భేదాలను నిర్మూలిస్తూ, వీరశైవాన్ని అందరికీ



అందుబాటులోకి తీసుకువచ్చాడన్నారు. బ్రాహ్మణ కులం లో క్రీ.శే. 1105లో జన్మించిన బసవేశ్వరుని జయంతిని ప్రపంచవ్యాప్తంగా లింగాయతులు, శైవులు ఒక పండుగగా జరుపుకుంటరని గుర్తు చేశారు. 2015 నవంబర్ 14న ప్రధాని మోదీ లండన్ లోని థేమ్స్ నదీ తీరం లో బసవేశ్వరుని విగ్రహాన్ని ఆవిష్కరించారు.

## హిందూ ధర్మం విశిష్టతను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలి

- రాంరెడ్డి పల్లి గ్రామంలో హిందూ సమ్మేళనం
- హాజరైన బీజేపీ రాష్ట్ర నేత ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి



**ఉర్కొండ, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** హిందూ ధర్మం విశిష్టతను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలని మలయాళ స్వామి, దయానంద స్వామి, హైందవ వక్త యాదిరెడ్డి తెలిపారు. మండలంలోని రామిరెడ్డి పల్లి గ్రామంలో ఆర్ఎస్ఎస్ ఆవిర్భ వించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆదివారం రోజు హిం దూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హాజరయ్యారు.హిందువులంతా సంఘటితమైతే సమీప భవిష్యత్‌లో భారత్ విశ్వగురుస్థానంతో పూర్వవైభవాన్ని సంతరించుకోవడం ఖాయమన్నారు. హిందూ సమ్మేళనం సభ ద్వారా మరోసారి పౌరుల్లో ప్రేరణాశక్తిని రగిలించినట్లయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో భజనలు, భక్తి గీతాలు ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓర్సలివేల ఆంజనేయులు, ఉప సర్పంచ్ శ్రీశైలంయాదవ్, సభ అధ్యక్షులు సాంబశివుడు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు,పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాకరుణ అహింసా సద్భావన ర్యాలీ




**మెదక్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కేంద్రంలోని ఆదివారం రోజు బ్రహ్మర్షి పత్రీజీ గారి దివ్యాసీశులతో పిఎంసి ర్యాలీనీ సాయి బాలాజీ గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పిఎం సి ధ్యాన గద్దర్ మాట్లాడుతూ జంతు వధ అన్నది మానవాళి యొక్క మహాపాపమని,జంతు మాంస భక్షణ అన్నదే సకల రోగాలకు మూలమన్నారు. సాధు అనే పద ప్రయోగంలోనే మృదుత్వం,శాంతి ఉన్నాయని ఉద్ఘాటించారు.కేవలం. అహింసా మార్గం ద్వారానే ఈప్రపంచం శాంతి యుత్త మవుతుందన్నారు.కార్యక్రమానికి హాజరైన మెదక్ మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ ఎండీ.షమియుద్దీన్ మాట్లాడుతూ ఈరోజు నుండి నేను పూర్తిగా శాఖహారీగా మారుతున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆయనను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎంసి కి చెందిన చౌదరి శోభారాణి, సంగారెడ్డి జిల్లా పిరమిడ్ మాస్టర్ సంగమేశ్వర,బొమ్మ బాలేశం,కోలాచల ప్రవీణ్ కుమార్,పొడిచన్ పల్లి మాస్టర్ అనసూయమ్మ,రామ్మోహన్, సంతోష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుండ్రెడ్డిపల్లిలో అకాల వర్షం

- రహదారికి అడ్డంగా పడ్డ చెట్టును తొలగించిన ఉపసర్పంచ్ ప్రవీణ్



**తూప్రాన్ ఏప్రిల్ 19( జనం సాక్షి) :** తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి భారీ వృక్షం నేలకూలింది. వర్షం ధాటికి ఒక్కసారిగా చెట్టు రోడ్డుపై పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారి పూర్తిగా మూసుకుపోవడంతో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్, వార్డ్ మెంబర్ బిక్షపతి ఘటనా స్థలానికి చేరుకున్నారు. జాప్యం చేయకుండా స్వయంగా గొడ్డలి పట్టి, చెట్టు కొమ్మలను నరికి రహదారిని క్లియర్ చేశారు. అధికారుల కోసం వేచి చూడకుండా, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారు తక్షణమే స్పందించిన తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మెదక్ మున్సిపాలిటీలో కో ఆప్షన్ కోలాహలం

- మెదక్ బల్దియాలో నాలుగు సీట్లు
- మొదటిరోజు 3 నామినేషన్లు
- రేపే ఆఖరు తేది

**మెదక్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మెదక్ బల్దియాలో కో-ఆప్షన్ ఎన్ని కలకు సమయం ఆసన్నమైంది. కౌన్సిల్ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి ఆశావహులు ఎదురుచూస్తు న్నారు. ఎట్టకేలకు శనివారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. అధికార కాం గ్రెస్ నుంచి మాజీ కౌన్సిలర్ రాగి వనజ, మాజీ సర్పంచ్ కొర్వి రాములు, తాయర్ అలీ నామినేషన్ దాఖలు చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేశ్ గౌడ్తో కలిసి సరైన నామినేషన్ పత్రా లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిక అందజేయడం జరిగింది. మెదక్ బల్దియాలో 4 కో అప్షన్ సీట్లు ఉన్నాయి. ఇందులో రెండు జనరల్ (ఒకటి మహిళ, మరొకటి పురుషులకు), జనరల్ సీట్లకు మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డు మెంబర్లు, మాజీ సర్పం చ్లు పోటీ చేయవచ్చు. రెండు ముస్లిం మైనార్టీలకు నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు కేటాయించారు. వారిలో ఒకరు మహిళ, మరొకటి పురుషులకు రిజర్వ్ చేశారు. కాంగ్రెస్ అధికార పార్టీతో పాటు ఏ పార్టీకి చెందిన మాజీలు పోటీ చేయవచ్చు. ముస్లిం మైనార్టీల్లో పార్టీలకు సంబంధం లేకుండా ఎవరైన సరే పోటీ చేయడానికి అర్హులు. అధికార పార్టీకే అవకాశాలు అన్ని పార్టీల నుంచి అభ్యర్థులు నామినేషన్లు స్వీకరణ దాఖలు చేసినప్పటికీ, కాంగ్రెస్ అధికార పార్టీకి చెందిన అభ్యర్థులే కో ఆప్షన్ సభ్యులుగా గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం పదవిలో ఉన్న కౌన్సిల్ సభ్యులు ఓటువేసి కో అప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. ఈనెల 20 వరకు నామినేషన్లు




స్వీకరిస్తామని, మొదటి రోజు కాంగ్రెస్ నుంచి మూడు నామినేషన్లు వచ్చాయని మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎన్నికల తేదీని ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదని, ఆదేశాలు రాగానే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
20 ఏప్రిల్ 2026

# హిందువులందరూ ఐక్యమత్యంతో ఉండాలి

- శ్రీ ఆచార్య కృష్ణానంద స్వామి

**బిజినేపల్లి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** ఏప్రిల్ 19 హిందూ ధర్మం విశిష్టతను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలని హిందువులంతా సంఘటితమైతే సమీప భవిష్యత్‌లో భారత్ విశ్వగురుస్థానంతో పూర్వవైభవాన్ని సంతరించుకోవడం ఖాయమని శ్రీగిరి అష్టలక్ష్మి క్షేత్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ పూజ్య శ్రీ ఆచార్య కృష్ణానంద స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం మంగనూరు గ్రామంలో ఘనంగా హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరై శ్రీ ఆచార్య కృష్ణానంద స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.హిందువులంతా ఐక్యత ఉండాలని మన ధర్మాన్ని మనం మరిచి పోకూడదని చెప్పారు.సంస్కృతి సాంప్రదాయాలను పట్టించుకోకుండా ఎక్కడ సంతోషం ఉన్నదో అక్కడ సుఖాల కోసం తాపత్రయ పడడం సరికాదు అన్నారు. 84 జీవులలో ఒకటైన మనం జ్ఞానాన్ని కలిగి ఉన్నామని, మన పిల్లలను మనం ఎల్లప్పుడూ గమనిస్తూ మంచి దారిలో నడిచేలా చూడాలన్నారు. హిందూ ఆడబిడ్డలు లవ్ జిహాద్ చేతిలో మోసపోతున్నారని, వారి వలలో ఆడబిడ్డలు పడకుండా వారిని తల్లిదండ్రులు చైతన్యవంతులను చేయాలని సూచించారు. సరైన సమయంలో మన పిల్లలకు వివాహాలను జరిపిద్దాం అని, కుటుంబ నియంత్రణ కేవలం హిందువులకి ఎందుకని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలల్లో చదివించి సంస్కృతి సాంప్రదాయాలను నేర్పిద్దామని స్వదేశీ వస్తువులను వాడాలని కోరారు.హిందూ ధర్మం సంస్కృతి సనాతనమైనది. అది కేవలం గతం కాదు, ఈ దేశపు వర్తమానం అలాగే భవిష్యత్తు



కూడా. నేటి వేగవంతమైన ప్రపంచంలో మన మూలాలను గౌరవించుకుంటూ, ఐకమత్యంతో ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ముఖ్య వక్తగా హాజరైన చామర్తి దేవేందర్ రాజు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఈ సమ్మేళనాల ద్వారా ఐదు ముఖ్యమైన జీవన సూత్రాలను, అవే పంచపరివర్తన్ అంటే సామాజిక సమరసత, కుటుంబ ప్రభోధన్, పౌరవిధులు, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు సూత్రాల ద్వారా సమాజంలో మార్పు జరగాలని వాటన్నింటితో కూడిన బలమైన సమాజం రావాలని కోరారు. కులం,వర్గం, ప్రాంతం, భాష పేరుతో విడిపోవడం మన బలహీనుత కాకూడదని"గడప లోపల కులం – గడప దాటితే హిందువులం" అనే నినాదం మన గుండెల్లో ప్రతిధ్వనించాలి అని పిలుపునిచ్చారు.పర్యావరణాన్ని కాపాడుదామని స్వదేశీ వస్తువులనే వాడదామని లేదంటే స్వాతంత్రానికి ముందు జీవించిన జీవితాన్ని గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి ఒక ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ తయారైతే ఈ దేశం ఎంతో ఎదుగుతుందన్నారు. కులం పేరుతో కాకుండా హిందుత్వం పేరుతో కార్యక్రమాలను జరుపుకోవాలని కోరారు. హిందూ సంస్కృతిక సాంప్రదాయాలను చిన్నప్పటినుండే చిన్నపిల్లలకు సరైన పద్ధతిలో తెలియజేయాలన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి కొనసాగుతుందని, వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక సంస్థగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. హిందూ సమ్మేళనం సభ ద్వారా మరోసారి పౌరుల్లో ప్రేరణాశక్తిని రగిలించినట్లయ్యిందన్నారు. మన మధ్య ఎన్ని అంతరాలు ఉన్నా, సమాజ హితం కోసం వాటన్నింటినీ పక్కన పెట్టాలి. విభజనలను వీడి, విద్వేషాలకు తావు లేకుండా, ఒకరికొకరు తోడుగా నిలిచే సమసమాజాన్ని నిర్మించడమే ఈ సమ్మేళనాల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు .హిందూ ధర్మం అనే సముద్రంలో మనమంతా చిన్న చిన్న బిందువులం ,ఆ బిందువులన్నీ కలిస్తేనే ఒక మహా ప్రవాహం ఏర్పడుతుంది. ఆ ప్రవాహమే మన సంస్కృతిని, సంప్రదాయాలను భావి తరాలకు అందిస్తుంది అని చెప్పారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా మాంకాల నగేష్, సర్పంచ్ జాలం నాగయ్య యాదవ్, కార్యదర్శి తిమ్మగాళ్ల శ్రీను, మహిళా వక్తగా ధనాల పూర్ణిమ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యకర్తలు, హిందూ సంఘాల సభ్యులు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రతిపక్షాల దిష్టిబొమ్మ దహనం చేసిన మండల బీజేపీ నాయకులు



**మెదక్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** ఆదివారం నాడు హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు 17/04/2026 నాడు పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 33% మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన ప్రతిపక్ష పార్టీలు నాయకుల దిష్టిబొమ్మ దహన కార్యక్రమం హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో మండల లిమహిళా మోర్చా అధ్యక్షురాలు కుక్కల విజయ ఆధ్వర్యంలోలి నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వదలపర్తి శ్రీనివాస్ జిల్లా నాయకులు శ్రీ పాల్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్ శ్యామ్ జిల్లా నాయకులు వెంకట్ మండల ఎస్టీ మోర్చా అధ్యక్షులు కుమార్ నాయక్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు సత్యం మండల ఉపాధ్యక్షులు సిద్ధిరామ గౌడ్ బూత్ అధ్యక్షులు వేణు మండల బీజేవైఎం నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కర్రోళ్ల అన్నమ్మకు దళితరత్న అవార్డు ప్రదానం



**చేర్యాల, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగం నిర్మాణ కర్త, భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ లోని అంబేద్కర్ కళ భవనంలో బాబు జగ్జీవన్ రావ్, బిఆర్ అంబేద్కర్ ఉత్సవాల కమిటీ, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కో చైర్మన్ సుదర్శన్ బాబు, దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్, చేతుల దళిత రత్న అవార్డును అందుకున్నారు. సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ, దళిత జర్నలిస్టుల ఫోరంలో దళిత జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ముందుకు వెళు న్న సందర్భంగా వారి సేవలను గుర్తించి దళిత రత్న అవార్డుకు ఎంపిక కావడం జరిగిందని కర్రోళ్ల అన్నమ్మ తెలిపారు. ఈ అవార్డు ద్వారా బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ అవార్డుకు కృషి చేసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉత్సవాల కమిటీ సభ్యులకు, దళిత జర్నలిస్టుల ఫోరం కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమర వాది లక్ష్మీనారాయణ



**తూప్రాన్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. తూప్రాన్ లో జిల్లా ఆర్యవైశ్య కమిటీ మహాసభ ప్రమాణస్వీకారం సందర్భంగా మాట్లాడారు. వైశ్యుల అభివృద్ధికి గత ముఖ్యమంత్రి కెసిఆర్ 5 ఎకరాల స్థలం కేటాయించారని వైశ్య హాస్టల్ నిర్మించడానికి కృషి చేస్తానని అన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పల్లెల రవీందర్ గుప్తా ప్రధాన కార్యదర్శిగా ఒక్క అశోక్ గుప్తా కోశాధికారిగా అశోక్ లచే ప్రమాణ స్వీకారం చేయించారు . పదవీకాలం పదవి రెండు సంవత్సరాలు ఉంటుందని వైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలని గతంలో పనిచేసిన కమిటీ సభ్యులు నూతన కమిటీకి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎలాంటి సమస్య వచ్చినా పాత కమిటీ సభ్యులను అడిగి తెలుసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సహాయ కార్యదర్శులు ఉపాధ్యక్షులు కోశాధికారులు మిగతా కమిటీలతో వేరువేరుగా ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా నలుమూలల నుండి ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లు తడుపునూరి చంద్రపాల్గుప్త రేణిగుంట రమేష్ కైలాస రామచంద్రం గంప శ్రీనివాస్ ఎం సి రాజమౌళి రాగి వనజ శివ నంది నారాయణ సుధా మల్లేశం బెజవాడ లావణ్య చింతల రవి కొమురవెల్లి శంకర్ అయిత రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**నారాయణపేట జిల్లా బ్యూరో ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో ఇటీవల పోలీసులు,టాస్క్ ఫోర్స్ అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపుతూ భారీగా రేషన్ బియ్యం స్వాధీనంచేసుకుంటున్నారు. తాజాగా ఆదివారం దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠలాపూర్ గ్రామ శివారులో పాడుబడిన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన పక్కా సమాచారంతో నారాయణ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో దామరగిద్ద ఎస్ఐ రాజు, డిటి ఆనంద్, సిబ్బంది శనివారం రాత్రి సంయుక్తంగా దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో మొత్తం 510 బస్తాలు 238 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఒక డీసీఎం వాహనాన్ని స్వాధీ నం చేసుకున్నారు. విచార ణలో ఈ పబ్లిక్ డిస్ట్రిబ్యూ షన్ సిస్టమ్ బియ్యం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన వెంకటే ష్ అనే వ్యక్తికి



సంబంధిం చినదిగా గుర్తించారు.
అతను గత కొన్ని రోజులుగా దౌల్తాబాద్ మండలం పరిధి లోని గ్రామాల నుంచి తక్కు వ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి ఇక్కడ దాచి కర్ణాటక రాష్ట్రంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.పట్టుబడిన రేషన్ బియ్యం వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి,డిటి పంచనామా పూర్తి చేసిన అనంతరం వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు దామరగిద్ద ఎస్సై ఎస్ఐ రాజు వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** మండలంలోని చిన్న అద్దిరాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నూతన గృహంలో పూజలు నిర్వహించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహిళా బిల్లుపై ప్రధానికి మోడీకి చిత్తశుద్ధి లేదు

- రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్




**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మహిళా బిల్లుపై ప్రధానికి మోడీకి చిత్తశుద్ధి లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్ అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజుద్దీన్ మాట్లాడుతూ.... మహిళ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి కి చిత్తశుద్ధి లేదన్నారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల పెంపు బిల్లుల ముసుగులో రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ మరోసారి చేసిన ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ, ఇతర విపక్షాలు కలిసి ఓడించాయని అన్నారు. నాలుగు రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ నీ ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అనసూయ. బుజ్జమ్మ. లలిత. లింగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం తగదు




**జడ్చర్ల, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు హెచ్చరించారు. ఆదివారం జడ్చర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 12వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వెంకట్ రాములు ప్రసంగిస్తూ ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 20, 21 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎంపీడీవో కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎల్లప్పుడూ ఉపాధి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ పేదలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు మే 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ జిల్లా మహాసభలు పి. జగన్ అధ్యక్షతన జరిగాయి. మహాసభలో భాగంగా 19 మందితో నూతన జిల్లా కమిటీని మరియు 8 మందితో కార్యదర్శి వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి. జగన్, కార్యదర్శిగా కడియాల మోహన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, సిఐటియు నాయకులు కిల్లే గోపాల్, ఎం. దీప్లా నాయక్, సత్తయ్య పాల్గొని తమ సందేశాలను అందించారు. నాయకులు హనుమంతు, రాములు, శివ, నీల, భగవంతు, రాజు, పాండు, యాదయ్య, సాయిలు, జయరాములు, శ్యాంసుందర్, మహేష్, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

## అడ్డాకుల మండల పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం

- తల్లి, నాలుగు నెలల శిశువు మృతి
- తండ్రికి తీవ్ర గాయాలు



**అడ్డాకుల, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల మండల శివారులో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తల్లి, నాలుగు నెలల శిశువు అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వనపర్తి మండలం కంచిరేవుపల్లి గ్రామానికి చెందిన ప్రకాశ్ రెడ్డి తన కుటుంబంతో కలిసి టీజీ 32 జు 6167 నంబర్ కారులో యాదగిరిగుట్టకు వెళ్తుండగా, ఉదయం సుమారు 6 గంటల సమయంలో హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో యూపీ రాష్ట్రానికి చెందిన అరటిపండ్ల లోడుతో ఆగి ఉన్న యుపీ 52 వీ 1776 నంబర్ లారీని వెనుక నుండి ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న నందిని (21) మరియు ఆమె నాలుగు నెలల కుమారుడు కన్నయ్య అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్ రెడ్డిని వెంటనే వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 20 నెలల్లో పేట జిల్లా సస్యశ్యామలం

- యుద్ధ ప్రాతిపదికన మక్తల్ పేట కొడంగల్ ఎత్తిపోతల పనులు
- మంత్రి శ్రీహరి

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మక్తల్ – నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల పథ కాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామనీ మరో 20 నెలల్లో నారాయణపేట జిల్లా ను సస్యశ్యామలం చేస్తామ ని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమా భివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.ఆదివారంనారాయణపేట జిల్లా దామరగిద్ద వద్ద కానుకుర్తి రిజర్వాయర్ కు ఆయన భూమి పూజ చేశా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథ కాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి గత ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. గత ప్రభు త్వ దౌర్భాగ్యం వల్ల పాల మూరు రైతులు ఆగమైపో యారని మండి పడ్డారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని మొదటి విడతను కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. సర్ ఆర్థర్ కాటన్ మాదిరిగా చరిత్రలో నిలిచిపోయేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల



నిర్మాణానికి కృషి చేస్తున్నార న్నారు. అందులో భాగంగానే మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని లక్ష్యంతో ముందు కు సాగుతున్నామని తెలిపా రు. రైతుల బాధలు తెలిసిన వాడిగా ఈ ప్రాంత బిడ్డ అయినందుకే మక్తల్ నారా యణపేట కొడంగల్ ఎత్తి పోతల పథకం పూర్తి చేస్తా మని హామీనిచ్చారు.భారత దేశ చరిత్రలో నిలిచిపోయేలా రైతుల భూములకు అధిక మొత్తంలో పరిహారం ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభు త్వం అని తెలిపారు. రాజకీ య పార్టీలకు అతీతంగా ఈ ప్రాజెక్టు పూర్తి కావాలని కోరుకోవడం అభినందనీ యమన్నారు. 4,500 కోట్ల బడ్జెట్ తో ఈ ప్రాజెక్టు ను పూర్తి చేస్తున్నామన్నారు. మరో 20 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ఇక్కడి ప్రాంత మంతా సస్యశ్యామల మవుతుందని స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్టు కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన కానుకుర్తి గ్రామం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.95 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడాన్నీ భవిష్యత్ తరా లు ఆదర్శంగా తీసుకుంటా యని పేర్కొన్నారు.మీ నిర్ణయాన్ని రాబోయే తరాలు స్మరించుకుంటాయని కితా బునిచ్చారు.ఇక్కడి రైతులకు వందనం చేస్తున్నామని, ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన కుటుంబాలకు బాధ్యతతో అండగా ఉంటా మని వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తానని హామీని చ్చారు.ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షుడు కే.శివకుమార్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి,కానుకుర్తి సర్పంచ్ నారాయణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,సర్పంచులు,అధికారులు రైతులు పాల్గొన్నారు.

# నస్తూరుపల్లి ప్రాంతంలో నల్ల బంగారం వెలికితీసేనా?

- ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజలు
- సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి స్థాపనకు ప్రకటన చేస్తారని గంపడాశలు..?
- ఈ ప్రాంతం అభివృద్ధి చెంది యువతకు ఉపాధి లభిస్తుందని ఆశ



**కాటారం ఏప్రిల్ 19( జనం సాక్షి):** రెండు దశాబ్దాల క్రితం భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తూరుపల్లి ప్రాంతంలో బొగ్గు గనులు నిక్షేపాలున్నట్టు సింగరేణి సంస్థ తో పాటు భూగర్భ శాఖ అధికారులు పరిశోధన చేశారు. గోదావరి పరిపాక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు నిక్షిప్తమై ఉన్నాయని సమాచారంతో నస్తూర్ పల్లె ప్రాంతంలో సింగరేణి సంస్థ ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించింది. గత 25 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువ ఉన్న నేపథ్యం లోసర్వే నిర్వహిస్తున్న సంస్థలు మధ్యలోనే సర్వే నిలువుగా చేసి వెళ్లిపోయారు. సర్వే చేసిన సమయంలో మావోయిస్టులు హెచ్చరిక చేయడం బొగ్గు నిక్షేపాల సర్వే బంద్ చేయాలని హెచ్చరికలు చేయడంతో సర్వే అర్ధాంతరంగా ఆగిపోయింది. నస్తూరుపల్లి లో బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు సింగరేణి సంస్థ యజమానానికి నివేదికలు సమర్పించినప్పటికీ ఇంతవరకు ఈ ప్రాంతంలో ఈ విషయంపై ప్రభుత్వం, సింగరేణి సంస్థ ఎలాంటి స్పందన లేకపోవడం తొ ఈ ప్రాంత వాసులు బొగ్గు గనులు ఎప్పుడు ప్రారంభిస్తారుఅని ఎదురుచూస్తున్నారు.. ఈ ప్రాంతం పూర్తిగా అడవి ప్రాంతం గుట్టలు ఉండడంతో బొగ్గువెలికి తీత సాధ్య సాధ్యాలపై సింగరేణి సంస్థ ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతము లో సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీత ప్రారంభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. నస్తూర్ పల్లి నుంచి 50 కి.మీ దూరంలో గోదావరిఖనిలో 30 కిలోమీటర్ దూరంలో భూపాల్ పల్లిలో 20 కిలోమీటర్ల దూరంలో తాడ్చెర్ల లో బొగ్గు గనులు ఉండడంతో ఈ ప్రాంతంలో సైతం బొగ్గు నిక్షేపాలనట్లు పరిశోధకులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో నస్తూరుపల్లి అడవి ప్రాంతం దాని చుట్టుపక్కల బొగ్గు గనులు వెలికితీత ప్రారంభిస్తే కాటారం, మహా ముత్తారం మహాదేవ పూర్ మండలంలో అభివృద్ధి తో పాటు ఈ ప్రాంతంలోని యువకులకు చాలామందికి ఉపాధి దొరికే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై పరిశీలన జరిపి బొగ్గు నిక్షేపాలపై పూర్తిస్థాయిలో పరిశోధన జరిపి ఈ ప్రాంతం అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వనదేవతల ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- మహాద్భుతంగా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 19(జనంసాక్షి) :** మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల పునర్నిర్మాణ అభివృద్ధి చివరి దశ పనులలో వేగం పెంచి, వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తుల కోసం మహాద్భుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఆదివారం ములుగు జిల్లా ఎస్-ఎస్.తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య, అశ్వాపురం శాసనసభ్యులు జారే ఆదినారాయణ లతో కలిసి దర్శించుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మేడారం చేరుకొని, సమ్మక్క-సారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం హరిత హోటల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ చివరి దశలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని గూర్చి మంత్రులకు, ఎమ్మెల్యేలకు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో, గుత్తేదారులతో చివరి దశ అభివృద్ధి పనులపై పలు అంశాలను చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరైన అన్ని ప్రధాన ఆర్చీల పనులను వేగంగా పూర్తి చేయాలని, సారలమ్మ పూజారుల కోరిక మేరకు క్యూలైన్ పక్కనే ప్రత్యేకంగా సారలమ్మ ప్రధాన ఆర్చీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలని పేర్కొన్నారు. గుడికి సంబంధించిన రాతి నిర్మాణాలలో ఎక్కడా చిన్న ఖాళీలు కూడా లేకుండా అత్యంత పటిష్టంగా ఉండేలా చూడాలని, గద్దెల ప్రాంగణంలో ఎత్తు పల్లాలు లేకుండా ఫ్లోరింగ్ సరిచేయాలని, గద్దెల రైలింగ్, ఆలయ డ్రైనేజీలలో ఎక్కడ చుక్క నీరు నిలవకుండా చూడాలని, ఆలయ ప్రాంగణంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రధాన రహదారి డ్రైనేజీకి లింక్ చేసే పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రధాన రహదారికి ఇరువైపులా శుభ్రం చేస్తూ మొక్కలను నాటాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వనదేవతల ప్రాంగణంలో భక్తులకు మెరుగైన సేవలందించేందుకు, నిర్వహణ కోసం మొత్తం అవసరమైన సిబ్బంది ప్రతిపాదనలను సిద్ధం చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులలో ఫేజ్-2లో భాగంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టవలసిన అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి మల్లూరు దేవాలయాన్ని కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేసి, వచ్చే భక్తులకు అన్ని సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు లోటుపాట్లు కలగకుండా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే విధంగా ఆలయ ప్రాంగణం ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణంలో మిగిలిన చివరి దశ పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక పూజారి కుటుంబానికి చెందిన బాలుడికి దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం చాలా బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ సంఘటనపై వెంటనే స్థానిక మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని బాలుడికి మెరుగైన వైద్యం అందించడం జరిగిందని, దానికి సంబంధించిన ప్రతి రూపాయి ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించిందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో బాలుడికి, బాలుడి కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని, కాలుకు సంబంధించి మెరుగైన టెక్నాలజీ ద్వారా కృత్రిమ కాలును ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారని తెలిపారు. అనంతరం మండలం లోని నార్లపూర్ గ్రామంలో ఆవుల లక్ష్మి రాజు దంపతులకు చెందిన ఇందిరమ్మ గృహం ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఏఎస్పీ మనన్ భట్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఏపిఓ వసంతరావు, ఆర్డీఓ వెంకటేష్, మేడారం సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ట్స్ కళాశాలలో క్రికెట్ క్రీడా పోటీలు

**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఒకరోజు క్రికెట్ క్రీడా పోటీలను ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ క్రీడా పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక చురుకుదనం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జట్టు భావన అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలలో ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలు ఉత్కంఠ భరితంగా సాగి ప్రేక్షకులను అలరించాయి.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, క్రీడా విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఏ.టి.బి.టి. ప్రసాద్, అధ్యాపకులు జితేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు

- డీలిమిటేషన్‌తో కొన్ని రాష్ట్రాలకు అన్యాయం
- వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ అన్నారు. ఈ మేరకు ఆయన వరంగల్ లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా బిల్లుతో డిలిమినేషన్ బిల్లును పాస్ చేసుకోవాలని చూసిన కేంద్ర ప్రభుత్వ వ్యూహాలని తిప్పి కొట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింది అన్నారు.బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్యప్రచారాలకు తెరలేపుతున్నారనీ, మహిళా బిల్లును సప్రేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని అవమానిస్తూ పాకిస్తాన్‌తో పోల్చి మాట్లాడటం బీజేపీ పార్టీకీ సరికాదు అన్నారు.గతంలో మహిళా బిల్లు తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీనే...ప్రతి విషయంలోనూ మహిళలకు పెద్ద పీట వేసింది కాంగ్రెస్ పార్టీనే... గతంలో కాంగ్రెస్ పార్టీ భారతదేశానికి ఇందిరాగాంధీని ప్రైమ్ మినిస్టర్ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అదేవిధంగా భారత దేశ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నుంచి సోనియా గాంధీ గారి చేసింది కాంగ్రెస్ పార్టీ అని అయూబ్ గుర్తు చేశారు. బీజేపీ పార్టీ ఒక్క రోజైనా మహిళలకోసం ఆలోచించిందా అన్నారు.డిలిమినేషన్ తో కొన్ని రాష్ట్రాలకు అన్యాయం జరగనుంది కాబట్టే మా ముఖ్యమంత్రి రేవంత్ ధ్వజమెత్తారు అన్నారు. దమ్ముంటే సోమవారం రోజున మహిళ రిజర్వేషన్ బిల్లును కేంద్రం పార్లమెంట్లో పెట్టాలి అని అయ్యూ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నిర్మల్‌లో ఆధ్యాత్మిక వైభవం

**నిర్మల్, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని అడివి5 మహాదేవ్ శక్తి సంస్థాన్ ఆధ్వర్యంలో శివరాజయోగి కృష్ణస్వామీజీ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని రాజశ్యామల పీఠంలో 4వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర దినంలో చేసిన పూజలు, జపాలు, దానాలు ఎన్నటికీ తగ్గని ఫలితాలను ఇస్తాయని విశ్వాసంతో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ సూక్త మహాపారాయణ మహాయజ్ఞం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఒకే రోజులో లక్షకు పైగా శ్రీ సూక్త పారాయణాలు జరగడం విశేషం. దీనివల్ల మహాలక్ష్మీ కటాక్షం, ఐశ్వర్యం, ధనసంపద కలుగుతాయని గురువులు వివరించారు. గోమయ దీపాలతో నిర్వహించిన శ్రీ లక్ష్మీ దీప మహాయజ్ఞం భక్తులలో భక్తి భావాన్ని మరింత పెంచింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తునికి శ్రీ యంత్రం లాకెట్, కుబేర కుంకుమ, లక్ష్మీ గవ్వలు ప్రసాదంగా అందజేశారు. అదేవిధంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ చేసి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు భక్తుల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని కోరుకుంటూ, భవిష్యత్తులో మరిన్ని ధ్యాన శిబిరాలు, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# ప్లాస్టిక్ నిషేధిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఓ సిటీలో ఏడవ విడత క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని ఓసిటీ కాలనీలో నిర్వహించిన "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమం ఏడవ విడతలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొని కాలనీవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల చరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు శుభ్రత పరిశుభ్రత, వైద్య ఆరోగ్యం, ఆరైవ్ ఆలైవ్ పూర్తి చేసుకోవడం జరిగిందని ప్రజా పాలన కార్యక్రమాలలో స్వచ్ఛత, పరిసరాల శుభ్రత ముఖ్య భాగమని తెలిపారు.ఓసిటీ కాలనీలో ఏడు విడతలుగా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ నిర్మూలన, పచ్చదనంపై అవగాహన కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా ఓ సిటీ గృహవాసులను, నిర్వాహకులను అభినందించారు. అరైవ్-అలైవ్ కార్యక్రమం లో భాగంగా రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పిల్లలను పాఠశాలకు పంపేటప్పుడు బస్సు డ్రైవర్ల లైసెన్స్, వారి ప్రవర్తన వంటి అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలని అన్నారు.బాలికల వివాహ వయస్సు, ఆరోగ్య పరిరక్షణపై కూడా అవగాహన కల్పించారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, టెర్రస్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు.ఈ సందర్భంగా పచ్చదనం, ప్లాస్టిక్ నిర్మూలనపై ఓసిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేసి,కాలనీవాసులకు బట్ట సంచులను పంపిణీ చేశారు. అసోసి యేషన్ అధ్యక్షుడు జోగు చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఏడు విడతలుగా సుమారు 1500 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను కాలనీలో సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేసినట్లు తెలిపారు. ఓసిటీని ఆదర్శ, ఆరోగ్యవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జోగు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బొబ్బల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి బజ్జూరి వేణుగోపాల్, ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మారెడ్డి, డిపిఆర్ఓ ప్రేమలత, శానిటరీ ఇన్స్పెక్టర్ భూమయ్య, మున్సిపల్ సిబ్బంది, కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరె కులంపై రీ సర్వే చేయాలి

- కుల జనాభాను తక్కువ చూపించడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆరె సంఘ నాయకులు




**వరంగల్ ఎంజీఎం, ఏప్రిల్ 19(జనంసాక్షి):** కుల సంక్షేమ సంఘం లోని జనాభాను రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ గా చూపించడం దుర్మాగమని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. హనుమకొండ బాలసముద్రం లోని ఆరె సంఘ భవన్ ట్రస్ట్ కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు,రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరె సంఘం నిర్వహించిన అంతర్గత సర్వే ప్రకారం, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలో ఆరె కుల జనాభా సుమారు 8 లక్షల వరకు ఉన్నారని,ప్రభుత్వం విడుదల చేసిన జన గణన లెక్కలలో కేవలం 1,10,631 గా చూపించడం అన్యాయమన్నారు. ఈ భారీ తేడా ఆరె కులానికి తీవ్ర నష్టం కలిగించే అంశమన్నారు. ఆరె కుల జనాభా పై రీ-సర్వే నిర్వహించి నిజమైన లెక్కలు వెల్లడించాలని,ఆరె కుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి కనీసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని,ఆరె కులాన్ని తక్షణమే కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. దీనికి రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా అమోదించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు నాగుర్ల శంకర్ రావు,వలిగే సాంబరావు,సంపత్ రావు,ఆనంద్ రావు, మారుజోడు నర్సింహా రావు,ఇంగ్లే శివాజీ, సుకినే సంతాజీ,లాండిగా లక్ష్మణ్ రావు, సుకినే రాజేశ్వర్ రావు,జగన్ మోహన్,మటిక సంతోష్, దూమల సుధాకర్, హింగే రాజేశ్వర్ రావు, బాపూరావు,వంచనగిరి వీరేశం,వలిగే నర్సింగ రావు,దీపక్ జీ, గుండెకారి రవి,సమ్మ రావు, మనోహర్, ప్రభాకర్, సుబ్బరావు, మలహాల్ రావు, ధర్మ రావు, రవీందర్,శంకర్ రావు పాల్గొన్నారు.

# మానవత్వంతో కూడిన వైద్యమే లక్ష్యం

- ఏపీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నర్సింహులు

**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్19 (జనంసాక్షి) :** సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా మానవత్వంతో కూడిన వైద్యాన్ని అందించడమే ప్రధాన ఉద్దేశం అని అసోసియేషన్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా(ఏపీఐ) జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ జీ. నరసింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ బ్యాంకెట్ హాల్లో ఆదివారం ఏపీఐ తెలంగాణ చాప్టర్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ దామెర రాములు ఆధ్వర్యంలో ఫిజీషియన్ల(ఎండీ జనరల్ మెడిసిన్ స్పెషలిస్టుల) రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నరసింహులు పాత్రికేయులతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటిసారిగా ఈ సభ నిర్మల్ లో నిర్వహించడం హర్షనీయమన్నారు. ఆన్ లైన్ పై ఆధారపడి, సొంత వైద్యం చేసుకోవడం ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించారు. వైద్య విద్యను అభ్యసించి, అనుభవంతో కూడిన చికిత్స అందించే వైద్యుల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజారావు, రాష్ట్ర బాధ్యులు ప్రొఫెసర్ నావల్ చంద్ర, ప్రొఫెసర్ చందర్, ప్రొఫెసర్ రమేష్, ప్రొఫెసర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

# సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

- పక్కాగా టోకెన్ విధానం అమలు కావాలి
- హన్మంతాపూర్,తరిగొప్పులలో కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ
- మౌలిక వసతులపై సూచనలు
- రైతులకు వేచి ఉండే సమయం తగ్గించాలి
- చిల్పూర్ కేజీబీవీ పాఠశాల సందర్శన - శుభ్రత, భోజనంపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 19(జనంసాక్షి): ఆదివారం, జిల్లాలోని నర్మెట్ట మండలంలోని హన్మంతాపూర్‌లో, అలాగే తరిగొప్పుల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేంద్రాల్లో రైతులకు అందిస్తోన్న మౌలిక వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. టోకెన్ విధానం అమలులో ఉందా? అనే అంశాన్ని పర్యవేక్షిస్తూ, నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. కేంద్రాల్లో తాడిపత్రిలు, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా?అని పరిశీలించారు. టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు. అలాగే రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులను ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, రికార్డులను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదనంతరం చిల్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలను కలెక్టర్ సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీరు, అగ్నిమాపక భద్రత సదుపాయాలు, అదే విధంగా వంట గదిని పరిశీలించి, ఆహార తయారీ విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అనే విషయం గురించి ఆరా తీశారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను కూడా పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి కల్పించాలని, భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సత్తెమ్మకు కేటీఆర్ ఘన నివాళులు..



**రాజమ్మ సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీ చెందిన ప్రముఖ ఉద్యమకారురాలు తెలంగాణ సత్తెమ్మ మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తు.ఆమె పార్థివ దేహముపై బిఆర్ఎస్ జెండా కప్పి నివాళులర్పించడమే కాకుండా కేటీఆర్ ఆమె పాడె మోసరు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో సత్తెమ్మ చురుకైన పాత్ర పోషించారు.ఉద్యమ సమయంలో ప్రతిరోజూ పాల్గొంటూ జై తెలంగాణ నినాదమే ఊపిరిగా ఆమె జీవించారు.స్వరాష్ట్ర సాధన కోసం సత్తెమ్మ చేసిన పోరాటం, ఆమె అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు.అంతక్రియల కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహ రావు,మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి,నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,నాయకులు,కార్యకర్తలు పాల్గొని సత్తెమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## రేపటి నుండే వీకే రామవరంలో జాతర



**ములకలపల్లి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మండలంలోని వికె రామవరం గ్రామంలో సమ్మక్క సారలమ్మ మహాలక్ష్మి తల్లుల జాతర మహోత్సవం ఈనెల 21, 22, 23 తేదీలలో నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వాహకులు తాటి రవి- సరోజిని పేర్కొన్నారు. 21వ తేదీ మంగళవారం నాడు మంగళతోరణం, బంధనము, గ్రామదేవలకు పూజలు, సమ్మక్క-సారక్క పడిగిద్ద రాజుల వేల్పుల మండ మెలుగుట కార్యక్రమాలు ఉంటాయని, బుధవారం 22 వ తేదీన మహాలక్ష్మీతల్లికి బోనాలు, జంపన్న వాగులో భక్తుల స్నానాలు, పుట్టబంగారముల తెచ్చుట, కొలబియ్యం కొలుచుట, అరివేను కుండలు తెచ్చుట, అదేవిదంగా 23 వ తేదీ గురువారం నాడు చిలకలగుట్ట నుండి కంకవనం తెచ్చుట, అమ్మవార్లను గద్దెపై నిలుపుట, భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుట, అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురువులు గుంజి భవాని, దేవరబాల తాటి ఈశ్వరమ్మ, గద్దెల పూజారి తాటి చింపిరయ్య, కమిటి మెంబర్స్ సోడె స్వారాజు-శాంతిప్రియ, ఊకే ఈశ్వరి-సింగరాజు(లేటు), మడకం సాయి- కీర్తన, సున్నం వెంకటేశ్వర్లు- నాగమణి పాల్గొంటున్నట్లు తెలిపారు.

## మోరీలలో పేరుకుపోయిన పూడిక మట్టిని వెంటనే తొలగించాలి



**గుండాల, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నూనెగూడెం గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెపురం రాజు డిమాండ్ చేశారు ఆదివారం వార్డు సభ్యులు,గ్రామ ప్రజలతో కలిసి పూడిక మట్టితో నిండిపోయిన మురుగు నీటి కాల్వలను పరిశీలించారు ఈసంధర్భంగా మద్దెపురం రాజు మాట్లాడుతూ మోరీలలో మురుగు నీటి నిల్వలు లేకుండా సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టాలని,దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామ సమావేశంలో గ్రామ పాలకవర్గం తీర్మాణాలు చేసినా కూడా వాటిని అమలు చేయడంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు చెరువు కాల్వ పరిసరాలు,బొడ్రాయి నుండి గ్రామ పంచాయతీ వరకు మోరీలు మురుగు నీటితో నిండిపోయి గుంతలుగా మారి దోమలకు స్థావరాలుగా మారాయని అన్నారు ఈగలు దోమలతో ప్రజలకు మలేరియా,డెంగ్యూ జ్వరాలు వచ్చి అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు పేరుకు పోయిన పూడిక మట్టిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు యండి అన్వర్,వార్డు సభ్యులు తూనం సతీష్,అండెం రాంరెడ్డి,మాజీ వార్డు సభ్యులు ఎల్లమ్మ, మల్లయ్య మధు పాల్గొన్నారు.

## కేసీఆర్ వస్తున్నారని కాంగ్రెస్‌కు వణుకు పుడుతోంది



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే గంగుల క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానుభావుడు కేసీఆర్ అని, ఆయన చరిత్రను ఎవరూ చెరపలేరని పేర్కొన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నికల హామీలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా కేవలం పూర్వ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే పరిమితమైందని తలసాని విమర్శించారు. కేసీఆర్ బయటకు రారని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు, ఆయన జగిత్యాల సభకు వస్తున్నారని తెలిసి భయపడుతున్నారని, అందుకే రైతుబంధు వంటి పథకాలపై ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో అమలైన రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, వృద్ధాప్య పింఛన్లు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పూర్వపు పథకాలను నిలిపివేసిందని ఆరోపించారు. రెండు సంవత్సరాల కాలంలోనే భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసిందని అన్నారు. రేపు జగిత్యాలలో జరిగే సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తలసాని పిలుపునిచ్చారు. ఈ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఐలేందర్ యాదవ్, గందె మహేశ్, మైనారిటీ నాయకులు మీర్ సౌఖత్ ఆలీ, నారదాసు వసంతరావు, గూడెల్లి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి అక్రమాలపై కరువైన రెవెన్యూ నిఘా..!

- ఆదివారం వస్తే చాలు.. అడ్డగోలు అక్రమ దందా..
- మంథనిలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా..
- ఇష్టారాజ్యాంగా ఎర్ర మట్టి తవ్వకాలు..
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తాం
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్



**మంథని, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** మట్టి మాఫియా దందా జోరుగా సాగుతుంది అనుమతులు లేకపోయినా, పరిమితికి మించి తవ్వకాలు జరుపుతూ, అక్రమంగా మట్టిని తరలిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు..!, మంథని లో మట్టి మాఫియా అక్రమ మట్టి తరలించడంలో ప్రతి ఆదివారం ఒక రూటు మార్చుతుంది గత వారం గాడుదల గండి సమీపంలో అడవిలోని ఎర్రమట్టిని అక్రమంగా తరలించిన మాఫియా ఈ ఆదివారం బిట్టుపల్లి,రచ్చపల్లి శివారులోని ఎర్ర మట్టిని తరలించడంలో తమ కొత్త వ్యూహాన్ని అనుసరించారు సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూముల నుండి సైతం ఎర్రమట్టిని అక్రమంగా తరలించడం జరిగింది గత రెండు వారాలుగా మంథనిలో అక్రమ మట్టి రవాణా కొనసాగుతున్న విషయం పలు పత్రికల ద్వారా రెవెన్యూ అధికారులకు చేరినప్పటికిని రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉండకపోవడం వలన అక్రమ మట్టి వ్యాపారస్తులు అదును చూసుకొని ఆదివారం వేళ మట్టిని అక్రమంగా తరలించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. మంథనిలోని పలు గ్రామాల్లో నూతన గృహ నిర్మాణాలకు, ప్రభుత్వ కార్యాలయాల పనులకు యదేచ్ఛగా అక్రమ మట్టిని తరలిస్తూ రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి ఒక్కో ట్రాక్టర్‌కు వెయ్యి నుండి పన్నెండు వందల వరకు తీసుకొని లక్షల గడిస్తున్నారు. అక్రమ మట్టి దందాకు ఎలాంటి అనుమతులు లేకుండానే గుత్తేదారులు అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినప్పటికీని అధికారులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఇప్పటికైనా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఉందనడంలో సందేహం లేదు. మండల తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ మట్టి దందా నడుస్తున్న అధికారులకు సమాచారం అందించినప్పటికీని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గానీ ఆర్డీవో కార్యాలయ సిబ్బంది గానీ స్పందించకపోవడం చాలా బాధాకరం. ఈ అక్రమ మట్టి రవాణాను సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోని అక్రమ మట్టి రవాణా చేస్తున్న మట్టి మాఫియా పై చర్యలు తీసుకోకుంటే రెవెన్యూ అధికారుల పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న వారి పై చర్యలు తీసుకొని అక్రమ మట్టి రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను జెసిబిలను వెంటనే సీజ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.

## తెలంగాణ గానకోకిల బెల్లి లలితకు విగ్రహం

- భువనగిరిలో ఉద్యమవేత్తల ఏకగ్రీవ తీర్మానం




**భువనగిరి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో తన గాత్రంతో ప్రజల్లో చైతన్యం నింపిన గానకోకిల అమరురాలు బెల్లి లలిత కు విగ్రహం ప్రతిష్ఠించేందుకు భువనగిరిలో నిర్వహించిన సన్నాహక సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్.వి హోటల్‌లో ఆదివారం జరిగిన ఈ సమావేశానికి బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాశ్ అధ్యక్షత వహించారు. తెలంగాణ ఉద్యమకారులు, లలితక్క కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లుగడిచినా, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన బెల్లి లలితక్కకు ఇప్పటికీ విగ్రహం ఏర్పాటు కాకపోవడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె త్యాగనిరతి, పోరాటస్ఫూర్తిని తరతరాలకు చాటేలా విగ్రహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం కృషి చేయాలని సమావేశం తీర్మానించింది. ఇందుకోసం విగ్రహ ఎంపిక కమిటీ, విగ్రహ స్థల ఎంపిక కమిటీ, వనరుల సమీకరణ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రధాన సమన్వయకర్తలుగా బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాశ్, జన్ని వెన్నెలను నియమించారు. అలాగే బెల్లి లలితక్క జీవితం, ఉద్యమ పోరాట చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి ప్రత్యేక పుస్తకాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. ఆమెతో ఉన్న అనుభవాలు, జ్ఞాపకాలు, పోరాట విశేషాలను ప్రజలు రచనల రూపంలో పంపించాలని కోరారు. సమావేశంలో భట్టు రామచంద్రయ్య, సామ మల్లారెడ్డి, తంగెళ్లపల్లి రవికుమార్, పూస శ్రీనివాస్, భువనగిరి శ్రీనివాస్ నేత, శ్రీనివాసాచార్యులు, దయ్యాల రామనర్సయ్య, ఏశాల అశోక్, పుట్ట వీరేష్ యాదవ్, ఎల్లముల జంగయ్య, పాశపాక మహేష్, ఆరు ముళ్ళ రమేష్, శ్రీరామ్ మురళీకృష్ణ, చిలుకల రమేష్, ఓదరి సతీష్, నక్కల చిరంజీవి యాదవ్, కైరం కొండ వెంకటేష్, భూక్య సంతోష్ నాయక్, పాక జహంగీర్, ర్యాకల రమేష్, రాసాల బాలస్వామి, రాసాల దయాకర్, రాసాల నరసింహ, జింకల శ్రీనివాస్ యాదవ్, మేకల బాలు, శ్రీరామ్ శరత్, ఎండి బాబు, రామ్ రాజ్, భరత్, ముక్కర్ల వెంకటేష్, శ్రీనివాస్, మహేష్, రఫీయుద్దీన్, మేకల ఆంజనేయులు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా వ్యక్తి మృతి

**కనగల్లు, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** మండలంలోని ధర్వేశిపురం వద్ద ఉన్న వేద ఏసీ ఫంక్షన్ హాల్‌లో వాచ్మెన్‌గా పనిచేస్తున్న కనగల్లు గ్రామ వాసి దొమ్మేటి సైదులు (60) ఆదివారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం దొమ్మేటి సైదులు కుటుంబంతో ఫంక్షన్ హాల్లో పనిచేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. గుర్రంపోడు మండలం జువ్వి గూడెం తండాకు చెందిన మెగావత్ గోపి నాయక్ ఇదే ఫంక్షన్ హాల్ లో సైదులుతో కలిసి వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. ఫంక్షన్ హాల్ లో జరిగే శుభకార్యాల సందర్భంగా మేక కాళ్లు, కాళీ ప్లాస్టిక్ నూనె డబ్బాలు, బొగ్గులు మిగిలిన చిన్న చిన్న వస్తువులను ఇద్దరు కలిసి అమ్ముకొని వచ్చిన సొమ్మును సమాన భాగాలుగా పంపకాలు చేసుకునేవారు. ఇదే క్రమంలో శనివారం వచ్చిన డబ్బులు నా భాగం నాకు ఇవ్వాలని గోపీనాయకుపై సైదులు ఒత్తిడి పెంచారు గోపి నాయక్ వచ్చిన సొమ్ము ఇవ్వకపోవడమే కాకుండా సైదులు పై గొడవకు దిగి కొట్టడంతో సైదులుకు బలమైన దెబ్బలు తగిలి స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు సైదులు కు ప్రాథమిక చికిత్స చేయించిన ఫలితం లేకపోవడంతో సైదులు మృతి చెందాడు. సైదులు మృతదేహంతో కుటుంబ సభ్యులు ఫంక్షన్ హాల్ వద్ద ధర్నాకు దిగడంతో సమాచార అందుకున్న పోలీసులు ఫంక్షన్ హాల్ వద్ద ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా బాధితులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడం, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామని పోలీసులు తెలిపారు.

## చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



**గోదావరిఖని, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** ఎంఎల్ఎ సూచనల మేరకు రామగుండం నగర పునర్నిర్మాణంలో భాగంగా చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తున్నదని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. 41 వ డివిజన్ ఎల్ బి నగర్ లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ మార్కాపురి సూర్య తో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా డివిజన్ లోని ప్రదాన మురుగునీటి కాలువతో పాటు ఇతర కాలువల్లో కూడా పూడిక తీయించి నీళ్ళు సాఫీగా ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. కాలువలో ప్రవహానికి ఆటంకం కలిగిస్తూ పెరిగిన పిచ్చి చెట్లను , కొమ్మలను తొలగించడంలో మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు కూడా పాలు పంచుకున్నారు.బ్లేడ్ మిషన్ సహాయంతో చెట్ల కొమ్మలను నరకడంలో సహకరించారు. కాలువలో చెత్త వేయకుండా మునిసిపల్ సిబ్బందికి ఇవ్వాలని స్థానికులకు తాను స్వయంగా చెప్పడంతో పాటు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించాలని మెప్మా ఆర్ పి లను మేయర్ ఆదేశించారు. చెత్త బయట పడవేసే వారికి జరిమానాతో పాటు మునిసిపల్ సేవలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి , ఎస్ ఇ గురువీర , ఇఇ పివి. రామన్ , డిఇఇలు జగదీష్ , అఫ్తాబ్ , ఎ ఇ మనోజ్ , టిపిఎస్ నవీన్ , టి పిబిఓ కళ్యాణ్ , ఎలెక్ట్రికల్ ఎఇ రాంజీ , సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 37 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తుంగతుర్తి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** 37 సంవత్సరాల తరువాత తమ స్నేహితులు చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు ఆనందంతో మురిసిపోయారు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడిగా గడిపారు, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ పాఠశాలలో 1988-89 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. అంతకుముందు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బింగి లక్ష్మయ్య, గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి లు జ్యోతి ప్రజ్వలన చేసే సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతి మాత చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నలమాస వెంకన్న, బింగి లక్ష్మయ్య, ఈగ శ్రీనివాస్, బింగి వెంకటేశ్వర్లు, కొడకండ్ల శ్రీదేవి, మల్లిపెద్ది శ్రీనివాస్ రెడ్డి, మల్లె ప్రసాద్,మధురాంరెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, యాదగిరి, రవిచంద్రారెడ్డి, కృష్ణయ్య , నరసయ్య,వాణి, సుధారాణి, సరోజ, అరుణ,బోజ్జమ్మ, జ్యోతి, హేమలత, సుకన్య, స్వరూప, నరసమ్మ, వినోద,రమేష్ , రామిని వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, లింగయ్య, ఇద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




**సూర్యాపేట, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉంటూ లక్ష్యం వైపు పయనించాలని జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 5కె రన్ నిర్వహించారు.జమ్మిగడ్డ నుండి ప్రారంభమైన ఈ 5కె రన్ జమ్మిగడ్డ, పొట్టి శ్రీరాములు సెంటర్, పూల సెంటర్, పోస్ట్ ఆఫీస్, పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వరకు, తిరిగి జమ్మిగడ్డ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం యువత మత్తుకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు.అతివేగం కన్నా ప్రాణం మిన్న అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శోభన్ బాబు,కార్యదర్శి ఏలుగూరి రామ్మూర్తి ,గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు,కోశాధికారి అంకతి వెంకన్న, సభ్యులు తోగరు రామయ్య,పల్లా సోమయ్య, పత్తిపాక రాధాకృష్ణ, నెట్టె కిరణ్ ,మామిడి వెంకటయ్య, మంకెన వీరారెడ్డి, జిడుగు సోమయ్య, శ్రీరామ్ వెంకట్, సలిగంటి నాగయ్య, అక్కినపల్లి రాము,సంత కుమార్, భుక్యా శ్రీనివాస్, సూదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి , బద్రి,మోరిశెట్టి శ్రీనివాస్ షేక్ ఖాదర్ ,రేపాల శ్రీనివాస్, మేరెడ్డి విజయ్, వెంకట్రామిరెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లు వెనుక భాజపా కుటిల రాజకీయం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** దేశాన్ని విభజించి పాలించాలనే దుర్బుద్ధితోనే భాజపా ఇటువంటి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం అర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజ శేఖర్, కార్పొరేటర్ లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసేలా డీలిమిటేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చారని, కేవలం ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకొని అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే వారి అసలు లక్ష్యమని ఆరోపించారు. భాజపా చేస్తున్న ఈ అన్యాయాన్ని తమ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలన్న బీజేపీ కుట్రలను ప్రజలు ముఖ్యంగా మహిళాలోకం గమనించాలని కోరారు. 12 సంవత్సరాలుగా పార్లమెంటులో ఏబిల్లు వీగిపోలేదని మహిళాబిల్లు విషయంలో కుట్ర జరిగిందని ఇప్పటికైనా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాలును స్వీకరించాలని సోమవారం మళ్లీ కేవలం మహిళా బిల్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. తగుల బెట్టాల్సింది ఇండియా కూటమి దిష్టి బొమ్మలు కాదని మహిళా బిల్లు పట్ల కుట్రలకు పాల్పడ్డందుకు బీజేపీ నాయకుల దిష్టి బొమ్మలనే తగల బెట్టాలని నరేందర్ రెడ్డి అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వైఖరిని ఎండగడుతూ, స్థానిక సమస్యలను గాలికొదిలేసి కేవలం ప్రచారానికే పరిమితమయ్యారని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరే విధంగా డిలిమిటేషన్ బిల్లు పెడితే దాన్ని మీరు సమర్థిస్తే భవిష్యత్ తరాలు మిమ్ములను క్షమించవన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి కేటీఆర్ అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతే చూస్తూ, ఊరుకోబోమని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చిటుక వేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు కేటీఆర్ అహంకారాన్ని రెండు నిముషాలలో దించుతారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజ శేఖర్, పిట్టల రవీందర్, కార్పొరేటర్లు మల్లిఖార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతాల జగన్ రెడ్డి, పర్వతం మల్లేశం, గుమ్మడి రాజ్ కుమార్, నాయకులు టేల భూమయ్య, ఇక్రమ్, దండి రవీందర్, పెద్దిగారి తిరుపతి, మాసుం ఖాన్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 92 మంది భారత భక్తులకు వీసా నిరాకరించిన పాకిస్థాన్




**ఇస్లామాబాద్ (జనంసాక్షి) :** పాకిస్థాన్ లోని పవిత్ర క్షేత్రాలను సందర్శించాలనుకున్న 92 మంది భారతీయులకు అక్కడి ప్రభుత్వం వీసాలు నిరాకరించింది. ఖల్సా సజ్నా దివస్ వేడుకల్లో భాగంగా గురుద్వారా పంజా సాహిబ్ ను దర్శించుకునేందుకు వీరు సిద్ధమవగా, ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఖల్సా వాక్స్ న్యూస్ పోర్టల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ 92 మంది భక్తుల పేర్ల చివర సింగ్ లేదా కౌర్ లేనప్పటికీ, వీరంతా పది మంది సిక్కు గురువులపై ప్రగాఢ విశ్వాసం ఉన్నవారని ఖల్సా వాక్స్ కథనంలో సుదీప్ సింగ్ పేర్కొన్నారు. మొదట ఏప్రిల్ 10 నుంచి 19 వరకు వీరికి వీసాలు మంజూరు చేసిన పాకిస్థాన్.. ఆ తర్వాత వాటిని రద్దు చేయడం భారతీయ కుటుంబాల మత విశ్వాసాలను దెబ్బతీసిందని సుదీప్ సింగ్ విమర్శించారు. హిందూ సమాజాన్ని గురుద్వారాల నుంచి దూరం చేసేందుకు పాకిస్థాన్ పన్నిన వ్యూహాత్మక చర్యగా ఇది కనిపిస్తోందని సుదీప్ సింగ్ ఆరోపించారు. హిందూ, సిక్కు కుటుంబాల మధ్య బంధాన్ని ఎవరూ విడదీయలేరని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు సిక్కులపట్ల సానుభూతి నటిస్తూనే, మరోవైపు ఐఎస్ఐ ద్వారా భారత్‌లోకి డ్రగ్స్, ఆయుధాలు పంపిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. ఈ వీసాల రద్దు అంశాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ విదేశీ వ్యవహారాల సలహాదారు పరమ్‌జిత్ సింగ్ చందోక్ తెలిపినట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విధానాల ద్వారా పాకిస్థాన్ ప్రభుత్వం గురుద్వారాలలోకి వీరి ప్రవేశాన్ని కూడా నిరోధించవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయని సుదీప్ సింగ్ అభిప్రాయపడ్డారు.

### హోర్ముజ్‌లో వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు..

## ఇప్పుడు కాల్పులు జరుపుతున్నారు

### ఇరాన్ నేవీతో భారత ట్యాంకర్ కెప్టెన్

**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధిని దాటేందుకు శనివారం ప్రయత్నించిన రెండు భారతీయ ట్యాంకర్లపై ఇరాన్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ సందర్భంగా ఒక భారతీయ ట్యాంకర్ కెప్టెన్ ఇరాన్ నేవీతో జరిపిన సంభాషణ ఆడియో క్లిప్ వెలుగులోకి వచ్చింది. 'హోర్ముజ్‌లో వెళ్లేందుకు మీరు అనుమతి ఇచ్చారు, ఇప్పుడు కాల్పులు జరుపుతున్నారు' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'సన్మార్ హెరాల్డ్' అనే ట్యాంకర్ కెప్టెన్ ఇరాన్ నేవీతో ఇలా మాట్లాడారు. 'సెపా నేవీ! సెపా నేవీ! ఇది 'సన్మార్ హెరాల్డ్' అనే మోటార్ ట్యాంకర్. వెళ్ళడానికి మీరు నాకు అనుమతి ఇచ్చారు. మీ జాబితాలో నా పేరు రెండవది. మీరు నాకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చారు. మీరు ఇప్పుడు కాల్పులు జరుపుతున్నారు. నన్ను వెనక్కి తిరగనివ్వండి' అని ఆయన అన్నారు. కాగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సిబ్బంది కాల్పులు జరుపడంతో భారత్‌కు చెందిన ఆ రెండు ట్యాంకర్లు శనివారం తమ మార్గాన్ని మార్చుకున్నాయి. ఇందులో ఒకటైన సూపర్ ట్యాంకర్ సుమారు 20 లక్షల బ్యారెళ్ల ఇరాకీ చమురును తీసుకువెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు నౌకలను పశ్చిమం వైపు మళ్లిస్తున్న సమయంలో ఐఆర్జీసీ గన్‌బోట్లు కాల్పులు జరిపినట్లు ఆడియో ఇంటర్‌సెప్ట్‌లు సూచించాయి. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



మరోవైపు హోర్ముజ్ జలసంధిలోని వాణిజ్య నౌకలకు ఐఆర్జీసీ శనివారం హెచ్చరిక జారీ చేసింది. 'ఓడలన్నిటికీ గమనిక, చర్చలలో అమెరికా ప్రభుత్వం తన నిబద్ధతను నెరవేర్చడంలో విఫలమైనందున, హోర్ముజ్ జలసంధిని మరోసారి పూర్తిగా మూసివేస్తున్నాం. ఏ రకమైన లేదా ఏ దేశానికి చెందిన ఓడ కూడా హోర్ముజ్ జలసంధి గుండా వెళ్ళడానికి అనుమతించబోం' అని ఇరాన్ పేర్కొంది.

## సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి

### లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాదు




**హైదరాబాద్, ఏప్రిల్ 19 :** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాదు తెలిపారు. రాజేంద్రనగర్ దగ్గర ఆరామ్‌ఘర్‌లో ఉన్న బికనేర్‌వాలా బొటిక్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఘు ఉద్యోగ భారతి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. 28 రాష్ట్రాల్లో 75 వేల మందికి పైగా సభ్యులతో దేశంలోనే అతిపెద్ద సంఘంగా నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సన్నిహితంగా పని చేస్తూ ఎంఎస్ఎంఈ విధానాల రూపకల్పన, అమలులో విలువైన సూచనలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు కూడా మా సూచనలను కోరుకుంటున్నాయన్నారు. తెలంగాణ శాఖ దేశంలోనే అత్యంత చురుకైన శాఖలలో ఒకటిగా ఉందన్నారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా సభ్యులు పరస్పరం కలిసేలా, వ్యాపార అవకాశాలు పెంపొందించుకునేలా లఘు ఉద్యోగ భారతి ఒక బలమైన డిజిటల్ వేదికను అందిస్తుందని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళున్నామన్నారు. విద్యా సంస్థలు, ఐఐటీలు, పరిశోధన, మేనేజ్‌మెంట్ సంస్థల భాగస్వామ్యంతో సభ్యులు సామర్థ్యాన్ని పెంచుకుంటున్నారని తెలిపారు. సీఎస్ఐఆర్ తో నిర్వహించిన '100 రోజులు – 100 టెక్నాలజీలు' కార్యక్రమం ద్వారా సభ్యులు వినూత్న సాంకేతిక పరిష్కారాలతో లాభపడుతున్నారని తెలిపారు. తెలంగాణకు చెందిన ఇద్దరు సభ్యులు ఈ సాంకేతికతతో ప్రయోజనం పొందారన్నారు. అదనంగా 100కు పైగా ఐటీఐలతో భాగస్వామ్యం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపుదిద్దుతున్నామన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసి, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణలో 13 జిల్లాల్లో విస్తరణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఎంఎస్ఎంఈల వాణిని మరింత బలంగా వినిపించడమే లక్ష్యమన్నారు. పరిశ్రమల సమస్యలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామన్నారు. మా కృషితో ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన లభిస్తుందన్నారు. విధానాలు, జీఓలకు సంబంధించిన ముఖ్య సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. నైపుణ్య లోటును అధిగమించేందుకు ఐటీఐ ప్రిన్సిపాళ్లతో చర్చలు ప్రారంభించామన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో మార్పులకు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో కుదిరిన ఎంఓయూ ద్వారా ఇప్పటికే సుమారు 200 మంది విద్యార్థులకు ఉపాధి కల్పించగలిగామన్నారు. ఇన్నోవేషన్, పరిశ్రమల మధ్య గ్యాప్‌ను తగ్గించేందుకు, ఐఐసీటీ వద్ద ఉన్న 2,600కు పైగా సిద్ధంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే నరేంద్రనాథ్ దత్ మాట్లాడుతూ లఘు ఉద్యోగ భారతి ఎంఎస్ఎంఈల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. తెలంగాణలో 600 మంది సభ్యులు ఉన్నారన్నారు. మా నినాదం 'మేడ్ ఇన్ ఇండియా – మేడ్ ఫర్ ది వరల్డ్' అన్నారు. ఈ సమావేశంలో లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంయుక్త ప్రధాన కార్యదర్శి మోహన్ సుందరం, అఖిల భారత ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బీ అనిల్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి ఓం అనుజ్ ఖేరండేవాల్ పాల్గొన్నారు. లఘు ఉద్యోగ భారతి ఒక జాతీయ స్థాయి సంస్థ. దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి, బలోపేతం కోసం పని చేస్తుంది. ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని సాధించడం, ఉపాధి అవకాశాలు పెంచే పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా ముందుకు సాగుతుంది. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న చిన్న, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి, స్థిరత్వాన్ని ప్రోత్సహించడం ధ్యేయంగా ఉంది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. యువత, నిపుణులను ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగ సృష్టికర్తలుగా మారేందుకు ప్రేరేపిస్తుంది. ఎంఎస్ఎంఈల సమస్యలను ప్రభుత్వానికి వినిపిస్తుంది. పరిశ్రమలకు అనుకూలమైన విధానాల రూపకల్పనకు సహకరిస్తుంది. చిన్న పరిశ్రమల్లో ఆధునికీకరణ, ఆవిష్కరణలు, కొత్త సాంకేతికతలను స్వీకరించేందుకు ప్రోత్సహిస్తుంది. ఎంఎస్ఎంఈల మధ్య పరస్పర అనుసంధానం, సహకారం పెంపొందించే బలమైన వేదికను సృష్టిస్తుంది. సెమినార్లు, వర్క్‌షాప్‌లు, వ్యాపార సమావేశాలు నిర్వహిస్తూ.. జ్ఞానం, వ్యాపార అవకాశాలను పంచుకుంటుంది. వ్యవసాయ పారిశ్రామిక, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మీద శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఎంఎస్ఎంఈల సంక్షేమం కోసం ప్రభుత్వ విభాగాలతో చర్చలు జరుపుతుంది. సూచనలు ఇస్తుంది. ఉత్పాదకత, పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు పరిశ్రమ క్లస్టర్ల అభివృద్ధికి మద్దతు ఇస్తుంది.

## లగేజ్‌లో శాటిలైట్ ఫోన్లు..

### అదుపులోకి ఇద్దరు అమెరికా జాతీయులు




**శ్రీనగర్ :** విమాన ప్రయాణికుల లగేజ్‌లో శాటిలైట్ ఫోన్లను భద్రతా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వాటిని కలిగి ఉన్న ఇద్దరు అమెరికా జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు కోసం వారిని పోలీసులకు అప్పగించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం శ్రీనగర్ విమానాశ్రయంలో ప్రయాణికుల లగేజ్‌ను భద్రతా అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమెరికా పౌరులైన ఇద్దరి సామానులో నిషేధిత వస్తువైన శాటిలైట్ ఫోన్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ కోసం పోలీసులకు అప్పగించారు. కాగా, అదుపులోకి తీసుకున్న వారిలో ఒకరిని మోంటానాకు చెందిన జెఫ్రీ స్కాట్‌గా గుర్తించారు. గార్మిన్ కంపెనీకి చెందిన శాటిలైట్ ఫోన్‌ను అతడి లగేజ్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా అధికారులు తెలిపారు. మరోవైపు ముందస్తు అనుమతి లేకుండా శాటిలైట్ ఫోన్‌ల వినియోగాన్ని దేశంలో నిషేధించారు. వీటిని అనధికారికంగా కలిగి ఉంటే భారత టెలిగ్రాఫ్ చట్టం, ఇతర భద్రతా నిబంధనల ప్రకారం నిర్బంధం, అరెస్ట్‌కు దారితీస్తుంది. గతంలో కూడా శాటిలైట్ ఫోన్లు కలిగిన విదేశీయులతో పాటు దేశీయులపై అధికారులు చర్యలు చేపట్టారు.



## రూ.12,980 కోట్లతో 'భారత్ మెరైన్ ఇన్సూరెన్స్ పూల్' ప్రారంభం

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో పెరుగుతున్న అనిశ్చితుల దృష్ట్యా భారత ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దేశీయ సముద్ర వాణిజ్యానికి విఘాతం కలగకుండా చూసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రూ.12,980 కోట్ల భారీ సార్వభౌమ గ్యారెంటీతో భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్‌కు ఈ బీమా అత్యంత కీలకంగా మారనుంది. ప్రస్తుతం పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ నౌకాయన మార్గాల్లో ఇన్సూరెన్స్ ప్రీమియంలో భారీగా పెరిగాయి. యుద్ధం, ఆంక్షల వంటి సమయాల్లో విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలు సేవలను నిలిపివేసినట్లయితే భారతీయ ఎగుమతులు, దిగుమతులు స్తంభించిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు, విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఈ బీమా పూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ భారత్ మెరైన్ బీమా పూల్ కోసం రూ.12,980 కోట్ల సావెరిన్ గ్యారెంటీని ప్రకటించింది. ఈ బీమా పూల్ ద్వారా దాదాపు రూ.950 కోట్ల అండర్ రైటింగ్ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం తెలిపింది. అంటే నష్టాలను భరించేందుకు సభ్యత్వ బీమా కంపెనీలు ఈ మొత్తాన్ని ఉమ్మడిగా వినియోగించనున్నాయి. ఈ పథకం ప్రాథమికంగా 10 ఏళ్ల పాటు అమలులో ఉండనుంది. అవసరాన్ని బట్టి మోర 5 సంవత్సరాలు పొడిగించే అవకాశాలు ఉన్నాయి. భారతీయ జెండా ఉన్న నౌకలు, భారత నియంత్రణలో ఉన్న నౌకలు, భారత దేశం నుంచి బయలుదేరే లేదా భారతదేశానికి సరుకును తీసుకెళ్లే ఇతర అంతర్జాతీయ నౌకలకు ఈ పథకం వర్తిస్తుంది.

## మళ్లీ తెరపైకి రద్దయిన నోట్ల మార్పిడి

**ముంబై :** రద్దయిన పాత కరెన్సీ రూ. 500, రూ. 1000 నోట్లను మళ్లీ మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది అంటు కొన్ని వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దాదాపు పది సంవత్సరాల తర్వాత ఈ నోట్లను మళ్లీ మార్చుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు వాటిల్లో పేర్కొన్నారు. ఇందుకు ఇప్పుడు అవకాశం వచ్చిందని, ఈ పాత నోట్లు ఉన్న వారు మార్చుకోవచ్చు అన్నట్లు ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ అంశంపై సోషల్ మీడియాల్లో సర్క్యులేట్ అవుతున్న వార్తలు తప్పని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ఆర్‌బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఎలాటి మార్గదర్శకాలు, రూల్స్ జారీ చేయాలని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది.

## రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దేశంలో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వెలువరించింది. రాజస్థాన్ లోని ఫలోడీ, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదాలను సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం విచారణ జరిపింది. రహదారులపై అక్రమ పార్కింగ్‌లు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కును ఇచ్చిందని గుర్తుచేసింది. ఈ అధికరణంలోనే ప్రతి ప్రయాణికుడికి ప్రమాదరహితంగా వెళ్లే హక్కు అంతర్గతంగా ఉందని తెలిపింది. ప్రయాణికుల భద్రతను ప్రభుత్వ బాధ్యతగా చూడాలని తెలిపింది. అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానంలో భాగంగా ఎప్పటికప్పుడు రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, రైట్ ఆఫ్ వే (రహదారింమార్జిన్) లలో నూతన దాబా, హోటల్, వాణిజ్య నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు సూచించింది. జాతీయ రహదారుల వెంబడి నిర్మించిన అక్రమ నిర్మాణాలను 60 రోజుల్లోగా తొలగించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. జాతీయ రహదారులు వెళ్తున్న జిల్లాల్లో.. 15 రోజుల్లోగా జిల్లా రహదారుల భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో సూచించింది. రాష్ట్ర పోలీసు, రవాణాశాఖకు చెందిన అధికారులు నిరంతరం రహదారులను పర్యవేక్షించాలని, వాహనాలకు ట్రాకింగ్ పరికరాలను అమర్చాలని సూచన చేసింది. ప్రతి 75 కిలోమీటర్లకు వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని, వీటిలో విశ్రాంతి గదులు, హోటల్స్, తదితర సౌకర్యాలను కల్పించాలని సూచించింది. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని అక్కడ రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులను ఉంచాలని పేర్కొన్నది. రెండు నెలల అనంతరం అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది.

## జర్నలిస్టుపై ట్రంప్ రుసరుస



**వాషింగ్టన్ (జనంసాక్షి) :** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగా ప్రపంచ దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఆయిల్, గ్యాస్ కొరతతో అల్లాడిపోతున్నాయి. శుక్రవారం హర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ తెరుచుకోవటంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. అయితే హోర్ముజ్ దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించటంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. హర్ముజ్ జలసంధి గుండా వెళున్న రెండు భారత వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీకి చెందిన ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయి. నౌకలపై భారత జెండాలు ఉన్నప్పటికీ ఈ దాడి జరిగింది. ఈ దాడిలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కాల్పుల నేపథ్యంలో రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకొస్తున్న ఆ రెండు నౌకలు హోర్ముజ్ జలసంధి నుంచి వెనక్కి మళ్లినట్టు సమాచారం. ఈ దాడిపై ప్రశ్న వేసిన ఓ జర్నలిస్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ శనివారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఓ జర్నలిస్ట్.. 'హోర్ముజ్ జలసంధిలో భారత జెండా కలిగిన నౌకలపై కాల్పులు జరిగాయి. దీని గురించి ఏమంటారు..?' అని ప్రశ్నించారు. దాంతో ట్రంప్ కోపం పట్టలేకపోయారు. దురుసుగా 'అవుట్' అన్నారు. అందుకు సంబంధించిన వీడియోను శశాంక్ మట్టు అనే వ్యక్తి ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో ట్రంప్ ప్రవర్తనపై నెటిజన్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా భారతీయులు ట్రంప్ తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. ట్రంప్ కారణంగానే ప్రపంచ దేశాలకు ఆయిల్, గ్యాస్ కష్టాలు వచ్చాయని మండిపడుతున్నారు.

## దేశంలో 13-శాతం తగ్గిన ఎల్‌పీజీ వినియోగం

- పెరిగిన డీజిల్, పెట్రోల్ అమ్మకాలు
- భారత్‌లో మార్చిలో భారీగా తగ్గిన వంట గ్యాస్ వినియోగం
- మార్చిలో 13 శాతం తగ్గిన ఎల్‌పీజీ వాడకం
- పెట్రోల్, డీజిల్‌కు ఫుల్ డిమాండ్

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌లో వంట గ్యాస్ వినియోగంపై పడింది. గృహ వంట గ్యాస్, వాణిజ్య వినియోగదారులకు ఎల్‌పీజీ సరఫరాను తగ్గించడంతో దేశంలో ఎల్‌పీజీ వినియోగం ఏకంగా 13 శాతం పడిపోయింది. 2026 మార్చిలో దేశంలో ఎల్‌పీజీ వినియోగం 2.379 మిలియన్ టన్నులుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంలో (2025 మార్చి) వినియోగించిన ఎల్‌పీజీ 2.729 మిలియన్ టన్నులు. దీంతో గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది ఎల్‌పీజీ వినియోగం 12.8 శాతం మేర తగ్గింది. మరోవైపు, దేశంలో చమురు కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలో పెట్రోల్, డీజిల్‌కు డిమాండ్ భారీగా పెరిగింది.

భారత్ తన ఎల్‌పీజీ అవసరాలలో సుమారు 60 శాతాన్ని దిగుమతి చేసుకుంటోంది. ఈ దిగుమతులు అధిక భాగం హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ కలిసి సంయుక్తంగా దాడులు చేయడం, దానికి టెహ్రాన్ ప్రతీకార చర్యల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూతపడింది. దీంతో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి భారత్‌కు వచ్చే ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో గృహ వంట గ్యాస్ వినియోగదారులకు ఎల్‌పీజీ సరఫరాను కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, పరిశ్రమలు వంటి వాణిజ్య సంస్థలకు ఎల్‌పీజీ సరఫరాను తగ్గించింది.

చమురు మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్రణాళిక అండ్ విశ్లేషణ విభాగం (ప్రాజా) ప్రకారం, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల అమ్మకాలు మార్చిలో 8.1 శాతం తగ్గి 2.219 మిలియన్ టన్నులకు పడిపోయాయి. గృహేతర వినియోగదారులకు ఎల్‌పీజీ అమ్మకాలు దాదాపు 48 శాతం తగ్గాయి. బల్క్ ఎల్‌పీజీ అమ్మకాలు ఏకంగా 75.5 శాతం తగ్గాయి. దేశంలో ఎల్‌పీజీ సరఫరాలు సాధారణంగా ఉన్నాయని, గృహ వినియోగదారుల డిమాండ్ మొత్తం తీరిందని ప్రభుత్వం చేస్తున్న వాదనలతో పోలిస్తే, పీపీఏసీ డేటా తక్కువ ఎల్‌పీజీ వినియోగాన్ని చూపించింది. ఈ కొరతను భర్తీ చేసి, ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోకెమికల్ ఉత్పత్తి నుంచి ఫీడ్‌స్టాక్‌ను మళ్లించాలని రిఫైనరీలను ఆదేశించింది. తద్వారా దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తి 1.1 మిలియన్ టన్నుల నుంచి 1.4 మిలియన్ టన్నులకు పెరిగింది. మొత్తం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఎల్‌పీజీ ఉత్పత్తి 13.1 మిలియన్ టన్నులకు చేరుకుంది. అదే సమయంలో మొత్తం సంవత్సరానికి ఎల్‌పీజీ వినియోగం 6 శాతం పెరిగి 33.212 మిలియన్ టన్నులకు చేరుకుంది.



**పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ ఏటీఎఫ్ అమ్మకాలు 2 శాతం పెరిగి 9.161 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. పెట్రోల్ వినియోగం 6.5 శాతం పెరిగి 42.586 మిలియన్ టన్నులకు చేరింది. డీజిల్ వినియోగం 3.6 శాతం పెరిగి 94.705 మిలియన్ టన్నులకు చేరుకుంది.**


### కాస్త పెరిగిన ఏటీఎఫ్ అమ్మకాలు

కట్టెలు, ఇతర కాలుష్యకారకాల స్థానంలో స్వచ్ఛమైన ప్రత్యామ్నాయాలను వాడాలనే ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహించింది. దీంతో ఇటీవలి సంవత్సరాలలో ఎల్‌పీజీ వినియోగం స్థిరమైన వేగంతో వృద్ధి చెందింది. యుద్ధం కారణంగా అనేక గల్ఫ్ దేశాలలో గగనతలం మూసివేయడం, విమాన సర్వీసులు నిలిచిపోవడంతో జెట్ ఇంధనం (ఏటీఎఫ్) వినియోగం మార్చి నెలలో దాదాపు స్థిరమైన వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. గతేడాది ఇదే నెలలో 8,01,000 టన్నుల అమ్మకాలు జరగగా, ఈసారి అది 8,07,000 టన్నులకు చేరింది. యుద్ధ ప్రభావానికి లోనైన ఆ రెండు ఇంధనాలు మినహా పెట్రోల్, డీజిల్ అమ్మకాలలో గణనీయమైన వృద్ధి కనిపించింది. మార్చి నెలలో పెట్రోల్ అమ్మకాలు 7.6 శాతం పెరిగి 3.78 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. డీజిల్ వినియోగం 8.1 శాతం పెరిగి 8.727 మిలియన్ టన్నులకు చేరింది.

పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ ఏటీఎఫ్ అమ్మకాలు 2 శాతం పెరిగి 9.161 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. పెట్రోల్ వినియోగం 6.5 శాతం పెరిగి 42.586 మిలియన్ టన్నులకు చేరింది. డీజిల్ వినియోగం 3.6 శాతం పెరిగి 94.705 మిలియన్ టన్నులకు చేరుకుంది. పారిశ్రామిక ఇంధనాలైన నాఫ్తా, ఫ్యూయల్ ఆయిల్ వినియోగం వరుసగా 9.9 శాతం, 1.4 శాతం క్షీణతను నమోదు చేసింది. రహదారుల నిర్మాణంలో ఉపయోగించే బిటుమెన్ వినియోగం 2025–26లో 3 శాతం పెరిగి 8.84 మిలియన్ టన్నులకు చేరింది.



# తునకలవుతున్న 'తనఖా' ప్లాట్లు



## రియల్ ఎస్టేట్ పేరుతో కస్టమర్లకు కుచ్చుటోపి

- గ్రామ పంచాయతీకి కేటాయించిన స్థలాలు సైతం అమ్మేశారు
- బట్టబయలైన కొందుర్గు త్రిశక్తి వెంచర్ బాగోతం
- అధికారుల అండతోనే నిలువునా మోసం

**రంగారెడ్డి/కొందుర్గు (జనంసాక్షి) :** రియల్ ఎస్టేట్ రంగంలో భూములకు రేట్లు పెరిగే కొద్దీ వ్యాపారస్తులకు స్వార్థం పెరిగిపోతుంది. తమ వ్యాపారం కోసం ప్రజలనే కాకుండా ప్రభుత్వాలను కూడా బురిడీ కొట్టించే పని చేస్తున్నారు కొంతమంది కేటుగాళ్లు డిటిసిపి లేఅవుట్ల పేరుతో వెంచర్లు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లను విక్రయిస్తున్నారు. ఓవైపు డీటీసీపీ అప్రూవల్ మరోవైపు రేరా అప్రూవల్ ఉన్న వెంచర్‌లో 15 శాతం స్థలాన్ని గ్రామపంచాయతీ పేరున మార్ట్‌గేజ్ (తనఖా) చేయాల్సి ఉంటుంది.

మార్ట్‌గేజ్ (తనఖా) చేసిన అనంతరం వెంచర్ మొత్తంలో 10శాతం గ్రామ పంచాయతీకి అప్పగించాలి 15% (తనఖా) చేసిన తర్వాత వెంచర్ మొత్తంలో అభివృద్ధి పనులు సిసి రోడ్లు, ఎలక్ట్రిసిటీ కలెక్షన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, తాగునీరు, పార్కుల వంటి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. అలా చెయ్యని యెడల గ్రామ పంచాయతీ వాటిని అమ్మేసి డెవలప్‌మెంట్ చేసేందుకు అనుకూలంగా ఉంటుం ది. ఒకవేళ డీటీసీపీ అప్రూవల్ రెండేళ్ల కాలం దాటితే రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. రెండేళ్ల తర్వాత కూడా రెన్యువల్ చేసుకోని ఎడల పంచాయతీ అధికారులు నోటీసులు జారీచేయాలి. అయినా అదేమీ జరగలేదు. అభివృద్ధి పనులు పూర్తి చేసిన తర్వాత గ్రామపంచాయతీ క్లియరెన్స్ పొంది (తనఖా) చేసిన 15శాతం ప్లాట్లను రిలీజ్ చేసుకున్న తర్వాత విక్రయించుకోవాలి. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో వెలసిన త్రిశక్తి డిటిసిపి లేఅవుట్ వెంచర్ యజమాన్యం మాత్రం దీనికి విరుద్ధంగా వ్యవహరించింది. ఓవైపు కస్టమర్లను మరోవైపు అధికారులను మోసం చేస్తూ అక్రమంగా గ్రామ పంచాయతీకి కేటాయించాల్సిన ప్లాట్లను కేటాయించకుండా సుమారు 10 ప్లాట్లను కస్టమర్లను మోసం చేసి విక్రయించారు. టీఎల్‌పీ నెం.336/2021/హెచ్‌లో గ్రామ పంచాయతీకి తనాఖా చేస్తున్నట్లు చూపించిన ప్లాట్ నెంబర్లు 95 నుండి 125 మొత్తం విస్తీర్ణం 6.596.92 గజాలు తనఖా పెట్టినట్లు చూపిస్తున్నారు. కానీ వాటిలో 40శాతం స్థలాన్ని గుట్టుచప్పుడు కాకుండా అమ్మి సొమ్ము చేసుకుంది.

### అధికారుల నిర్లక్ష్యంతోనే..

ఒక వెంచర్ నిర్మించాలంటే లేఅవుట్ ఏరియాను బట్టి 10శాతం గ్రామ పంచాయతీకి కేటాయించాలి. మరో 15% గ్రామ పంచాయతీకి (తనఖా) చేయాలి. ఇక్కడ బాగా గమనిస్తే డిటిసిపి టీఎల్‌పీ నెం.336/2021/హెచ్ నవంబర్-23-2021 సంవత్సరం అప్రూవల్ వచ్చింది. వెంచర్ మొత్తంలో 196 ప్లాట్లు ఉండగా అందులో 30 మార్గేజ్ మార్గేజ్ చేస్తున్నామని అప్లికేషన్‌లో పేర్కొన్నారు. అందులో 95 నుండి 125 నంబర్ వరకు ప్లాట్లను గ్రామ పంచాయతీకి మార్కెట్ చేసినట్టు త్రిశక్తి వెంచర్ నిర్వాహకులు కస్టమర్లకు అధికారులకు చూపించారు.


### ఇక్కడే అసలు కథ మొదలైంది

కొందుర్గు ఈస్ట్‌లోని సర్వే నెంబర్లు 10పి13పిలో నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీకి తనఖా చేయాల్సిన ప్లాట్లను పంచాయ తీకి అప్పగించకుండా కస్టమర్లను మోసం చేస్తూ పంచాయతీ కార్యదర్శి క్లియరెన్స్ లేకుండా జిపికి తనఖా చెయ్యాల్సిన ప్లాట్లను అమ్మేశారు. మొత్తం 6596.92 గజల్లో 2065 గజలు సుమారు 40శాతం అమ్మేసి కోట్ల రూపాయలు దండుకున్నారు. అభివృద్ధి చేయకుండా తనఖా ప్లాట్లను అమ్ముకుని చేతులు దులుపుకునే ప్రయత్నం త్రిశక్తి హోం కన్నల్టెనీ యాజమాన్యం చేస్తుంది. ఇలా చేస్తే గ్రామపంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలెదనే విషయం ప్రశ్నగా మారింది.


### కస్టమర్లు లబోదిబో

వెంచర్ యజమాన్యం ఇష్టానుసారంగా ప్లాట్లు అమ్మటం అభివృద్ధి చేయకుండా మమ్మల్ని మోసం చేశారని వాపోతున్నారు. గ్రామ పంచాయతీకి కేటాయించిన ప్లాట్లను అధికారుల క్లియరెన్స్ లేకుండానే అమ్మటం వివాదానికి దారి తీస్తుంది. ఇంత తతంగం జరిగిన పంచాయతీశాఖ అధికారులు తిరిగి చూడకుండా డిటిసిపి అప్రూవల్ ఎలా ఇస్తారని మండిపడుతున్నారు. మరోవైపు లక్షలు పోగేసి ప్లాట్లు కొంటే అధికారులతో కుమ్మక్కై కంపెనీ యాజమాన్యం అభివృద్ధి చేయకుండానే చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కస్టమర్లు డిమాండ్ చేస్తున్నారు.









### షాద్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భారీ అక్రమాలు

రియల్ ఎస్టేట్ నిబంధనలను తుంగలో తొక్కి, వెంచర్ యాజమాన్యం తో చేతులు కలిపిన షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అక్రమాలకు తెరలేపారు. డీటీసీపీ నిబంధనల ప్రకారం గ్రామ పంచా యతీకి తనఖా పెట్టిన ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, కొనుగోలుదారులను మోసగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డీటీసీపీ నిబంధనల ప్రకారం, ఏదైనా వెంచర్‌లో 15 శాతం ప్లాట్లను గ్రామ పంచాయతీ పేరిట తనఖా ఉంచాలి. సదరు వెంచర్‌లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసిన తర్వాతే గ్రామ పంచాయతీ నుండి క్లియరెన్స్ వస్తుంది. ఆ తర్వాతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ తనఖా ప్లాట్లను విడుదల చేసి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండల కేంద్రంలో త్రిశక్తి వెంచర్‌లో అభివృద్ధి పనులు పూర్తి కాకముందే, గ్రామ పంచాయతీ నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే సుమారు పది ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి నిబంధనలు పాటించకుండా రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా వ్యవస్థను తప్పుదోవ పట్టించడం. ఇప్పటికే ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో, విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోనూ షాద్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయి.



## సిరికొండ మండలంలో వడగండ్ల వాన పంటలు నష్టం

### కంట తడి పెట్టిన రైతన్న

**సిరికొండ ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** సిరికొండ మండలం కేంద్రంలో న్యావనంది రావుట్ల నారాయణపల్లి చిన్నవాల్గొట్ గ్రామాలలో మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన వడగండ్ల వానకు సుమారు వందల ఎకరాల వరకు వడ్లు నెలరాలాయి ఉండొచని ప్రాధమిక అంచనా. అక్కడకడ అరబోసిన వడ్లు కుడా తడిసిపోయాయి.ప్రభుత్వం సమయానికి కొనుగోలు కేంద్రాలు తెరవక కొన్ని చోట్ల మొక్కుబడిగా కొబ్బరికాయ కొట్టి తెరిచిన లేబర్ కొరత గొనె సంచులు సమయానికి రాక వడ్లు ఎక్కడివి అక్కడే కొనుగోలు కేంద్రాల్లో రాసులుగా ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం భగవంతుడి శాపం అన్ని విధాలుగా రైతుకి నష్టాన్ని చేకూర్చాయి. ఈ రోజు కురిసిన వర్షానికి మండలంలో అన్ని గ్రామాలలో నష్టం వాటిల్లింది. ఇకనైన అధికారులు కళ్ళు తెరిచి తడిచిన వరి ధాన్యాన్ని ఎటువంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

**-కేంద్ర మంత్రి బండి సంజయ్.**



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19, (జనం సాక్షి):** న్యాయవాదులకు ఎలాంటి అవసరం ఉన్నా తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ ల ఆధ్వర్యంలో అసోసియేషన్ నూతన కార్య వర్గం ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ నీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఆలయ అర్చకులు గౌరవ సత్కారం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలను బండి సంజయ్ దృష్టికి తీసుకొని వెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి, ఏజిపి చామనపల్లి రమేష్‌లతో పాటు అసోసి యేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు బాస సత్యనారాయణ, కుసుంబ కృష్ణారావ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

### ఘనంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం భీమిరెడ్డి శోభ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం



**సూర్యాపేట (జనంసాక్షి):** 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పని చేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోటపహాడ్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం భీమిరెడ్డి శోభ సేవలు అభినందనీయమని ఆత్మకూర్ (ఎస్) ఎంఈఓ ధారాసింగ్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని హోటల్ శ్రీ గ్రాండ్ లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం భీమిరెడ్డి శోభ సుధాకర్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు హాజరైన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు.ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం భీమిరెడ్డి శోభ ఉద్యోగ నిర్వహణలో భాగంగా వివిధ మండలాలలో పని చేసి విద్యార్థుల, గ్రామస్తుల, అధికారుల మన్ననలు పొందారని తెలిపారు.ఉన్నత విద్య ప్రమాణాలతో ఎక్కడ పని చేసిన ఆ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల్లో జ్ఞానాభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు.

తన విధుల పట్ల అంకితభావంతో పని చేసిన ఆమె సేవలు ఆదర్శనీయం అన్నారు.పదవీ విరమణ పొందిన తర్వాత శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు భీమిరెడ్డి శోభ సుధాకర్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చివ్వెంల ఎంఈఓ కళారాణి, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రవణ్ కుమార్,ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల జిల్లా అధ్యక్షులు వివి నాయక్, పిఆర్టియు టీఎస్ జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పబ్బతి వెంకటేశ్వర్లు, టీపియుఎస్ జిల్లా అధ్యక్షులు యామా రమేష్, పిఆర్టియు టిఎస్ ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్షులు తంగేళ్ల వాసుదేవరెడ్డి, నిమ్మల శ్రీనివాస్, మాజీ ఎస్ఆర్జీ యానాల వెంకటరెడ్డి, ఏఎస్ఎం పిడి హరి సుబ్రహ్మణ్యం, భీమిరెడ్డి రామిరెడ్డి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, రవీందర్ రెడ్డి, సుధీర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి

మంథని, ( జనంసాక్షి ) : స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి మంథనిలోని అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించడం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహాలక్ష్మి స్కీంను ఆర్టీసీ కార్మికులు విజయవంతం చేస్తున్నారని, ఈ క్రమంలో వారు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. సమ్మె కార్మికుల హక్కు అని, దానిని నిర్వీర్యం చేసే చర్యలు ప్రభుత్వం విడనాడాలని అన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో కార్మికులను ఇతర రీజియన్లకు పంపే చర్యలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యమానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వేల్పుల సురేష్, కార్మిక సంఘం నాయకులు సర్వర్, రవీందర్ పాల్గొన్నారు.

## జీవన్‌ధార ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం

- ఐఎంఏ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన ఓరేషన్స్, సిఎంఈ కార్యక్రమం విజయవంతం
- కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. పి. కిషన్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 19 (జనంసాక్షి):** ప్రతిష్టాత్మకమైన ఐఎంఏ కరీంనగర్ ఓరేషన్స్ , సిఎంఈ కార్యక్రమం 19 ఏప్రిల్ 2026న ప్రతిమా మల్టీప్లెక్స్ కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించబడింది. కరీంనగర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో వైద్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి.కిషన్ ప్రారంభించగా, ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షురాలు డా. ఎ.శైలజా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధ్యక్షులు డా. కె.శ్యాంసుందర్, డా. ఈ.విజయేంద్ర రెడ్డి, డా. బి.ఎన్. రావు, డా.వి. సూర్యనారాయణ రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డా. ఎన్. మహేష్ బాబు, కోశాధికారి డా. వి. నీలిమా పాల్గొన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు ప్రతిష్టాత్మక స్మారక ఒరేషన్స్ అందించారు. సన్‌షైన్ హాస్పిటల్స్, హైదరాబా ద్ చైర్మన్ డా. ఏ.వి. గురువా రెడ్డి డా. ఐ. శ్రీధర్ రావు ఒరేషన్ అందించా రు. ప్రముఖ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్స నిపుణుడు డా. సిహెచ్. మధుసూదన్ ఒరేషన్ అందించారు. సీనియర్ శిశు వైద్య నిపుణుడు డా. కె. ఇంద్రశేఖరరావు డా. లక్ష్మణ్ కుమార్ ఒరేషన్ అందించారు. డా. ఎం. విజయ్ మోహన్ రెడ్డి, డా. ఎ. లక్ష్మీనారాయణ ఒరేషన్ అందించారు. డా. శశికళ కోలా ప్రత్యేక అతిథి ఉపన్యాసం ఇవ్వగా, రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన డా. బంగారి స్వామి గ్రామీణ ప్రాంతాల్లో వైద్య వృత్తిని ఎలా విజయవంతంగా కొనసాగించాలనే అంశంపై ప్రసంగించారు. అనేక మంది ప్రముఖ వైద్యులు ఆధునిక వైద్య రంగానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ఉపన్యాసాలు అందించారు. అన్ని ఒరేటర్లను, స్పీకర్లను ఐఎంఏ కరీంనగర్ ఘనంగా సత్కరించింది. ఈ సమావేశంలో ప్రధాన ఆకర్షణగా జీవన్‌ధార ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. దీన్ని డా. సిహెచ్. మధుసూదన్ ప్రారంభించారు. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, దాతల కొరత ఎక్కువగా ఉందని, అవగాహన లోపం, సామాజిక అపోహల వల్ల అవయవ దానం తగ్గిపోతుందని తెలిపారు. మీడియా ఈ విషయంలో చైతన్యం కల్పించాలని కోరారు. ఈ సదస్సుకు కరీంనగర్, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి సుమారు 1000 మంది వైద్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని డాక్టర్ల బృందం తెలిపారు.

### వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ

యాచారం, ఏప్రిల్ 19 (జనం సాక్షి ): వి ఆర్ వన్ పౌండేషన్ సహకారంతో మల్కీజుగూడలో తాగునీటి వాటర్ ప్లాంట్ కు సర్పంచ్ దేరంగుల శంకర్, వార్డు సభ్యులు, రెడ్డ మోని వెంకటేష్ భూమి పూజ నిర్వహించి పునాదులు తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉప సర్పంచ్ రెడ్డమోని శిరీష వెంకటేష్ యాదవ్ కృషితో వి ఆర్ వన్ ఫౌండేషన్ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. వేసవికాలం దృష్ట్యా గ్రామంలో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా, వాటర్ ప్లాంట్ తో శుద్ధమైన నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు వి ఆర్ వన్ పౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## స్టేట్ ర్యాంకర్లను సన్మానించిన జూపల్లి అరుణ్ కుమార్

- రావుస్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించడం ఉమ్మడి జిల్లాకే గర్వకారణం



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 19 జనంసాక్షి :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రావుస్ కళాశాల విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడంతో జూపల్లి అరుణ్ కుమార్ వారిని ఘనంగా సన్మానించారు.ఆదివారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలో ని స్టేట్ ర్యాంకులు సాధించిన రావుస్ కళాశాల విద్యార్థులనుద్దేశించి ఈ జూపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం, ఉమ్మడి జిల్లాకే గర్వకారణమని, ఆయన కొనియాడారు. విద్యార్థుల ప్రతిభను వెలుగు తీసి రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధించేందుకు దోహదపడిన లెక్చరర్లు కళాశాల యజమాన్యానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆకాంక్షించారు. కష్టపడి చదివి ఐఏఎస్ ఐపీఎస్ డాక్టర్ కావాలని అప్పుడే తల్లిదండ్రుల కల నెరవేర్చిన పిల్లలుగా గుర్తింపు పొందుతారు అన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి, భవిష్యత్తుకు బాటలు వేసి వేయాలన్నారు. వనపర్తి జిల్లాను దేశంలోనే గర్వించదగ్గ స్థాయికి తీసుకుపోవాలని విద్యార్థులను కోరారు. రావుస్ కళాశాల విద్యార్థులు సీనియర్ ఎంపీసీ బైపీసీ జూనియర్ ఎంపీసీ బైపీసీలలో 996, 994, 468 438 మార్కులు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ మార్కులు సాధించి రాష్ట్రంలోనే వనపర్తిని, విద్యా పర్తి గా గుర్తింపు తెచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్ గోవర్ధన్ సాగర్, కల్వరాల కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ , ఎంపిడిఓ కృష్ణయ్య, రావూస్ కళాశాల యాజమాన్య సభ్యులు. బన్నూరు రమేష్ రెడ్డి,ఏ. శ్రీనివాస్,పి. పి. అమరేందర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ రామ్ కుమార్,కొండ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.





## సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం

- వెల్జాల్‌లో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**తలకొండపల్లి ఏప్రిల్ 19(జనంసాక్షి):** బడుగు,బలహీన వర్గాల ప్రజలను వేధించిన వారిపై పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆదివారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,బీసీ జాతీయ మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆయిల్ వెంకన్న,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య,లు హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రసంగించారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే పార్టీలు రాజకీయంగా వాడుకుంటున్నాయని,బహుజనుల హక్కుల సాధన కోసం బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేస్తే తప్ప మనకు సమన్యాయం దొరకదని తెలిపారు.తెలుగు గడ్డపై తిరుగుబాటు చేసి 33 కోటలను జయించి స్వాతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేసి గోల్కొండ కోటను 6నెలల పాటు పాలించిన గొప్ప బహుజన వీరులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వెల్లడించారు.అణగారిన వర్గాల హక్కుల కోసం ప్రాణాలర్పించిన గొప్ప పోరాటయోధుడని పేర్కొన్నారు.అలాంటి మహానుభావుల పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ..ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు సమన్యాయం చేస్తున్నామని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో కల్లు దుకాణాలను రద్దుచేసి గౌడ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తర్వాత గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు,వృత్తిని ప్రోత్సహించడానికి మద్యం దుకాణాల టెండర్లలో 15 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు.గౌడ కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ యాట గీత నరసింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్,పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ,తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,మండల గౌడ సంఘం అధ్యక్షులు బాల కుమార్ గౌడ్,కల్వకుర్తి జేఏసీ అధ్యక్షులు సదానంద గౌడ్,వెల్జాల్ గౌడ సంఘం అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు రఘు రాములు,పయ్యావుల రమేష్ యాదవ్,కాకి కృష్ణ,రేణు రెడ్డి,యాదయ్య,బిజెపి నాయకులు రవి గౌడ్,శేఖర్ రెడ్డి, సుదర్శన్, బీఆర్ఎస్ నాయకులు జోతయ్య,అశోక్ గౌడ్,సుధాకర్,శ్రీశైలం యాదవ్, విఠల్, పవన్ వాల్మీకి, విష్ణు గౌడ్, శ్రీశైలం గౌడ్,మల్లేష్ గౌడ్,ప్రకాష్ గౌడ్, నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




**ఫీజు రాయితీ పేరుతో వల...**

'ఇంటర్ కు మీ పిల్లలను మా కాలేజీలోనే చేర్పించండి, ముందుగానే అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తాం' అని చెబుతున్నారు. మరికొందరైతే 'మా కాలేజీలో హాస్టల్ వస తితో కలిపి ఫీజు రూ.90 వేల నుంచి రూ.1.60 లక్షలు. డేస్కాలర్ అయితే రూ.70వేల నుంచి రూ.90 వేలు ఉంది. ఇదే ఫీజుతో నీట్ కోచింగ్ కూడా ఇస్తాం. అడ్మిషన్ కావాలంటే రూ.10 వేలు చెల్లించి సీటు రిజర్వు చేసుకోండి' అని ఒత్తిడి తెస్తున్నారు. గత నెల నుంచి కాలేజీల పీఆర్ఓలు స్కూళ్లు, ఇళ్ల చూట్టు తిరుగుతున్నారు. ఆడ్మిషన్లు చేయించకుంటే మీ స్థానంలో మరొకరు వస్తారంటూ పీఆర్వోలను కాలేజీల యాజమాన్యాలు పరోక్షంగా బెదిరిస్తున్నట్లు ఓ ప్రముఖ కార్పొరేట్ కాలేజీ పీఆర్ పేర్కొన్నారు.



# అప్పుడే అడ్మిషన్ల గోల

## అడ్మిషన్లు తెస్తేనే ఉద్యోగం

### ప్రైవేటు ఉపాధ్యాయుల మెడపై కత్తి

- అడ్మిషన్ల కోసం ఎండలో రోడ్డునపడ్డ టీచర్లు
- కార్పొరేట్ కాలేజీల ముందస్తు లాబీయింగ్
- టెన్త్ విద్యార్థుల ఇళ్ల చుట్టూ పీఆర్వోల ప్రదక్షిణ
- ఫీజులో ప్రత్యేక రాయితీలంటూ వల
- ప్రతిభావంతులైన విద్యార్థుల ఇంటికి పీఆర్వోలు
- సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** పదవతరగతి పరీక్షలు పూర్తై ఫలితాలు రాకముందే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యం విద్యార్థులను తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నా లు ప్రారంభించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డితో పాటు పటాన్ చెరువు, అమీన్పూర్, జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట తదితర ముఖ్య పట్టణాలలో విద్యార్థుల వేట మొదలుపెట్టారు. ఆయా కార్పొరేట్ కళాశాలల యాజమా న్యాలు పదవ తరగతి విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్‌లో సంప్రదించి తమ కళాశాల లో అన్ని వసతులు ఉన్నాయని ఫీజులో రాయితీ ఉంటుంద ని మీ పిల్లలను తమ కళాశాలలో చేర్పించాలని వేడుకుంటు న్నారు. కళాశాలల యజమాన్యం వీఆర్వోల ద్వారా ఫోన్ చేయిస్తున్నారు.

**రాయితీలు ఇస్తామంటూ ఫోన్ కాల్...**

'సార్, మేము ఫలానా కాలేజీ నుంచి మాట్లాడుతున్నాం... మీ పిల్లాడిని మా కాలేజీలో చేర్పించండి, ఫీజులో రాయితీలు ఇస్తాం...పదవ తరగతి పరీక్షల్లో మంచి గ్రేడ్ పాయింట్లు వస్తే ఫీజు మరింత తగ్గిస్తాం'.. అంటూ కార్పొరేట్ కాలేజీల నుంచి ఫోన్లు చేస్తున్నారు. మునిపల్లి మండలంలోని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులకు కార్పొరేట్ కాలేజీల పీఆర్ఓల నుంచి తనకు రోజుకు మూడు, నాలుగు ఫోన్ కాల్స్ వస్తున్నట్లు వారు తెలిపారు. పదో తరగతి విద్యా ర్థుల తల్లిదండ్రులందరిదీ ఇదే పరిస్థితి. ఆడ్మిన్ ఇంటి దగరే చేయిస్తామంటే వస్తామని మరీ చెబుతున్నారు. వచ్చే ఏడాది జూన్ లో మొదలయ్యే ఇంట ర్మీడియట్ అడ్మిష న్లకు ఇప్పటి నుంచే ఇలా ఒత్తిడి పెడుతుండడంపై విద్యార్థుల తల్లి దండ్రులు విస్తుపోతున్నారు. ఇంటర్ విద్యపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, కార్పొరేట్ కాలేజీలు ఇష్టానుసారం గా వ్యవహరిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

**అడ్మిషన్ల కోసం మండుటెండలో...**

సెలవుల్లో జీతం లేకపోయినా ఉద్యోగం ఊడిపోతుందనే భయంతో ప్రతి సంవత్సరం పాఠశాల పరిధిలోని వివిధ కాలనీలలో ఉదయం నుండి మధ్యాహ్నా వరకు మండే ఎండలను సైతం

**లేక్కచేయక ఇంటింటికీ తిరుగుతున్నారు.**

నిరుద్యోగుల అవసరాన్ని ఆసరా వేసుకొని ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇన్ని ఆడ్మిషన్లు తెస్తేనే పాఠశాలలో ఉద్యోగం ఇస్తామని తెగేసి చెబుతుండటంతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బందీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందనే విమర్శ లు ఉన్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల మద్య ఉన్న పోటీని నిలబె బుకోవడానికి పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగుల మీద ఒత్తిడిని పెంచుతున్నారనే విమర్శ లు ఉన్నాయి. అన్ని ఒత్తిళ్లు తట్టుకొని పనిచేసినా అరకొర జీతాలే... ఉద్యోక భద్రత లేదని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాల గడ్డపై గులాబీ గర్జన



**జగిత్యాల బ్యూరో ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి జగిత్యాల వేదిక కాబోతోంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నేడు జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. దాదాపు ఏడాది కాలం తర్వాత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో, ఈ ప్రజా ఆశీర్వాద సభ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్న ఈ సభ కేవలం రాజకీయ ప్రసంగా లకే పరిమితం కాకుండా, కీలక చేరికలకు వేదిక కానుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ స్వయంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించను న్నారు. ఇది ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎశ్రీఎ రమణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్, కౌశిక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు తో కలిసి రెండు సార్లు పర్యవేక్షించారు. సుమారు ఒక లక్ష మంది జనం వచ్చేలా పక్కా ప్లానింగ్‌తో ఇంచార్జ్‌లను నియమించారు. సభకు వచ్చే కార్యకర్తలకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా 2 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 3 లక్షల వాటర్ బాటిళ్లు సమకూర్చారు. ఈ సభ బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే కాకుండా, రాష్ట్రంలో పార్టీ జైత్రయాత్రకు నాంది పలుకుతుంది అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సభకు ఒక రోజు ముందే జగిత్యాల పట్టణమంతా గులాబీమయంగా మారింది. ప్రధాన కూడళ్లలో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. కార్యకర్తల్లో ఉ త్సాహం నింపేందుకు స్థానిక నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

**కేసీఆర్ ఏం మాట్లాడబోతున్నారు?**

చాలా కాలం తర్వాత మైక్ పట్టనున్న కేసీఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేస్తారు? హామీల అమలుపై సర్కారును ఎలా నిలదీస్తారు? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై కేసీఆర్ ఘాటుగా స్పందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# కరీంనగర్ డీసీసీలో స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ ఓరియెంటేషన్, ట్రైనింగ్

- బూత్ లెవల్ ఏజెంట్లకు పూర్తి అవగాహన కల్పించిన మైనారిటీ డిపార్ట్‌మెంట్
- ఎన్‌మరేషన్, సెల్ఫ్ మ్యాపింగ్, క్లెయిమ్స్-ఆబ్జెక్షన్స్‌పై వివరణ




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 19 (జనంసాక్షి):** కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ 2026 ఓరియెంటేషన్, ట్రైనింగ్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీసీసీ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర, బాధ్యతలు, ఎన్‌మరేషన్ ఫార్ములు, ఓటర్ల ధృవీకరణ, సెల్ఫ్ మ్యాపింగ్, ప్రోజెనీ మ్యాపింగ్, క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ ప్రక్రియ వంటి అంశాలపై మాస్టర్ ట్రైనర్లు అబ్దుల్ ముజీబ్ అయ్యూబ్, ఎహ్తెషామ్ ఉల్ హక్, వసీం అక్రమ్ వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, పారదర్శక ఓటరు జాబితా తయారీలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని ప్రజలకు సహాయం చేయాల ని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ 2026 ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లుగా సేవలందించడానికి ఆసక్తి చూపిన కార్యకర్తలు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి న విధానాలు, సాంకేతిక విషయాలపై పూర్తి అవగాహన పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏస్టీ సెల్ చైర్మన్ శ్రవణ్ నాయక్, నేహాల్ అహ్మద్, అహ్మద్ అలీ లేయిక్ ఖాద్రీ, అబ్దుల్ రహేమాన్, ముస్తాక్ అహ్మద్, ఎం.డి. చాంద్, ఆమె ర్, గంగుల దిలీప్, జమీల్ అహ్మద్, భాయ్ బషీర్ అబ్దుల్, బారి ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడు నర్సింలు గౌడ్**



**బొంరాస్ పేట, ఏప్రిల్ 19 (జనం సాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నాడని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడు నర్సింలు గౌడ్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని జానకంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించారు.అనంతరం ఎనిమిది తండాలో ఇందిరమ్మ లబ్ధిదారు నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.రూ.10 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంతో శరవేగంగా పనులు కొనసాగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశం, జానకంపల్లి సర్పంచ్ వెంకటయ్య,వడిచర్ల సర్పంచ్ గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్, డాక్య నాయక్,మహేందర్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

# పేదోడి సొంతింటి కల సాకారం చెయ్యడమే ప్రభుత్వ లక్ష్యం



**శామీర్ పేట్, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** పేదల సొంతింటి కలను సాకారం చేయ్యడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి పేర్కొన్నారు.శామీర్‌పేట్ 300వ డివిజన్ సింగాయిపల్లిలో ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా భీమిడి జైపాల్ రెడ్డి హాజరై ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి లబ్ధిదారులు సమీనా బేగం,షేక్ ఇమ్రాన్ దంపతులు సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించుకున్న గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారికి శుభా కాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇలాంటి సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.ప్రభుత్వం అందించే సహాయాన్ని లబ్ధి దారులు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం అతిథులను సన్మా నించారు.ఇళ్లు పూర్తవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, సహకరించిన నాయకులు మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పారనంది బాల్ రాజు,మహమ్మద్ జాఫర్, రాజ బోయిన శ్రీనివాస్ యాదవ్,పిన్నింటి ధర్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మిర్యాలకర్ సాయి కుమార్, నక్క మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత భద్రతకు డిజిటల్ లిటరసీ ఎంతో ముఖ్యం

**సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం రమేష్**



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డిజిటల్ లిటరసీని అవగాహన చేసుకోవడం ద్వారా సైబర్ పరంగా మరింత భద్రతను పొందవచ్చని సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం రమేష్ తెలిపారు. 'దిల్ సే ట్రైన్ – ద – ట్రైనర్' పేరుతో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సౌజన్యంతో సైబరాబాద్ పోలీస్ అధికారులు నిర్వహించిన కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం సిపి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించా రు. ఎస్సీఎస్సీ ఫోరం జాయింట్ సెక్రెటరీ రఘు కన్నన్ పర్యవేక్షణలో నిర్వహించిన రెండు రోజుల కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఐటి కారిడార్ పరిధి ప్రతినిధులు పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా ఎస్సీ ఎస్సీ ఆర్గనైజేషన్ సిఈఓ నవీద్ ఖాన్ మాట్లాడుతూ ఈరోజుల్లో ఇంటర్నె ట్ మనిషి దైనందిన జీవితంలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుందని, దాని పట్ల అవగాహన పెంచుకునే వారికి అది పాజిటివ్ రోల్ ను అందిస్తుం దన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన, డిజిటల్ ఫుడ్ ఫ్రెండ్స్, సామాజిక మాధ్యమాలలో తప్పుడు వార్త కథనాలు పుట్టుకొస్తున్న తీరుతెన్నులు, ఆన్లైన్ గేమింగ్, సోషల్ ఇంజనీరింగ్ స్కామ్స్ తదితర అంశాలపై అఅవగాహన కార్యక్రమంలో కూలంకషంగా చర్చించడం జరిగిందని సైబరాబాద్ సిపి వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా వచ్చే సందేశాలు, మొబైల్ ఫోన్ లోకి వచ్చే ఏపికె ఫైల్స్, ఆకర్షణీయమైన ప్రకటనలను ప్రజలు నమ్మవద్దని, ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల సాంకేతిక పరిజ్ఞానం లభించి సైబర్ ఫ్రాడ్ ల నుండి తప్పించుకునేందుకు ఎన్నో అవకాశాలు లభిస్తాయి అన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు మోసపోయిన మొదటి గంట( గోల్డెన్ హవర్ )లోపే సంబంధిత పోలీస్ అధికారులకు 1930 డయల్ చేయడం ద్వారా సమాచారాన్ని అందిస్తే సాధ్యమైనంతవరకు వారి తమ్మును సైబర్ నేరగాళ్లు దొంగిలించకుండా అడ్డుకునే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ డిసిపి సాయి మనోహర్, ఎస్సీఎస్సీ అసోసియేట్ డైరెక్టర్ భానుమూర్తి, సైబర్ సెక్యూరిటీ ఫోరం ప్రతినిధులు కృష్ణవేణి, రియాజుద్దీన్, ఎస్సైలు సందీప్ రాజ్, మౌనిక, ఎస్సీఎస్సీ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, ఇతరులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన సీసీ రోడ్డు, విద్యుత్ లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కొండ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**బోయినిపల్లి, ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని బోయిని పల్లి మండలం కోరెం గ్రామంలో ఆధ్యాత్మిక శోభతో పాటు అభివృద్ధి పనులు మెరిశాయి. గ్రామంలోని కొండ పోచమ్మ ఆలయానికి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును, కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం ఆదివారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. పురాతనమైన, మహిమాన్వితమైన కొండ పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో భక్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యంత వేగంగా సీసీ రోడ్డు పనులను పూర్తి చేయించామని, రాత్రి వేళల్లో వెలుగులు నింపేందుకు నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేశామని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### అంజన్న దర్శించుకున్న రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్


**మల్యాల :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆదివారం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ స్థానాచారి కపిందర్ స్వామి కమిషనర్ స్వామివారి శేష వస్త్రం తో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. కమిషనర్ వెంట స్థానిక ఎస్ఐ నరేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ పాల్గొన్నారు.

### తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతి

**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 19 (జనం సాక్షి):** తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని చింతపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసు కున్నది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఎనిగళ్ల వీరభద్రం (48) గత కొన్నేళ్లుగా తాడిచెట్లు ఎక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం సాయంత్రం తాడిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ఒక్కసారిగా మోకు జారి కిందపడ్డాడు. గమనించిన చుట్టు పక్కల వాళ్లు వచ్చి చూడగా బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటి పెద్దను కోల్పవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించిం ది. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, గౌడ సంఘ ప్రముఖులు మృతదే హాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతు నికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

# నీటి సరఫరా లేకపోతే అభివృద్ధి ఆగిపోతుంది

**ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు**




**ఖైరతాబాద్, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** నగర అభివృద్ధిలో భాగంగా ఏర్పాటయ్యే రహదారులు, రవాణా, పరిశ్రమలతో పాటు ప్రజలకు మంచినీటి సరఫరా అత్యంత కీలక భూమిక పోషిస్తుందని, నీటి సరఫరా లేకపోతే అభివృద్ధి ఆగిపోతుందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో నిర్వహించిన నాల్గవ తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో 'ఇన్నో వేషన్, ఇండస్ట్రీ, అర్బన్ డెవలప్‌మెంట్' సెషన్‌లో డాక్టర్ రామేశ్వర్ రావు ప్రసంగించారు. పెరుగుతు న్న హైదరాబాద్ నగర జనాభాను దృష్టిలో ఉంచు కుని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, మంజీర, సింగూర్ జలాశయాలతో పాటు కృష్ణా నది నుండి మూడు దశల్లో, గోదావరి నుండి మొదటి దశలో ప్రస్తుతం హైదరాబాద్‌కు నీటి సరఫరా జరుగుతోం దని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి రెండో దశ, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు నుండి కూడా నీటి విడు దలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పా రు. ఈ సందర్భంగా దేశంలోని నీటి పరిస్థితులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. ఈ సమావేశంలో పిఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ కంభంపాటి యాదగిరి, కాన్ఫరెన్స్ డైరెక్టర్ వై.బాబ్జి, యు.ఎస్.శర్మ, చాప్టర్ సెక్రటరీ రాజేష్ కల్యాణ్, వి.మధుసూదన్ పాల్గొన్నారు. తొలి సెషన్‌లో మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి.హెచ్.ప్రియాంక, ప్రొ.నాగేశ్వర్ పాల్గొన్నారు.

# మోడీ, ట్రంప్, నిర్ణయాల వల్ల దేశ రైతన్నకు అన్యాయం


- ఆ ఇద్దరు.. భారత రైతుల ప్రాణాలతో చెలగాటమడుతున్నారు
- యూఎస్ ట్రేడ్, డీల్ వల్ల రైతన్నలకు ఆత్మహత్యలే శరణ్యం
- వెంటనే యూఎస్ ట్రేడ్ డీల్ ను వెనక్కి తీసుకోవాలి
- ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి ప్రతినిధి/షాద్ నగర్ (జనంసాక్షి) :** మోడీ, ట్రంప్, నిర్ణయాల వల్ల భారతదేశ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వెంటనే యూఎస్ ట్రేడ్ డీల్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ట్రంప్,మోడీ భారత రైతన్నల ప్రాణాలతో చెలగటమడుతున్నారని, యూఎస్ ట్రేడ్ డీల్ వల్ల రైతన్నలకు ఇక ఆత్మహత్యలె శరణ్యమని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం నాడు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూఎస్ ట్రేడ్ డీల్ వల్ల ఈ దేశ రైతన్నలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రైతులు పండించిన పంట కు ధర తగ్గితే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీన్ని పక్కన పెట్టేసిన మోడీ అమెరికాకు లొంగి భారత రైతన్నకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. గతంలో కూడా మూడు రైతు నల్ల చట్టాలను తీసుకొస్తే రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడామ ని, భారతదేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా వ్యాణిజ్య సంస్థల ముందు మోడీ తాకట్టు పెట్టారని, ఆదానీ, అంబానీలా కాపాడాందుకే దేశవ్యాప్తంగా రైతులకు మోడీ నిర్ణయాల వల్ల నష్టం జరుగుతుందని వివరించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుతూ ఈ దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పార్లమెంటులో పోరాడుతున్నారని, కానీ బిజెపి ప్రభుత్వం మాత్రం మహిళా బిల్లు ముసుగులో ఢిలిమెడిటేషన్ బిల్లు తెచ్చారని, దాన్ని ఆయా ప్రాంతీయ పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా వ్యతిరేకించిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరును ఈ దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి జంగా నర్సింహా, శేఖర్,రఘు, ఇబ్రహీం పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రుద్రంగి ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** రుద్రంగి మండలకేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్ర మాన్నీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ నగేష్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... .రైతులు పండించిన పంటలకు మద్దతు ధర గ్రేడ్ ఏ రకం 2389,సాధారణ రకం 2369 ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, వివరించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మేలైన వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామని తెలిపారు.రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని అలాగే రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందని వెల్లడిం చారు. సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు బోనస్‌గా రూ.500 ఇస్తున్నదని తెలిపారు. రేష న్ దుకాణాల్లో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగు తుంద ని అన్నారు. రైతుల పంటపొలాలు ఎండిపోకుండా ఉండేందుకు మూడు సార్లు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.ప్రతి ఒక్క రైతు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో, సర్ప ంచ్ గండి నారాయణ,ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డుమెంబర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 20 ఏప్రిల్ 2026



## జలమండలికి మూడు పీఆర్ఎస్ఐ అవార్డులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటికే పలు అవార్డులు గెలుచుకున్న జలమండలి... తాజాగా మరో మూడింటిని తన ఖాతాలో వేసుకుంది. పీఆర్ఎస్ఐ (పబ్లిక్ రిలేషన్స్ సోసైటీ ఆఫ్ ఇండియా) తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్- తెలంగాణ రైజింగ్-2047 భాగంగా సోసైటీ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో జలమండలికి మూడు బహుమతులు లభించాయి. ఓఆర్ఆర్ పరిధిలో భూగర్భ జలాల పెంపునకు అవగాహన కోసం బ్రోచర్ రూపొందించిన జలమండలి.. వివిధ మాధ్యమాల్లో ప్రజలకు అవగాహన కల్పించింది.. దానికి మొదటి బహుమతి లభించింది. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజులు స్పెషల్ డ్రైవ్ పైన రూపొందించిన డాక్యుమెంటరీకి కార్పొరేట్ వీడియో ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ఫీచర్ విభాగంలో ద్వితీయ బహుమతి లభించింది. అలాగే ఇంకుడు గుంతల నిర్మాణంపై సాంకేతిక సమాచారంతో వివరణాత్మకంగా రూపొందించిన పోస్టర్ కు "బెస్ట్ లేఅవుట్ అండ్ డిజైన్" కేటగిరీలో ద్వితీయ బహుమతి లభించింది. హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఆదివారం జరిగిన పీఆర్ఎస్ఐ తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ లో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక ఐఏఎస్, ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిసి జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పీఆర్వో సుభాష్, గ్రౌండ్ వాటర్ ఎక్స్పర్ట్ సత్యనారాయణకు ఈ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. దీనికోసం కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.



## విలువలతో జీవించే వ్యక్తులే సమాజానికి ఆదర్శనీయులు

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్
- రిటైర్డ్ ఎస్పీ మహేందర్‌కు సన్మాన సభ

**అలంపూర్ (జనంసాక్షి) :** సామాజిక విలువలు, కుటుంబ విలువలు ఛిద్రమవుతున్న కాలంలో విలువలతో జీవితాన్ని కొనసాగిస్తూ నిలిచిన వ్యక్తులను సమాజం ఆదర్శంగా తీసుకోవాలని బహుజన ఉద్యమ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. పోలీస్ శాఖలో 35 సంవత్సరాలు పనిచేసి ఆ శాఖ గౌరవాన్ని పెంచిన అరుదైన వ్యక్తుల్లో రిటైర్డ్ ఎస్పి సంధ్య పోగు మహేందర్ ఒకరిని పేర్కొన్నారు. అట్టడుగు వర్గం నుంచి వచ్చిన మహేందర్ పోలీస్ అధికారిగా సమన్యాయం పాటిస్తూ వ్యక్తిగత జీవితంలో విలువలే ప్రాణంగా జీవించారని చెప్పారు. మహేందర్ లాంటి వ్యక్తుల జీవితాలు రాయబడిన జీవన కావ్యాలుగా ఉంటాయని అభివర్ణించారు. ఆదివారం తన సొంతూరు ఆలంపూర్లో జరిగిన మహేందర్ పదవీ విరమణ మహోత్సవ సభకు అతిథులుగా విచ్చేసిన జూలూరు గౌరీ శంకర్ రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డిలు మహేందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలో తండ్రి చనిపోతే ఆరుగురు చెల్లెళ్ల ఇద్దరు తమ్ముళ్ల భారాన్ని మహేందర్ తన మీదే వేసుకొని వాళ్ళ కోసం జీవితాంతం శ్రమించారని గుర్తు చేశారు. చెల్లెలు అందరి వివాహాలు జరిపించి,వాళ్ళ పిల్లల బాధ్యత లు కూడా తానే చూసుకున్న నిస్వార్థ జీవి మహేందర్ అని చెప్పారు. కుటుంబం కోసం తన సుఖాలను వదులుకొని వివాహం కూడా చేసుకోలేదని వారు ఈ సందర్భంగా చెప్పారు. వృత్తి రీత్యా పోలీస్ శాఖలో అనేక ప్రశంసలు అందుకున్నారని, న్యాయం కోసం నిలిచిన వ్యక్తిగా,మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. తల్లిదండ్రుల బాగోగులను చూసుకోని బిడ్డలపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్న తరుణంలో కుటుంబం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఎస్పీ మహేందర్ల జీవితాల నుంచి కొత్త తరం స్ఫూర్తి పొందాలన్నారు. కుటుంబ విలువలే మంచి సమాజ నిర్మాణానికి బలమైన పునాదులు వేస్తాయని చెప్పారు. ఈ సన్మాన సభలో నల్గొండ ఇంటలిజెన్స్ ఎస్పి ఎం శ్రీనివాసులు, మెదక్ జిల్లాకు చెందిన పలువురు పోలీస్ అధికారులు,బంధువులు, మిత్రులు పాల్గొన్నారు

## నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

- రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోండి
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- అతివేగంతో కుటుంబాలను అగాధంలోకి తోయొద్దు : మంత్రి సీతక్క



**ములుగు ప్రతినిధి, మార్చి 19(జనంసాక్షి) :** నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ములుగు జిల్లాలోని ఇంచర్ల గ్రామ శివారులోని ఎం ఆర్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను అందించి బైక్ ర్యాలీని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రి సీతక్కతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వేదికపై అందరితో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పై, అవగాహన కల్పించేల చేస్తున్నామని తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్క వాహనదారులు తూచా తప్పకుండా పాటించాలని, సురక్షిత ప్రయాణం కుటుంబాలకు సంతోషాన్ని కలిగిస్తుందని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణహాని తప్పదని హెచ్చరించారు. పోలీస్ శాఖ వాహన తనిఖీలు చేసేది కేవలం ప్రజా సంక్షేమం కోసమే అని, ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని, మీ కోసం మీ ఇంటి వద్ద కుటుంబం వేచి ఉందనే విషయాన్ని గుర్తు చేసుకుంటూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ సురక్షితంగా ఇంటికి చేరాలని తెలియచేసారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అతివేగంతో కుటుంబాలను అగాధంలోకి తోయవద్దని, మితిమీరిన వేగం వద్దు సురక్షిత ప్రయాణం ముద్దు అని పేర్కొన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని ప్రతి ఒక్క వాహనదారుడు గుర్తు చేసుకుంటూ క్షేమంగా ప్రయాణించాలని కోరారు. స్వీయ రక్షణ భద్రత నియమాలు పాటిస్తూ గమ్యస్థానాలను చేరాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా మీ కుటుంబాలతో పాటు అవతలి వ్యక్తి కుటుంబాలు కూడా నష్టపోయే ప్రమాదం ఉందనే విషయాన్ని అవగతం చేసుకొని పూర్తిగా మద్యపాన డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని వాహనాలు ఓవర్టేజ్ చేసే సమయంలో కచ్చితంగా కుడివైపు నుంచి చేయాలని ప్రమాదాలకు గురి కాకుండా డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ మాట్లాడుతూ ప్రతిరోజు రాష్ట్రంలో 20 మంది రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారని ఏటా 7500 మంది చనిపోతున్నారని దేశవ్యాప్తంగా 1,50,000 మంది వరకు మరణిస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. టూవీలర్ నడిపి వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎవరు కూడా రాసి డ్రైవింగ్ చేయకూడదని అన్నారు. వెనకాల కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్స్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి

### అబద్దాలతోనే మహిళలను వంచించారు

- మహిళా బిల్లును అడ్డుకుని దక్షిణాదికి తీరని ద్రోహం చేస్తున్నారు
- కేసీఆర్ తరహాలోనే అబద్దాలు, మోసాలతోనే పాలన
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అబద్దాలు, మోసాలనే నమ్ముకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "అభినవ గోబెల్స్" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. అబద్దాలు, మోసాలు చేసే వారినే ప్రజలు నమ్ముతారని బహిరంగంగా ప్రకటించిన రేవంత్ రెడ్డి ఆ అబద్దాల పునాదులపైనే ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని, రాష్ట్రంలోని ప్రతి మహిళలకు ప్రతినెలా రూ.2500లు చెల్లిస్తామని, తులం బంగారం, స్కూటీ ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరహాలోనే దొంగ హామీలు, పచ్చి అబద్దాలతో ప్రజలను మభ్యపెడుతూ పాలనను కొనసాగిస్తున్నారని, నిజాయితీగా పనిచేసే నాయకులపై బురద చల్లడం ఆయనకు అలవాటుగా మారిందని పేర్కొన్నారు. లేనిపోని విష ప్రచారం చేసి మహిళా బిల్లును అడ్డుకోవడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, డీలిమిటేషన్ తో దక్షిణాదికి నష్టం జరగబోతోందని తప్పుడు ప్రచారాలకు తెరదీసి ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు పెరగకుండా కుట్రలు చేశారని దుయ్యబట్టారు. మహిళా బిల్లును అడ్డుకుని ఏదో సాధించామని సంబురాలు చేసుకుంటున్నారని, తెలంగాణ మహిళలతోపాటు దేశంలోని 70 కోట్ల మహిళలెవరూ ఇండీ కూటమి చేసిన అవమానాన్ని ఎన్నటికీ మర్చిపోరని తెలిపారు. అతి త్వరలోనే రేవంత్ రెడ్డిసహా ఇండీ కూటమి నేతలు తగిన మూల్యం చెల్లించుకోవడం ఖాయమని, మహిళలంతా ఏకమై రేవంత్ రెడ్డి సర్కార్ ను గద్దె దించడం తథ్యమని, కాంగ్రెస్ చేసిన మోసాలను తెలంగాణలోని గ్రామగ్రామానికి తీసుకెళ్లేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఆధ్వర్యంలోని పార్టీ నాయకత్వం సిద్ధమవుతోందని తెలిపారు.

## సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం పర్యటన షెడ్యూల్ ఖరారు

- ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం



**కాళేశ్వరం, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ పర్యటనలో భాగంగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం క్షేత్రాన్ని సందర్శించనున్నారు.ఈ మేరకు సిఎంఒ కార్యాలయం నుండి సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం పర్యటన షెడ్యూల్ వివరాలు విడుదల చేసారు.సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 3.00 గంటలకు కాళేశ్వరం హెలిపాడ్ కు చేరుకుంటారు. అక్కడ నుండి ప్రత్యేక కాన్వాయ్ లో 3.05 గంటలకు కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం వెలుపల సూర్యనారాయణ దేవాలయం పక్కన ఈశాన్య స్థలంలో 230 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం హెలికాప్టర్లో మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా సీఎమ్ఓ అధికారులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ , ఎస్పి సిరి శెట్టి సంకీర్త్ , కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ లు ఆదివారం ఆలయాన్ని సందర్శించి సీఎం పర్యటన ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం శంకుస్థాపన చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. భద్రత కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం రాక సందర్భంగా అర్చకులు ఎవరెవరు ఉండాలి, ఎంతమంది పాల్గొనాలనే విషయంపై ఆలయ ఈవో మహేష్ తో చర్చించారు. వారి వెంట గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ శర్మ,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం

### ఐదుగురు వ్యక్తులను కరిచిన వైనం



**నడికూడ, ఏప్రిల్ 19 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా నడికుడ మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ ఐదుగురు వ్యక్తులను కరిచింది తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది ఇద్దరినీ పరకాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిచ్చికుక్క కాటుకుగాయపడిన వ్యక్తులు వంగ మధుకర్, ఎరుకల శ్రీవిద్య, కరాని భార్గవ్, ఎరుకల రిషిత, తుమ్మ దార్షిక ఆస్పత్రిలో చికిత్స పొందడం జరుగుచున్నది వెంకటేశ్వర్లు పల్లి గ్రామంలో ప్రజల ప్రాణాలు తీస్తున్న కుక్కల నుండి ప్రజలను కాపాడాలని వాటిని వెంటనే గ్రామం నుండి బయటకి తరలించాలని కుక్కలను చూస్తే భయభ్రాంతులకు గురి కావడం జరుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అధికారులు స్పందించి కుక్కలను గ్రామం నుండి తరలించే కార్యక్రమం చేపట్టాలని వేడుకుంటున్నారు.

## రీల్స్ మోజులో తుపాకీతో బైక్‌పై స్టంట్లు

- ట్రక్కును ఢీకొని ముగ్గురు సోదరుల మృతి



**భోపాల్ (జనంసాక్షి) :** రీల్స్ మోజులో పడి విపరీతమైన వేగంతో బైక్‌పై విన్యాసాలు (స్టంట్స్) చేస్తూ ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 14న జాతీయ రహదారి-135పై పన్నీ పతారియా సమీపంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. మొత్తం ఐదుగురు యువకులు రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. ఒక పల్సర్ బైక్‌పై ముగ్గురు యువకులు అతివేగంగా వెళ్తుండగా, వారి వెనుక మరో బైక్‌పై వస్తున్న ఇద్దరు స్నేహితులు ఆ స్టంట్స్‌ను తమ మొబైల్‌లో వీడియో తీస్తున్నారు. అదే సమయంలో బైక్ వెనుక కూర్చున్న ఒక యువకుడు చేతిలో నాటు తుపాకీ (కంట్రీ మేడ్ పిస్టల్) పట్టుకుని గాల్లోకి ప్రదర్శిస్తూ హల్‌చల్ చేశాడు. ఈ క్రమంలో హైవేపై వెళ్తున్న భారీ ట్రైలర్‌లను ఓవర్‌టేక్ చేయబోయి వారి బైక్ అదుపు తప్పింది. ముందు ఆగి ఉన్న ట్రక్కును బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పల్సర్ బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. వీడియో తీస్తూ వెనుక వస్తున్న మరో బైక్ కూడా అదుపుతప్పి కింద పడటంతో ఆ ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల ను బేలా గ్రామానికి చెందిన ఉపలక్ష్ కోల్ (17), అమ్రీష్ కోల్ (22), హేమరాజ్ కోల్ (17) అనే ముగ్గురు సోదరులుగా గుర్తించారు.

## కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- నస్తురుపల్లి బహిరంగ సభను విజయవంతం చేయాలి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**కాటారం ఏప్రిల్ 19 (జనం సాక్షి) :** కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వమని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా కింద రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 5563 కోట్ల రూపాయలు విడుదల చేయనున్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, జౌళి, చేనేతల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఆదివారం కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో సోమవారం జరగనున్న రైతు భరోసా నిధుల విడుదల బహిరంగ సభను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి భారత దేశంలో లక్షా 10 వేల కోట్లు ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్ర మని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నిధులు, నీళ్లు, నియామకాల మీద ఏర్పడిన గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో లక్షల కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తరతరాలకు ఉపయోగపడేలా నివేదికల ఆధారంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం అభివృద్ధికి 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటలకు అనుగుణంగా ప్రతి ఎకరాకు సంవత్సరానికి రెండు దఫాలుగా 12,000 వేల రూపాయలు రైతు భరోసా విడుదల చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తదుపరి 73 లక్షల మంది రైతులకు కోటి 15 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైతాంగ సోదరులకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత రైతు భరోసా విడుదల కార్యక్రమం లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాటారం మండలం నస్తురుపల్లి నుండి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, వ్యవసాయ పనిముట్లు, రైతు భరోసా, సన్నవడ్లకు క్వింటాళ్లుకు 500 రూపాయలు బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజును చేసేందుకు ముందుకెళ్తున్నామన్నారు. ముఖ్యమంత్రి సోమవారం కాలేశ్వరం సందర్శించి స్వామిని దర్శించుకుంటారని, కాలేశ్వరం అభివృద్ధికి సంబంధించిన 200 కోట్ల రూపాయలతో చేపట్టిన మాస్టర్ ప్రణాళిక కార్యక్రమానికి భూమి పూజ, శిలాఫలకం ఆవిష్కరణ తదుపరి, మేడిగడ్డ సందర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి, సహచర మంత్రులు పాల్గొననున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు కట్టడానికి ప్రాధాన్యత ఇచ్చారు కానీ నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆయన తెలిపారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న జలవనరుల సంగం నివేదపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యకమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370